శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
హైదరాబాద్

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 10, అక్టోబర్ 2026

వెల: రూ. 25/-




## 24వ పర్యాయం
## 7 కోట్ల జప సమర్పణ



# 24వ పర్యాయం - 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు













# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 10

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
డా॥ టి. గౌరీశంకర్

ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం,
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| వైఖానస యజ్ఞం–శ్రీవారి బ్రహ్మోత్సవం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| అఖిలాండకోటి బ్రహ్మాండాలకు జనని – శ్రీ లలితాంబిక | 21 |
| మార్గదర్శకులు – మహర్షులు | 25 |
| దశరూప ధారిణీ–దనుజ సంహారిణీ | 28 |
| వీణాపుస్తక ధారిణి–విశుద్ధ తత్త్వ ప్రకాశిని | 31 |
| రుక్మాంగదుడు | 36 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 39 |
| మీ ప్రశ్న మా సమాధానం | 42 |
| జయదేవుని 'గీత గోవిందము' (సీరియల్) | 43 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 48 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 54 |
| అనంత పద్మనాభస్వామి వ్రతం | 58 |
| అంగదుడు | 60 |
| దుర్గా నవరాత్రి ఉత్సవం | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# శరణు

శ్రీవేంకటేశం పాఠకులకు శ్రీ పరాభవనామ విజయదశమి శుభాకాంక్షలు. 2002 సంవత్సరం విజయదశమి రోజు శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆవిర్భవించింది. నేటితో సంస్థ ఆవిర్భవించి 24 సం॥లు పూర్తయినవి. ఈ సందర్భంగా మాకు ప్రసాదించిన సేవా కార్యక్రమములను, కర్తవ్యాలను గుర్తు చేసుకుంటున్నాము. శ్రీవేంకటేశ్వరుని మహామంత్రాన్ని పఠిస్తూ, భక్తులచే పఠింపచేస్తూ వారికి తనివితీరా సేవ చేయడమే ఈ సంస్థ ప్రధానోద్దేశం. స్వామి కృపతో 2002 సం॥లో ప్రారంభమైన ఈ జపసమర్పణ సేవ 2026 సం॥ సెప్టెంబర్ మాసంలో 24వ పర్యాయంగా 7 కోట్ల జపసమర్పణను కావించాము. స్వామివారి ఆజ్ఞతో 2004 సం॥ 'నమో వేంకటేశాయ' అనే రథమును ప్రారంభించి 2019 వరకు 16 సం॥ హైదరాబాద్ నుండి తిరుపతి వరకు రథయాత్ర కావించాము. 2007 సం॥ ఉగాది నుండి 'శ్రీవేంకటేశం' మాసపత్రికను స్వామి ఆజ్ఞచే నడుపుచున్నాము. 2011 సం॥లో ప్రారంభించిన భజగోవిందం కార్యక్రమం కూడా నేటికీ కొనసాగుతున్నది. 2021లో మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాల కార్యక్రమమును చేపట్టాము. స్వామి కృపతో ఈ కార్యక్రమం కూడా తేది 27-09-2026 నాడు 111 వ కళ్యాణము చేయుటతో పూర్తయినది.

భగవంతుని లీలలను అర్థము చేసుకొనుట మేధావులకైనా అసాధ్యమే. అలాంటిది మాబోటి అల్పులను ఎన్నుకుని యోగ్యత సాధించుటే ప్రధానంగా ఇన్ని సేవలు ప్రసాదించిన స్వామివారికి శతకోటి ప్రణామాలను అర్పిస్తున్నాము. మరియు మొదట స్వామివారి లక్ష్యమును తెలుసుకోలేక 'యోగ్యత' విషయంలో అంటే మమ్ము మేము సంస్కరించుకొను విషయములో పొరపాటు చేసినందులకు చింతిస్తున్నాము. చివరికి మా సాధనతో పాటు భాగవత ఆశీర్వాద ఫలితముగా శ్రీవేంకటేశ్వరుడు ఆశించిన స్థితికి చేరనప్పటికీ, ఆ మార్గములో పైమెట్టు వరకు వచ్చినందులకు 'హరినామక్షేత్ర' శంకుస్థాపనను తేది 02-07-2026 నాడు జరిపించారు. ప్రస్తుతం ఈ ఆలయ పనులు కొనసాగుతున్నాయి. నిజానికి ఇది ఒక బృహత్ కార్యక్రమము. స్వామివారు ఈ క్షేత్రములో స్థిరనివాసం ఏర్పరచుకుని తర తరాల భక్తులను తిరుమలలో లాగా అనుగ్రహించదలచారు. మరియు ఈ కార్యక్రమములో (క్షేత్ర నిర్మాణములో) వీలైనంత ఎక్కువమంది భక్తులు భాగస్వాములుగా ఉండాలని స్వామివారి అభిమతం. అందులకై 2000 సంవత్సరం నుండి ప్రసాదిస్తున్న వేలాది అనుభూతులను 'దిశా నిర్దేశం' పేరుతో భక్తులకు తెలియచేయుమని ఆజ్ఞాపించారు. స్వామి ఆజ్ఞానుసారం ఏప్రిల్ 2023 నుండి ప్రచురించుట ప్రారంభించి నేటి సంచిక వరకు 43వ భాగము ప్రచురిస్తున్నాము. శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞానుసారం ఎక్కువమంది భక్తులు ఈ హరినామక్షేత్ర నిర్మాణంలో పాలు పంచుకుందురని ఆశిస్తున్నాము.

శ్రీవేంకటేశ్వరా! మేము కలియుగ మానవులము. స్వార్థము, హింస, అసూయ నరనరాలలో జీర్ణించుకున్నవారిమి. అరిషడ్వర్గాలతో నిండియున్న మానవులము. ప్రయత్నించినప్పటికీ సన్మార్గంలోకి రాలేని శక్తి హీనులము. పైగా చంచలిత మనస్సు కలవారిమి. లాభం లేనిది ఏ పనీ చేయలేని స్వభావము కలవారిమి. ఎంత ఉన్నా తరగని ఆశ గలవారిమి. కాబట్టి ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! దయానిధీ! లోకరకక్షకా! ఆపద్బాంధవా! మిమ్ము శరణు వేడుచున్నాము. మమ్ములను రక్షించే బాధ్యత మీది. మా తప్పులను క్షమించి అక్కున చేర్చుకొనుమని ప్రార్థిస్తున్నాము. మరియు ఏది సాధించుటకు మాకు గత 26 సంవత్సరాల నుండి శిక్షణ ఇస్తున్నారో... దానిని నెరవేర్చుమని, భక్తులను రక్షించుమని వేడుకుంటున్నాము.

నమో వేంకటేశాయ

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

**శ్లో॥ లక్ష్మీ మహీ తదనురూప నిజానుభావ**
**నీళాది దివ్యమహిషీ కర పల్లవానామ్**
**ఆరుణ్య సంక్రమణతః కిల సాంద్రరాగౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

తాత్పర్యం – వేంకటేశా! శ్రీదేవి, భూదేవి వారి వంటి నీళాదేవి మొదలగు నీ పట్టమహిషులు తమ చిగుళ్ళవంటి చేతులతో ఒత్తునపుడు, వారి చేతుల ఎఱ్ఱని కాంతులు ప్రసరించుటచే నీ పాదములు మిక్కిలి దట్టమైన ఎఱ్ఱని రంగును కల్గియున్నవి కాబోలు! అట్టి నీ పాదములను శరణు వేడుచున్నాను.

**తే॥ శంఖ చక్ర గదాబ్జ హస్తముల వాడు**
**ఉరమునం దబ్ధిసుత నుంచి పరగు వాడు**
**ఇరుగడల భూమి నీళల నొరయు వాడు**
**దీనపాలన మొనరింప దివురు వాడు ॥**

తాత్పర్యం – వక్షస్థలమున లక్ష్మీదేవి, ఇరువైపులా భూ, నీళలు కలిగి యున్నట్లు వర్ణించింది. వేంగమాంబ వేంకటాచల మాహాత్మ్యము నందే ఆత్మారామునికి ప్రత్యక్షమైన శ్రీనివాసుని వక్షమున వ్యూహలక్ష్మిని, ఇరువైపులా భూదేవి, నీళాదేవులను కలిగియున్నట్లు వర్ణించింది.


## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి. లేదా శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్‌డ్ చెక్‌ను లేదా

**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**



# ముక్తిమార్గము

## రామక్రియ

భక్తికొలఁదివాడే – పరమాత్ముఁడు
భుక్తి ముక్తిఁ దానె యిచ్చు – భువి పరమాత్ముఁడు ॥పల్లవి॥

1. పట్టినవారి చేబిడ్డ – పరమాత్ముఁడు
బట్ట బయటి ధనము – పరమాత్ముఁడు
పట్ట పగటి వెలుఁగు – పరమాత్ముఁడు
ఎట్ట ఎదుటనే వున్నాఁ – డిదే పరమాత్ముఁడు ॥ భక్తి ॥

2. పచ్చిపాలలోని వెన్న – పరమాత్ముఁడు
బచ్చెన వాసిన రూపు – పరమాత్ముఁడు
బచ్చుచేతి వొరగల్లు – పరమాత్ముఁడు
ఇచ్చకొలఁది వాఁడు పో – యీ పరమాత్ముఁడు॥ భక్తి ॥

3. పలుకులలోని తేఁట – పరమాత్ముఁడు
ఫలియించు నిందరికి – పరమాత్ముఁడు
బలిమి శ్రీవేంకటాద్రి – పరమాత్ముఁడు
ఎలమి జీవుల ప్రాణ – మీ పరమాత్ముఁడు ॥ భక్తి ॥





భావము – పరమాత్ముడు భక్తి కొలది వాడు. అనగా పిండి కొలది రొట్టె యన్నట్లు తన పట్ల జీవులెంతగా భక్తి చూపుదురో అంతగా వారిపట్ల ప్రసన్నత జూపువాడని భావము. సకల జీవులకు ఇటు భుక్తిని, అటు ముక్తిని ప్రసాదించువాడు ఆ పరమాత్ముడే.

పరమాత్ముడు తన్ను పట్టినవారికెల్ల చేతి బిడ్డ వంటివాడు. కొందరు చిన్నబిడ్డలు పిలిచిన వారందరి దగ్గరకు పోయి వారిచే లాలింపబడుదురు. అట్లే భగవంతుడు కూడా తన్ను శ్రద్ధతో తలచిన భక్తులకెల్ల స్వాధీనమగుచున్నాడని భావము.

పరమాత్ముడు బట్టబయటి ధనము. భూమి లోపలి నిధియైనచో దానిని వెలికి తీయుటకు పలు ప్రయత్నములు చేయవలయును. బట్ట బయటనున్న ధనమైనచో అందరికీ సులభముగా గ్రహింపనగును కదా! అట్లే భగవంతుడు మరుగు లేక భక్తి గలవారికెల్లరికి సులభ సాధ్యుడగుచున్నాడు.

పరమాత్ముడు పట్టపగటి వెలుగు వంటివాడు. రాత్రి వెలుగు ఎంత పెద్దదైనను పగటి వెలుగువలె కించిత్తైన మసక లేనిదిగా నుండదు. పగటి వెలుగు ఎట్టి సంశయముల కవకాశమియ్యక ప్రకాశించును. ఆ రీతిగానే భగవంతుడు కూడా సంశయముల కెడమియ్యక దివ్యతేజము కలిగి ప్రకాశించుచున్నాడు.

ఇదుగో పరమాత్ముడెదుటనే ఉన్నాడు. భగవంతుడు తన్ను భావించలేనివారికి ఎంతో దూరముగా నుండును. కాని భక్తితో భజించువారికి అత్యంత సన్నిహితుడుగనే ఉండును. ఈ అభిప్రాయముతోనే శ్రుతి 'తద్దూరే తద్వన్తికే' అని పరమాత్ముని దూరస్థునిగాను, సమీపస్థునిగాను వర్ణించినది.

పరమాత్ముడు పచ్చిపాలలో వెన్నవంటివాడు. అనగా వెన్న పచ్చిపాలలో అంతటను వ్యాపించి యున్నట్లే భగవంతుడు సర్వత్రా వ్యాపించి యున్నాడనుట మరియు పాల లోని వెన్న కాచి తోడు పెట్టనిదే చేతికందదు. పరమాత్ముడనెడు వెన్న అట్టి కష్టము లెవ్వియు లేక భక్తిమాత్రముచే స్వాధీనమగునని భావము.

పరమాత్ముడు పై పూత లేని రూపు. మనముపయోగించు వస్తువులలో అనేకములు పైపూత వలన తళతళ లాడుచు సుందరముగా తోచును. భగవంతుడట్టివాడు కాదు. ఆయన సహజముగా సుందరమైనవాడు.

**భావానువాదం:**
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**

# వైఖానస యజ్ఞం – శ్రీవారి బ్రహ్మోత్సవం

: డా|| వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్య

పరబ్రహ్మ, పరాత్పరుడు, ఆదిమధ్యాంత రహితుడు, సర్వశక్తి సంపన్నుడు, సృష్టి స్థితి లయ కారకుడు శ్రీమన్నారాయణుడు. ఆ శ్రీమన్నారాయణునికి జరుగు ఆగమోక్త అర్చనాది అనుష్ఠాన కైంకర్యాలలో బ్రహ్మోత్సవం బృహత్కార్యం. ఇది వేదకాలపు యజ్ఞానికి ప్రతీక. మారుతున్న కాలానికి అనుగుణంగా వైదిక కార్యాన్ని కూడా మహర్షులు ఆలయాల్ని, బింబార్చనల్ని, ఉత్సవాల్ని యజ్ఞప్రతీకలుగా రూపొందించి లోకానికి అందించారు.



వైఖానసాగమోక్తంగా పరిశీలిస్తే తిరుమలగిరి వాసునికి జరుగు బ్రహ్మోత్సవం వేదకాలపు సోమయాగానికి ప్రతీక. యజ్ఞాంతమందు జరుగు అవభృథంతో సమానం బ్రహ్మోత్సవాంతమందు జరుగు చక్రస్నానం.

బ్రహ్మోత్సవమంటే అలనాడు చతుర్ముఖ బ్రహ్మ, దేవ, గంధర్వ, యక్ష, కిన్నర, కింపురుష, అప్సరస, ఇంద్రాది అష్టదిక్పాలక దేవతల్ని, రాజులను, పరివారాల్ని, అనంత, గరుడ, విష్వక్సేన, సుదర్శన, పాంచజన్య, శ్రీభూత...

ఆహూతాశ్చ సురాః సర్వే
సర్వాభ్యో దిగ్భ్య ఏవచ
ఆగతాః విభుధాః సర్వే
రాజానః పుణ్య కృత్తమాః
అంగ వంగ కళింగేషు
గౌడ కాశ్మీర సింధుషు
చౌళ మాళవ పాండ్యేషు
కోసలేషు కుశేషు చ (వరాహ పురాణం)

మొదలగు వారినందరినీ రప్పించి కన్యామాస శ్రవణమందు అంటే శ్రీమన్నారాయణుని ఆవిర్భావ దినమున అవభృథంగా నిర్ణయించి దానికి ముందు నవాహ్నికంగా మహోత్సవాల్ని విఖనస మహర్షి చేత వైఖానసాగమోక్తంగా చేయించాడని పురాణాలు చెబుతున్నాయి. తదనుగుణంగా ఆ నవాహ్నిక దీక్షతో బ్రహ్మోత్సవాలనే పేరిట బృహత్కార్యం ఆచరించటం నేటికీ సాంప్రదాయం అయింది. ఆగమాలలో వేదోక్తమైంది వైఖానసాగమం. ఆరాధ్యదేవతలలో యజ్ఞపురుషుడు విష్ణువు. ఆ యజ్ఞపురుషునికి జరుగు బ్రహ్మోత్సవం ఒక విశిష్ట వేద సనాతన ధర్మసూత్రాలకు ప్రతిరూపం. అదొక వైఖానస యజ్ఞం. ఇందు అంకురార్పణం, దేవతాహ్వానం, హోమం, కుంభపూజ, వీథ్యుత్సవం, చక్రస్నానం అనే క్రియలుంటాయి. ఆ యజ్ఞ క్రియల్ని సవివరంగా పరిశీలిద్దాం.

## అంకురార్పణం

బ్రహ్మోత్సవ సమయంలో ప్రారంభదినానికి ముందు అంకురార్పణం జరుగుతుంది. అంకురార్పణమంటే అంకురములను అర్పణ చేయటం. అంకురములనగా బీజములు. ఇవి ప్రకృతి సిద్ధములైనవి. వీటిని తొమ్మిదిగా గుర్తించారు ఆగమవేత్తలు. అవి –

**శాలిమార్గః ప్రియంగుశ్చ**
**ముద్గ గోధూమ సర్షపాః**
**మసూర తిల్వ చణకాః**
**నవధాన్యం ప్రకీర్తితాః**

ఈ చెప్పబడ్డ నవధాన్యాల్ని తీసుకుని వచ్చి మట్టిలో వేసి వీటి అభివృద్ధిని మంత్ర తంత్రాలతో కోరతారు. వీటి అభివృద్ధిని బట్టి క్రియాఫలితం ఉంటుందని నమ్మకం. ఇంతేకాక ఈ అంకురార్పణలో బ్రహ్మ, ఇంద్రాది అష్టదిక్పాలకులు, జయ, విజయ, వింద, నంద, పుష్టిక, కుముద్వతీ, ఉత్పలక అనే అప్సరసలు, చంద్రుడు, ఈశ, పర్జన్య, జయంత, మహేంద్ర, ఆదిత్య, సత్యక, అగ్ని, వితథ అనే 24 మంది దేవతలు, శేష, వినాయక, గరుడ, సుదర్శన, పంక్తుశ, ధ్మృతేశ అనే ద్వారదేవతలు, కుహు, రాకా, సినీవాలీ అనే పాలికా దేవతలు కూడా ఆహ్వానింపబడతారు.

ఈ అంకురార్పణం రాత్రికాలమందే చేస్తారు. ఓషధులకు అధిపతి చంద్రుడు. చంద్రుని సాక్షిగా చేయటం ఆగమ సమ్మతం.

## దేవతాహ్వానం

బ్రహ్మోత్సవానికి అతిథులుగా వచ్చేందుకై స్వర్గలోక దేవతలనందరినీ ఆహ్వానించేందుకు గాను శ్రీ శ్రీనివాసుని ధ్వజ చిహ్నమైన గరుడుని ఆహ్వానించి ఆకాశములోనికి పంపి మంత్ర తంత్ర గద్య పద్యాలతో ఆయా దేవతలను ఆహ్వానించటం జరుగుతుంది. అందు ఆలయ దేవతలు, ద్వారదేవతలు, ద్వారపాలకులు, విమాన దేవతలు, గోపుర దేవతలు, ఆనపాయినులు, ఆవరణ దేవతలు, ఇంద్రాద్యష్ట దిక్పాలకులు గరుడుని ముఖం ద్వారా ఆహ్వానింపబడతారు.

**గ్రామ సంధౌ బలిందత్వా**
**తత్ర స్మంత్రైశ్చ ఘోషయేత్**

గ్రామమందలి ప్రతి మూలలోను మంత్ర తంత్రాలతో బలి వేయటం జరుగుతుంది. అక్కడ దేవగణం, ఋషిగణం, పితృగణం, దైత్యగణం, దానవగణం, అసురగణం, గంధర్వగణం, అప్సరోగణం, యక్షగణం, రాక్షసగణం, నాగగణం, భూతగణం, పిశాచగణం, అనావృష్టిగణం, అమృతమృచగణం, మాశృగణం, రోహిణీగణం, ఆర్యగణం, మన్వంతరాధిపతులు అనే దేవతలు బ్రహ్మోత్సవానికై ఆహ్వానింపబడతారు. బ్రహ్మోత్సవం వైభవోపేతంగా నిర్వహింపబడేందుకై వీరికి ప్రతినిత్యం బలిని వేస్తారు. ఇది బ్రహ్మోత్సవంలో ప్రధాన ప్రక్రియ.

## హోమం

**అగ్నిర్వై దేవానామవమః**
**తదంతరేణ సర్వా అన్యాదేవతాః**

దేవతలందరిలోకెల్లా అగ్ని చిన్నవాడు. విష్ణువు పెద్దవాడు. మధ్యలోనివారే మిగిలిన దేవతలు. పెద్దవారి వద్దకు వెళ్ళాలంటే చిన్నవారి ద్వారా వెళ్ళటం సాంప్రదాయం. దేవతలందరి వద్దకు వెళ్ళాలంటే అగ్నిదేవత ముఖ్యం. అందుకు ఉద్దేశింపబడిందే హోమం. ఈ హోమం ఆలయాది ఆవాహిత దేవతలందరికొరకు ఆచరింపబడుతుంది. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ, దిన దైవత్యాలతో హోమం బ్రహ్మోత్సవాలలో ప్రతినిత్యం రెండు కాలములందు ఆయా సమిధలతో, ఆజ్యంతో, చరువుతో జరుపబడుతుంది.

**ప్రథమోత్సవ మారభ్య**
**తీర్థాంతం జుహుయాత్ క్రమాత్**

అని దీని ప్రమాణము.

## కుంభపూజ

నవకుంభారోపణం అను కుంభపూజ బ్రహ్మోత్సవంలో ప్రధాన ప్రక్రియ. విష్ణు, పురుష, సత్య, అచ్యుతాది, దిక్, విదిక్ దేవతలను ఆహ్వానించి ప్రతినిత్యం విశేష ఉపచారములతో వారిని అర్చించి –

**తత్తత్కుంభగతాం శక్తిం**
**ధృవే సమ్యక్ నివేశ్యచ** (క్రియాధికారం)

ఉత్సవాంత్య దినమున మూలబేరము నందలి శక్తి ద్విగుణీకృతమగుటకు గాను కుంభశక్తిని మూలమూర్తి లోనికి ఆహ్వానించి రాజ, రాష్ట్ర, గ్రామ, యజమాన, ఆచార్య, అర్చక, పాచక, పరిచారక, భక్తజనుల అభివృద్ధి కొరకు సమస్త మంగళములు జరుగుట కొరకు ప్రార్థన జరుగుతుంది. ఇది ఒక విశిష్ట క్రియ. భగవత్ శక్తి అభివృద్ధికి ఇది దోహదకారి.

## వీధ్యుత్సవాలు

**కాణాంధ సంగు మూకానాం**
**అన్యేషాం వికలాంగినాం (వరాహ పురాణం)**

సంగు అంధ బధిర మూక మొదలగు వారి కొరకు వృద్ధ స్త్రీ జనసందర్శనార్థము, జనులందు వైదిక వాతావరణం నెలకొనేందుకు గాను వీధ్యుత్సవాలు నిర్ణయింపబడినవి. ఇవి రాజలాంఛనాలతో ఛత్ర చామర, వజ్ర, వైడూర్యాది ఆభరణ, రథ గజ అశ్వస్తోత్ర పారాయణ వంధి మాగధులతో కూడి ఉంటుంది.

**ఉపచారై రనేకైశ్చ**
**వేద ఘోషైః సుఖశ్రవైః**
**నృత్యగీతాది వాదిత్రైః**
**దివ్యమంగళ నిస్వనైః**

ఉత్సవ మూర్తులకు విశేష ఆభరణములు సమర్పించి శేష, హంస, సింహ, ముత్యపుపందిరి, కల్పవృక్ష, సర్వభూపాల, పల్లకి, గరుడ, హనుమాన్, గజ, సూర్య, చంద్ర, రథ, అశ్వములు వాహనాలుగా ఉంటాయి.

ఉత్సవాల పరమార్థం ఏమంటే మన మనస్సును కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలకు దూరం చేసి ధర్మార్థ కామ మోక్షములనెడి మంచి మార్గాల ద్వారా భగవత్ సన్నిధిని చేరుకోవటమే. ఈ లక్ష్య సాధనతో మానవులు జీవిస్తే గ్రామ, పట్టణ, సంఘ, రాజ్యాలు సుఖవంతమవుతాయి.

## చక్రస్నానం

చక్రస్నానాన్నే అవభృథక్రియ అంటారు. యజ్ఞాంతమందు యజమానుని గంగాది నదీజలాలతో అభిషేకించటం ఆనవాయితీ. దానికి ప్రతీకగా వరుణ మంత్రాలతో పుష్కరిణీ జలాన్ని అభిమంత్రించి అందు వరుణుని ఆహ్వానించి అర్చించి ఆ జలముతో సుదర్శన చక్రాన్ని విశేషంగా అభిషేకించటం బ్రహ్మోత్సవాంతమందలి క్రియ.

సుదర్శనచక్రం పాప పరిహారానికి ప్రతీక. ధర్మ రక్షణకు ఏర్పడింది ఈ సుదర్శన చక్రమే.

యజ్ఞ సమాన క్రియలతో ఆగమోక్త విధులతో పరబ్రహ్మ దరిచేరేందులకు గాను నిర్ణయింపబడి కాలం మారినా ఒకే



రీతిగా క్రమం తప్పకుండా జరుగుతున్న ఈ తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవం ఇహలోక సుఖ మమకార మత్సర మాలిన్యాలకు సుదూరంగా మానవ మనస్సు ఉండాలనే ఉద్దేశంతో అంగరంగ వైభవంగా ఆచరింపబడుతూందంటే అతిశయోక్తి కాదు. మనలోని ఆధ్యాత్మిక జ్యోతి ఇంతై ఇంతింతై కోటి సూర్య సమాన కిరణకాంతితో వెలుగొంది శాశ్వతాభ్యుదయమును చేకూర్చి భవిష్యజన్మ లేకుండా చేసేందుకు కూడా ఇది దోహదకారి అవటం సత్యం.

బ్రహ్మోత్సవ సమయమంతా తిరుమలగిరి నవ్య శోభను పొంది కనులకింపైన వివిధ వినూత్న అలంకరణములతో సరస సంగీత భక్తిరస గానములతో మనస్సును ప్రక్షాళన చేయు విశిష్ట వేదమంత్ర ధ్వనులతో శ్రీ శ్రీనివాసునికి రంగరంగ వైభవోపేతములైన దివ్యవాహనములతో శ్రీవేంకటేశ్వరుని చిద్విలాస వైభవ దృష్టి ప్రసరణలతో అపర వైకుంఠంలా గొప్పదైన వైఖానసయజ్ఞం ఆచరింపబడుతూ ఉంటుంది. ఆ దివ్యసన్నిధిలో ఉండి నిత్య లీలా విభూతి నిలయుని ఆశ్రయించి శాశ్వతమైన సౌఖ్యం పొందటం మనందరి ఆవశ్య కర్తవ్యం.

**వేంకటాద్రి సమం స్థానం**
**బ్రహ్మాండే నాస్తి కించన!**
**వేంకటేశ సమో దేవో**
**న భూతో న భవిష్యతి!**

**43వ భాగము**



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు

## తెలంగాణలో మరో తిరుపతిగ తన ‘హరినామ క్షేత్రము’ను ఏర్పాటు చేయుటకై

**తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన ‘హరినామ క్షేత్రము’ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 43 వ భాగపు లీలల ప్రచురణ. (జులై 2023-సెప్టెంబర్ 2023).



ఇంతవరకు జరిగిన 42 భాగాలను ఆనందముతో వ్రాశాను. కాని ఈ 43వ భాగమును బాధాతప్త హృదయముతో వ్రాస్తున్నాను. భగవంతుడు భక్తులను ఉద్ధరించుటకు క్రిందికి దిగి వస్తాడని పెద్దలంటారు కానీ... నా విషయంలో మాత్రం అత్యంత క్రింది స్థాయికి దిగి వచ్చారు. ఏది సాధించుటకు ఇలా చేశాడో తెలియదు కాని ఫలితంగా నేను బాధతో విల విలలాడిపోయాను. ఇది ఒక అత్యంత దుఃఖకరమైన సంఘటన. శ్రీవేంకటేశ్వరుడంటే నాకు అమితమైన ఇష్టం. ఎవ్వరైనా నన్ను తిట్టినా భరిస్తాను కానీ నా స్వామిని కించిత్తు మాట అన్నా భరించలేను. అలాంటిది మా ఇంటిలోనే, నా కళ్ళముందే వారు అనాదరణకు గురైనారు. తనను తాను హింసించుకున్నారు. చూస్తూ ఉండిపోయాను తప్ప ఏమీ చేయలేని నిర్భాగ్యుణ్ణి. మొత్తం మీద ఈ కాలంలో నేను నా కోసం కాదు, లోక కళ్యాణార్థం సాధన చేయవలసి ఉందని చెప్పారు. నా మార్గం స్థిరంగా ఉండుటకు స్వామివారు తనను తాను హింసించుకున్నారు. వెనుకడుగు వేయకుండా కష్టపడమన్నారు.

### స్వామివారు హింసించుకొనుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు చిన్నగుండవెల్లిలో హరినామక్షేత్రము ఏర్పరచడానికి మమ్ములను ఎన్నుకొని తన లీలల ద్వారా గత 23 సంవత్సరాల నుండి రకరకాలుగా శిక్షణ ఇస్తున్నారు. మేము ఒక అధమశ్రేణి వ్యక్తుల మగుట వలన ఇంతకాలము గడిచినప్పటికీ వారు ఆశించిన స్థాయికి చేరుకోలేకపోయాము. దీనిని గమనించిన స్వామివారు తాను స్వయంగా అత్యంత క్రింది స్థాయికి దిగి వచ్చి తనను తాను హింసించుకున్నాడు. దీనితో

మాలో అత్యంత భారీ స్థాయిలో పరివర్తన జరిగింది. పుత్ర పౌత్రులపైన, లౌకిక విషయాలపైన విరక్తి కలిగింది. ఆ సంఘటన ఈ విధంగా ఉంది.

## సురేఖ 60వ పుట్టిన రోజు

తేది 11-06-2023 నాటికి సురేఖకు 60 సంవత్సరాలు నిండుతాయి. ఆ రోజు తిరుపతికి వెళ్ళి స్వామివారిని దర్శించుకోవాలని అనుకున్నాము. అమెరికాలో ఉన్న మా పెద్ద కుమారుడు చి|| వేదాంత్ కూడా ఈమె 60 వ జన్మదినానికి ప్రత్యేకంగా వస్తానన్నాడు. తిరుమల స్వామి దర్శనము తరువాత తేది 14-06-2023 నుండి 17-06-2023 వరకు హంపి చూపిద్దామని బలవంతపెట్టాడు. తిరుపతికి హంపికి ఫ్లైట్ టికెట్స్ మరియు తిరుమల స్వామి వారి శ్రీవాణి దర్శనాన్ని ముగ్గురము బుక్ చేసుకున్నాము. హంపిలో పెద్ద స్టార్ హోటల్ గదిని చి|| వేదాంత్ బుక్ చేశాడు. ఈ విధంగా వాడు వారం రోజులు మాతో ఉండి మమ్ములను సంతోషపరచి వెళ్ళుదామనుకున్నాడు. దీనితో సురేఖ చాలా సంతోషించింది.

సురేఖకు 60 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఆమెకు నేను కొంత జ్ఞానబోధ చేయాలనుకున్నాను. ఇప్పటినుండి కొడుకులు, కోడళ్ళని మనస్సు పారేసుకోక కేవలం భగవంతుని పైననే దృష్టి నిలిపి, జీవించాలని చెప్పాలనుకున్నాను. దీనిని తిరుపతిలో స్వామివారి దర్శనము అయిన తరువాత వీలు చూచి చెప్పాలనుకున్నాను. మరియు ఏ విధంగా నాకు 60 సంవత్సరాలు నిండినప్పుడు ఒక ప్రత్యేక అనుగ్రహం ద్వారా కళ్యాణాల కార్యక్రమమును ప్రసాదించాడో ఇప్పుడు కూడా ఒక మార్పు లేదా అనుగ్రహము ప్రసాదిస్తాడనుకున్నాను. కాని స్వామివారు ఏ రూపములో, ఏ సందర్భములో, ఏ విధంగా అనుగ్రహిస్తారో తెలియదు.

అనుకున్నట్లు సురేఖ 60వ పుట్టిన రోజుకు అమెరికా నుండి మా పెద్ద కుమారుడు చి|| వేదాంత్ వచ్చాడు. మేము ముగ్గురం సంతోషంగా తిరుపతికి వెళ్ళాము. కాని తిరుపతిలో స్వామివారు ఒక భయానకమైన లీలను ప్రారంభించారు. దీనితో హంపి యాత్ర విరమించుకుని ఇంటికి వచ్చాము. ఇంటి వద్ద ఈ లీల పరాకాష్ఠకు చేరింది. మా కొడుకు మాధ్యమంగా స్వామివారు తనను తాను హింసించుకున్నారు. ఈ సంఘటన తెలుపుట భావ్యం కాదని వివరించుట లేదు. ఈ సంఘటనను చూచి ఒక్కక్షణం నిశ్చేష్టులమైనాము. భయభ్రాంతులకు గురైనాము. దీనితో మాకు పిల్లలపైన వ్యామోహం పూర్తిగా నశించినట్లు అయింది. చాలా బాధగా ఉంది. నాకంటే సురేఖ ఎక్కువ బాధపడ్డది. ఒక రెండు రోజుల తరువాత తేరుకుని దీని గురించి ఆలోచించాను.

ఈ సంఘటన ద్వారా స్వామివారు మాకు చక్కటి దిశా నిర్దేశం చేశారు. భావి జీవితంలో నేను ఇదే విధంగా జీవించాలని సురేఖతో చెప్పాలనుకున్నాను. కాని స్వామివారే ఇకనుండి మీకు కొడుకులు కోడళ్ళు ఎవ్వరు లేరు. మీరు ఏకాకులు, అన్య విషయాలు ఆలోచించకూడదు అని సూచించాడు. ఈ సంఘటనతో స్వామివారిపై భక్తి ద్విగుణీకృతమైంది. అప్పటికే నేను నా కొడుకులతో తామరాకుపై నీటిబొట్టులాగా వ్యవహరిస్తున్నాను. ఇప్పుడు నేను, సురేఖ ఇద్దరము పిల్లలపై, వారి సంబంధీకులపై పూర్తిగా బంధాన్ని త్రెంచేసుకున్నాను.

**మరో విషయము :** మా కొడుకులకు సంతానము కలిగితే మాకు ఆ చిన్నారిపై వ్యామోహము పెరుగునని భావించి ఇంతవరకు ఒక్కరికీ సంతానము ప్రసాదించలేదు. ఇది కూడా స్వామి మాహాత్మ్యాలలో ఒకటిగా భావించాను.

తరువాత రోజులలో ఈ హింసించుకొను సంఘటనను మరింత విశ్లేషించుకున్నాను. స్వామివారంటే నాకు అత్యంత ప్రేమ. నన్ను అవమానిస్తే సహిస్తాను కాని స్వామివారిని అవమానిస్తే సహించలేను. నా ఈ వీక్ పాయింట్ ను ఉపయోగించి ఈ లీలను చూపాడని భావించాను. మరియు స్వామివారు అత్యంత క్రిందికి దిగి వచ్చి తనను తాను శిక్షించుకొనుట వలన నాకు అత్యంత దుఃఖం కలిగి నేను మారటానికి విశ్వప్రయత్నం చేశాను. పూర్వం 2002 సంవత్సరంలో సురేఖను ఉపయోగించి వ్యాపారము చేయనని నాచే మాట తీసుకున్నాడు. ఇప్పుడు నా కొడుకును ఉపయోగించి లోకంలోని అన్నింటిపైన వ్యామోహాన్ని త్రుంచి వేసినట్లు చేశాడు. మరియు తగిన యోగ్యత సాధించకుంటే లేదా నా మనస్సు అన్య విషయాలపై వెళ్ళితే స్వామివారు మళ్ళీ హింసించుకుందురనే భావమేర్పడ్డది. ఒక్కసారి నాకు, ఆయనకు ఉన్న బంధం, ఆయన ప్రసాదించిన అనుగ్రహాలు నా కళ్ళలో కదిలాయి. యోగ్యత సాధించి తీరాలన్న పట్టుదల ఎంతో పెరిగింది. ఇంతలో స్వామివారు ఈ క్రింది లీల చూపారు.

## ప్రత్యేక పూజలు

**తేది 18-06-2023 :** నా కొడుకు ప్రవర్తన చాలా కలిచి వేసింది. నా స్వామివారిని అవమాన పరచడం బాధేసింది. నాకు స్వామివారే దిక్కని, ఎట్టి పరిస్థితులలో నా కర్తవ్యాన్ని పూరించాలనే పట్టుదలతో ఉన్నాను. సదా స్వామిని స్మరిస్తూ తగిన యోగ్యత ప్రసాదించమని, నా కారణంగా స్వామివారి కృపా కటాక్షాలు సర్వులకూ లభించాలనే కోరిక పెరిగింది. అందుకని మా కాలనీలో ఉన్న శ్రీ ఆంజనేయునికి మరియు శ్రీరామునికి ప్రతిరోజు 11 ప్రదక్షిణలు చేయుట ప్రారంభించాను.




హరినామ క్షేత్రం శంకుస్థాపన చేయు దిశగా అడుగులు (లీల 20-06-2023)

## శంకుస్థాపన దిశగా... యోగ్యతకు ప్రయత్నాలు

**తేది 20-06-2023 కల :** ఈనాటి కలలో ఒక 3' X 5' సైజుతో చక్కని నాలుగు మూలలు గల ఒక శంకుస్థాపనకు అన్నట్లు అప్పుడే త్రవ్విన ఒక గుంతను చూచాను. దాని ప్రక్కన మా కళ్యాణాలను నిర్వహించు వైఖానస బ్రాహ్మణుడు శ్రీమాన్ భరద్వాజాచార్యులు మరి యొక అయ్యగారు నిలబడి ఉన్నారు. నేను నా భార్య కూడా ప్రక్కనే ఉన్నాము. కల చెదిరింది.

అంటే... హరినామక్షేత్ర శంకుస్థాపనకు అవసరమైన యోగ్యత సాధించు దిశగా వెళ్ళుచున్నానని అర్థం.

తేది 24-06-2023 నాడు కూడా ఒక కల ప్రసాదించారు. అందులో కూడా నేను యోగ్యత సాధించుటకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు చూపెట్టాడు.

## యోగ్యత సిద్ధించలేదు, కాని సాధన చక్కగా జరుగుచున్నదనుట

గత కొన్ని రోజుల నుండి స్వామి ఆజ్ఞగా నా పుత్రులతో కాని, బంధు మిత్రులతో కాని మాట్లాడకుండా తీవ్రంగా సాధన చేస్తున్నాను. తగిన యోగ్యత ప్రసాదించమని స్వామివారిని రకరకాలుగా వేడుకుంటున్నాను. ఈ క్రమంలో తేది 18-06-2023 నుండి స్వామివారికి మళ్ళీ 11 రోజుల ప్రత్యేక పూజలు చేశాను. ఇవి తేది 28-06-2023 వరకు పూర్తైనవి. ఇక తేది 29-06-2023 నాడు తొలి ఏకాదశి, నా పుట్టిన రోజు కాబట్టి స్వామివారిని ప్రత్యేకంగా పూజించాను. యోగ్యత సాధించుటకు సహాయము చేయమని, ఆశీర్వదించమని దీనంగా వేడుకున్నాను. నా ప్రార్థనానుసారం ఒక చక్కటి కలను ప్రసాదించి అందులో మూడు సన్నివేశాలను విడి విడిగా చూపాడు. మొత్తం మీద ఇంతవరకు నీకు యోగ్యత సిద్ధించలేదు కాని తీవ్రంగా కృషి చేస్తున్నట్లు చూపెట్టాడు. ఆ కల ఈ విధంగా ఉన్నది.

**తేది 29-06-2023 తొలి ఏకాదశి కల :** నేను ఒక అత్యంత సాధారణ వ్యక్తి లాగా మా బంధు మిత్రులతో అంటే అమ్మ తరపు మరియు ఇతర బంధుమిత్రులతో కలిసి, ఒక రైల్వే బోగీని బుక్ చేసుకుని, తిరుపతికి స్వామి దర్శనార్థం పోవుచున్నాము. జనాలు బోగీ నిండా ఉన్నారు కాని ఆ రైలు బోగీలో సీట్లు లేవు. క్రింద జంబుకాన వేసుకున్నాము. దానిపైన కొందరు కూర్చున్నారు, కొందరు పడుకున్నరు. మరికొందరు ఏదో మాట్లాడుచున్నారు. ఇలా వెళ్ళుచున్నాము. తిరుపతికి కొద్ది దూరము ఉందనగా ఇదే తిరుపతని భావించి నేను ఆత్రుతతో దిగాను. నా వెనుక నా భార్య కూడా దిగింది. ఈ స్టేషన్ లో రైలు ఆగలేదు, మెల్లగా పోవుచున్నది. కావున ఆత్రుతతో నేను ముందు దిగాను. నా వెనుక నా భార్య కూడా దిగేసరికి ఈ రైలు దాదాపు ఒక కిలోమీటరు వరకు ముందుకు వెళ్ళింది. ఆమె అక్కడ దిగింది. ఇలా ఇద్దరం వేర్వేరు ప్రాంతాల్లో




ఫంక్షన్‌కు పోయినప్పటికి ఎవ్వరు గుర్తించకుండా బిచ్చగాడిగా ఉండుట
(లీల 29-06-2023) (రెండవ సన్నివేశం)

దిగాము. నేను కొంతదూరం ముందుకు వెళ్ళి చూచాను. అది నేను దిగే తిరుపతి కాదని గుర్తించాను. ఇక నా భార్య ఎక్కడనో దిగి నన్ను వెతుకుచున్నదని తెలుసు. ఇది తిరుపతి కాదనే విషయమును ఆమెకు చెప్పాలని నా ఫోన్ ను వెతికాను. ఫోన్ నా వద్ద దొరకక బాధపడ్డాను. నిజానికి ఈ ఫోన్ నా వద్దనే ఉన్న విషయమును మరచాను. చివరికి నా జేబులోనే ఫోన్ ఉన్నదని తెలుసుకుని, ఆమెకు ఫోన్ చేసి, ఇది తిరుపతి కాదని మనము తప్పుడు స్టేషన్ లో దిగామని చెప్పాను. ఆమె కూడా నాతో ఏకీభవించింది. ఇది ఒక సన్నివేశం.

**రెండవ సన్నివేశం :** నాకు అత్యంత దగ్గరివారి పెండ్లి లాంటి ఒక ఫంక్షన్ జరుగుచున్నది. చాలామంది ఆ ఫంక్షన్ కు వచ్చారు. ఒక విశాలమైన గ్రౌండ్ లో రాత్రి పూట లైట్స్ మధ్యన జరుగుచున్నది. ఇది ఒక పురాతనమైన ఫంక్షన్ హాల్, దీనికి బంగ్లా మరియు ఓపెన్ గ్రౌండ్ రెండూ ఉన్నాయి, ఫంక్షన్ మాత్రం ఓపెన్ గ్రౌండ్ లో జరుగుతోంది. నేను వెళ్ళాను. అప్పటికే ఆ గ్రౌండ్ నిండా జనాలు ఉన్నారు. అందరూ నా వద్దకు వచ్చి మాట్లాడుతారని, ఏదో విషయం తప్పక వారితో మాట్లాడవలసి ఉంటుందని గ్రహించాను. కాబట్టి దీనిని తప్పించుకొనుటకు, ప్యాంటు షర్టుతో ఉన్న నేను, నా షర్టును విప్పేసి ఒక బొంతను కప్పుకుని బిచ్చగాడిలా ఒక అరుగు లాంటి దానిపైన పడుకున్నాను. నన్ను చూసినవారు గుర్తుపట్టక, ఎవరో పిచ్చివాడని భావించి నా వద్దకు రారనే ఉద్దేశ్యంతో అలా చేశాను. కాని చివరికి నేను ఆధ్యాత్మిక రంగములోకి అడుగిడక పూర్వము పరిచయము ఉన్న ఒక వ్యక్తి నన్ను గుర్తుపట్టాడు. ఆ తరువాత చాలామంది గుర్తుపట్టి మాట్లాడసాగారు. దీనిని గమనించి ఇక లాభం లేదని విడిచిన షర్టును మళ్ళీ ధరించబోయాను. కాని నా మనస్సు పరధ్యానంలో ఉన్న కారణంగా షర్టు ధరించడంలో తికమక పడ్డాను. చివరికి ధరించాను. ఇది రెండవ సన్నివేశం.

**మూడవ సన్నివేశం :** షర్టు ధరించిన వెంటనే నేను నేరుగా ఫంక్షన్ వద్దకు వెళ్ళుట ఇష్టం లేక ఫంక్షన్ హాలు లోని అన్ని గదులను చూడసాగాను. హాలును దాని లోపలి గదులను చూచాను. ఫంక్షన్ మాత్రం ఓపెన్ గ్రౌండ్ లో జరుగుచున్నది. నేను ఈ ఫంక్షన్ నిర్వాహకులకు అత్యంత దగ్గరివాణ్ణి కాబట్టి ఈలోగా నన్ను చూచిన వ్యక్తులు నా వద్దకు వచ్చి మాట్లాడ సాగారు. ఈసారి తప్పించుకోలేకపోయాను. కల చెదిరింది.

అంటే... నేను సాధ్యమైనంతవరకు ఇతరుల సహవాసమునకు దూరంగా ఉంటూ, ఏకాంత జీవితము గడుపుచు, స్వామి సాధన చేస్తున్నానని అర్థం. మరియు మేము తిరుపతికి అత్యంత సామాన్య వ్యక్తుల మాదిరిగా, ఆత్రుతతో పయనిస్తున్నామని మొదటి సన్నివేశం భావం. స్వామిని త్వరగా చేరాలనే ఆత్రుత ఉన్నప్పటికీ తిరుపతిని గుర్తించలేదు. కాని రేణిగుంట లాంటి దగ్గరి ప్రదేశానికి వచ్చాము. ఈ విధంగా నేను యోగ్యత సాధించుటకు చక్కని ప్రయత్నం చేస్తున్నానని, కాని ఇంకా సాధించవలసి ఉందని సూచించాడు.

## తన ఆధీనంలో బంధించిన స్వామివారు

నేను సిద్ధిపేట ప్రాంతములోని ఒక వ్యవసాయ కుటుంబము నుండి వచ్చాను. మాకు తగినంత భూమి ఉన్నప్పటికీ నీరు లేక, పంటలు పండక అత్యంత దీనావస్థలో కుటుంబం గడిచింది. ఆ మా పరిస్థితులను చూచి చలించిపోయాను. ఈ స్థితి మాకే కాకుండా ఆ ప్రాంత వాసులందరికీ ఉండేది. ఇది ఆ ప్రాంతపు పరిస్థితి. ఇంజనీరింగ్ చేసినప్పటికీ ఉద్యోగము చేయక వ్యాపారము చేసి మా కుటుంబాన్ని ఉన్నత స్థితికి తీసుకురావాలనే భావము నా విద్యాభ్యాస సమయాన బలంగా ఏర్పడ్డది. కాని స్వామివారు మాత్రం మా ఒక్క కుటుంబాన్ని ఉన్నత స్థితికి తెస్తే సరిపోదని, మొత్తం ఆ ప్రాంతాన్ని తీసుకురావాలని దిశా నిర్దేశం చేశాడు. మరియు డబ్బు వల్ల ఇది సాధ్యం కాదని స్వామి అనుగ్రహం వల్ల అవుతుందని కూడా దిశా నిర్దేశం చేశాడు. మరియు ప్రస్తుతం అనగా జులై 2023 లో సిద్ధిపేట వాస్తవ్యుడైన శ్రీమాన్ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు.

గత కొన్ని రోజుల నుండి తీవ్రమైన సమస్యల వలయంలో చిక్కుకుని భయపడి పోవుచున్నాను. సమస్యలను దూరం చేయమని స్వామివారిని తీవ్రంగా ప్రార్థిస్తున్నాను. ఇలా చాలా రోజుల నుండి జరుగుచున్నందున సేద తీర్చుకొనుటకు ఒకరోజు బాలాజీ అనే స్వామివారి భక్తునితో స్వామి లీలల గురించి చర్చించాము. ''నీవు స్వామివారి భక్తుడివి, నీకెందుకు బాధ'' అని నాతో అన్నాడు. ఆయనకు ఇష్టుణ్ణైనప్పటికీ కఠిన సమస్యలకు గురి చేస్తున్నాడని నేనన్నాను. ఒక మాట సందర్భంగా ఇన్ని సమస్యలుంటే ఆయన్ను వదలగలవా? అని బాలాజీ గారు నాతో అన్నారు. అందుకు నేను ''నేను వదలలేను, ఆయన కూడా నన్ను వదలలేడు'' అన్నాను. మా మధ్యన అలాంటి బంధం ఏర్పడిందని చెప్పుచు నా సాధన విషయం వగైరాలు మాట్లాడాము. స్వామివారికి, నాకు ఉన్న ఈ బంధాన్ని నిజం చేస్తూ స్వామివారు ఒక చక్కని ఈ క్రింది లీలను చూపారు. ఇది నా జీవితములో మరో ఆణిముత్యం లాంటిది.

**తేది 03-07-2023 కల:** ఈ కల ఉదయం 4.30 గంటలకు వచ్చింది. నేను, నాకు అత్యంత సుపరిచయము ఉన్న ఒక ఆలయము లోనికి వెళ్ళాను. అది తమిళనాడు ప్రాంతమున ఉండునటువంటి ఒక పురాతనమైన చాలా పెద్ద ఆలయం. నేను దాదాపు సాయంత్రం వేళ ఆలయం లోనికి వెళ్ళాను. ఆ తరువాత ఆ ఆలయంలో ఒకచోట ఉన్నాను. ఇంతలో ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీమాన్ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు, తను ముఖ్యమంత్రి అయినప్పటికీ, ఒక సాధారణ వ్యక్తి లాగా ఒక్కరే నా వద్దకు వచ్చారు. నా సందేశం వినుటకని, నాకు అత్యంత దగ్గరగా, నా ముందర నిలబడ్డారు. వీరు నాకు అత్యంత సుపరిచితులట. అప్పుడు నేను ఆయనతో ''మన ప్రాంతమున వ్యవసాయదారుల సమస్యలు పరిష్కరింపబడుట లేవు, ఆఫీసులలో స్టాఫ్ తక్కువ ఉండుట వలన చేయలేకపోవుచున్నారు. అయితే వీలైనంతవరకు స్టాఫ్ ను పెంచి సమస్యలను తొందరగా పరిష్కరించునట్లు చూడమని''చెప్పాను. ఆయన నా మాటను శిరసా వహించినట్లు తల ఊపాడు. మరియు వెళ్ళిపోయాడు. ఆ తరువాత సమయం దాటిపోయింది కాబట్టి నేను కూడా ఆలయం నుండి ఇంటికి పోబోయాను. కాని ఎంత వెతికినా బయటకు వెళ్ళే దారి కనబడలేదు. ఆ పెద్ద ఆలయం మొత్తం కలయ తిరిగాను. కాని బయటకు వెళ్ళే దారి తెలియక వెళ్ళలేకపోయాను. ఆలయం వెనుక రకరకాల భవంతులు, గదులు ఉన్నవి. దారి కోసం వంటశాలతో సహా అన్ని గదులను కలియ తిరిగాను. కాని దారి కనబడలేదు. ఎంత తిరిగినా చివరికి ఉన్న స్థలానికే వస్తున్నాను. చివరికి ఆలయం



తన ఆధీనంలో బంధించిన స్వామి వారు.

లీల 03-07-2023: (ఆలయం నుండి బయటకు వెళ్ళలేక పోవుట)

వెనుకకు వెళ్ళాను. పెద్ద పెద్ద చెట్లతో నిండిన అడవి ఉన్నది. వాటిలోనికి వెళ్ళాను. అక్కడ చిన్న చిన్న నీటి కాలువలు, వాటి ప్రక్కన పచ్చని పెద్ద పెద్ద చెట్లు ఉన్నవి. అందులో అక్కడక్కడ పిల్లబాటలు ఉన్నవి. మొత్తం మీద వెనుక ఒక మంచి అడవి లాగా పెద్ద పెద్ద చెట్లతో, తీగలతో, చిన్న నీటి కాలువలతో నిండి ఉన్నది. చూచుటకు ప్రశాంతంగా ఉన్నది. కాని బయటకు పోవుటకు దారి మాత్రం లేదు. ఈ అడవి కూడా ఆలయానికి సంబంధించినదేనట. నేను ఆ ప్రాంతమును ఇంతకుముందే చూచాననే భావన కలిగింది. కాని ఎంత వెతికినా బయటకు వెళ్ళే దారిని కనుక్కోలేకపోయాను. ఒక రకంగా భగవంతుడు నన్ను తన ఆలయంలో బంధించివేశాడు. నేను ప్రయత్నించినప్పటికీ ఆయన నుండి బయటకు వెళ్ళలేకపోయాను. ఇంతే కల.

నేను స్వామివారి అధీనంలో ఉన్నాను. సమస్యలకు భయపడి తప్పించుకొనుటకు ప్రయత్నించినప్పటికీ పోలేనని దీని అర్థం. మరియు నా ప్రయత్నం ద్వారా లేదా హరినామక్షేత్ర సాధన ద్వారా స్వామి అనుగ్రహము వలన సిద్ధిపేట ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండగలరని స్వామివారు సూచించారు. ఇక నేను స్వామి అధీనంలోనే ఉంటూ, ఇదే నా స్థానమని గట్టిగా నమ్మి, సాధించాల్సిన పనులను సాధించవలెనని భావించుకున్నాను. సమస్యలకు భయపడక స్వామి సంకల్పాన్ని నెరవేర్చుటే లక్ష్యంగా జీవించాలి. ఇదే నా కర్తవ్యం అనుకున్నాను.

## 63 వ పుట్టిన రోజు, పవిత్రస్నానం చేయుట

ఈ రోజు తేది 05-07-2023. ఇంగ్లీష్ క్యాలెండర్ ప్రకారం ఇది నా 63వ పుట్టిన రోజు. 21 సంవత్సరాల క్రింద సరిగ్గా నా ఈ పుట్టినరోజు నాటి పూజలో స్వామివారిని అత్యంత ఆర్తిగా పూజించి ఒక బహుమానమును అడిగాను. అందుకు ఆయన తన నోటితో ''సాయిరెడ్డి నావాడని, తన కోసం ఏమైనా చేస్తాడని'' అన్నారు. మరియు తన సేవను బహుమతిగా ఇచ్చారు. ఈనాడు కూడా పూజ సమయాన స్వామివారిని ఒక బహుమానమును ఇవ్వమని ప్రార్థించాను. ఆ తరువాత దగ్గరలోని స్వామివారి ఆలయానికి వెళ్ళి ప్రార్థిస్తూ హరినామక్షేత్రమునకు కావలసిన యోగ్యతను బహుమానంగా ప్రసాదించమన్నాను. ఏమి బహుమానం ఇస్తారో చూద్దాం! అనుకున్నాను. అనుకున్నట్లు ఈ క్రింది కల కన్నాను.

**తేది 06-07-2023 కల :** బహుశా నేను నా విద్యాభ్యాసం ముగించుకుని యూనివర్సిటీ నుండి బయటకు వచ్చాను. ఒక పవిత్ర స్నానానికి పుష్కర ప్రాధాన్యత ఉన్న ఒక ప్రాంతానికి వెళ్ళాను. నీరు పారుటకు ప్రక్క ప్రక్కన చిన్నసైజు కాలువలు నిర్మించారు. ఈ కాలువలలో నీటిని నిలువ ఉంచుటకు అక్కడక్కడ సిమెంట్ దిమ్మలు కట్టారు. నీరు అధికంగా లేని కారణంగా భక్తుల కోసమని ఈ పని ఈమధ్యనే చేసారు. చెంబుతో పోసుకోవాలి తప్ప కాలువలో మునగలేము. కాబట్టి నేను సరిగా స్నానం చేయలేకపోయాను. కాని ఎలాగైనా స్నానం చేసి తీరాలని నాకున్నది. అందుకని ఆ సిమెంట్ నిర్మాణం ప్రక్కన క్రింద పడుకున్నాను. నా ప్రక్కన ఉన్న వ్యక్తులకు నాపై నీటిని పోయమని చెప్పాను. వారు పోస్తున్నారు. ఇంతలో ఇలా క్రింద పడుకొనుట కొంచెం చిన్నతనంగా భావించాను. మరియు ఒక ఇద్దరు తెలిసినవారు కొంతదూరము నుండి నా వైపు వస్తున్నారు. వారు వచ్చే లోపల నా స్నానం పూర్తి కావాలని, నేను లేచిపోవాలని భావించాను. వారు దగ్గరికి వస్తున్నారు. కాని నా స్నానం ఇంకా పూర్తి కాలేదు. కాబట్టి నా తల వారికి కనబడకుండా నేలకు ముఖం చేసి ఏమైనా సరేనని బోర్లా పడుకున్నాను. వారు నావైపు చాలా దూరం వరకు వచ్చారు. చివరికి సమాంతరంగా ఉన్న మరో మార్గంలో ప్రక్కకు వెళ్ళిపోయారు. నాకు ఆటంకం కలగలేదు. ఇది కల.

దీనిద్వారా ఇంకా నాలో లౌకిక వ్యామోహం ఉన్నదని, స్వామివారు ఆశించే స్థితికి చేరలేదని తెలిపారు. ఒకరకంగా నా స్థితిని తెలిపారు.

నేను ఇంతవరకు యోగ్యతను సాధించలేదు. దమ్మాయిగూడ భూ సమస్యను ఉపయోగించి నేను యోగ్యతను సాధించవలసి ఉన్నదని ఒక సందర్భములో సూచించాడు. హైకోర్టు ఆర్డర్ ప్రకారం సర్వే చేస్తామని మండల సర్వేయర్ రెండుసార్లు నోటీస్ ఇచ్చారు. కాని నా ప్రక్కవ్యక్తి వీలుపడదని, తను సర్వేకు రాలేనని చెప్పుట వలన ఈ సర్వే నిలిచిపోయింది. మరోమారు తప్పక దీనిని పూర్తి చేస్తారని భావించిన మా నైబర్ నేను ఆయన భూమిలోనికి వస్తున్నానని క్రింది కోర్టులో స్టే తీసుకువచ్చారు. దీని ద్వారా నాకు మరింత చింత పెరిగింది. ఈ సమస్య మరిన్ని రోజులు సాగగలదని తీవ్ర మనోవేదన కలిగింది. స్వామివారిని తీవ్రంగా ప్రార్థిస్తున్నాను. నాలో కోరుకునే మార్పును త్వరగా కలిగించమని, మనశ్శాంతిని ప్రసాదించమని వేడుకుంటున్నాను.

ఎవరైనా అన్యాయంగా నా భూమిని ఆక్రమించుటకు చూచినప్పుడు ఈ చింత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి స్వామివారిని మరింత ఎక్కువ స్మరిస్తాను. సాధన సరైన విధంగా జరుగుతుంది. సమస్య ఉన్నప్పుడు ఎక్కువ సాధన చేస్తాను కాబట్టి శారీరకంగా చాలా చిక్కిపోయాను. ఒక విద్యార్థి పరీక్షలకు సిద్ధమగునప్పుడు ఎలా చిక్కిపోతాడో అలా చిక్కిపోయాను. నా రూపును చూచి నాకే అసహ్యము వేసే స్థితికి చేరాను. చివరికి ఇది యోగ్యత సాధించుటకు స్వామివారి

లీలగా భావించుకున్నాను. యోగ్యత సాధించుటకు నా ఆస్తి పోయినా బాధలేదని అనుకున్నప్పటికీ మనస్సు నిలుచుట లేదు. వ్యామోహం ఎన్నో రెట్లు పెరిగింది. ఫలితంగా స్వామివారిని ఇలా ప్రార్థించాను.

''ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నా భూ సమస్యను, 'నా' అన్నది నశింప చేయుట మరియు యోగ్యత సాధించుటకు ఉపయోగించండి. నాకు ఆ భూమిపైన ఏమాత్రం వ్యామోహం లేకుండా చేయమన్నాను''. ఆస్తిని పణంగా పెట్టి సాధన చేయిస్తున్నారని గ్రహించాను. స్వామి కోసం నా ఆస్తి పోతే తప్పేంటనే భావం నా మనస్సులో వచ్చింది. ఈ సమస్యను తట్టుకునే శక్తిని ప్రసాదించమని వేడుకున్నాను. మరో ప్రార్థన ఇలా కోరాను.

''శ్రీవేంకటేశ్వరా! నాకు తెలిసి చాలామంది భక్తులు సాధన చేసి మిమ్మలను పొందిన వెంటనే పరలోకమునకు వెళ్ళిపోయారు. కాని నా విషయంలో మాత్రం మిమ్ములను పొందిన తరువాత మీ సేవ చేస్తూ మరికొన్ని రోజులు ఈ భూమిమీద జీవించే అవకాశమును ఇవ్వమన్నాను''. నా దోసిలి పట్టి స్వామి పాదాల చెంత పెట్టి నా కళ్ళనుండి నీరు కారుచుండగా ఈ భిక్ష పెట్టమన్నాను. స్వామివారు తప్పక కరుణించునని భావించాను. స్వామివారికై సాధన జరుగుచున్నది. మరియు ఇప్పుడు మరో పవిత్ర స్నానం చేయించాడంటే బహుశా ఇప్పటినుండి నా జీవితంలో మరోమార్పు జరగబోతోందని అర్థం.

## ఉన్నత స్థితి (యోగ్యత) ప్రసాదించ ప్రార్థన

ఒక రెండు రోజుల నుండి నా భూ సమస్య మరియు నా గత అనుభవాలను మేళవించి విశ్లేషించాను. నా జీవితములో ఎప్పుడైతే స్వామి సేవలో పై మెట్టుకు వెళ్ళునప్పుడు ఈ కష్టాలు మితిమీరి వచ్చాయి. స్థూప నిర్మాణం, రథ నిర్మాణం, ఇప్పుడు యోగ్యత ప్రయత్నంలో విఘాతం కలిగించుటకు లేదా నా మనస్సు స్వామిపై అత్యంత ఆత్రుతతో లగ్నమగుటకు ఈ లీలలు వస్తున్నాయని భావించాను. వీటిని అధిగమించి 'నా' అన్నది నశింప చేసుకుని స్వామివారి కృపను పొందాలన్నది స్వామివారి అభిమతంగా భావించాను. కాబట్టి ఈ సమస్యను యోగ్యత సాధించే విధంగా మలచుకోవాలనుకున్నాను. ఒకేసారి ఆ భూమిని ఇవ్వమంటే ఆనందంగా ఇవ్వగలను కాని ఇందులో 'నా' అన్నది నశింప చేసుకొనుట ముఖ్యం. అన్యాయంగా ఒకరు మన ఆస్తిని కబళిస్తే ఊరుకోలేము కదా! కాని ఈ ఆస్తి నాది కాదనే భావంతో, తామరాకుపై నీటిబొట్టు లాగా జీవించాలన్నది స్వామి సూచిస్తున్నారని భావించాను. ఆ దిశలో ప్రయత్నిస్తూ స్వామివారిని సహాయపడమని వేడుకున్నాను. దీనికి సంతోషించిన స్వామివారు ఈ క్రింది లీలను చూపారు.

**తేది 15-07-2023 కల :** బహుశా అది చిన్నగుండవెల్లి గ్రామము లోని ఒక ప్రాంతము. శ్రీవేంకటేశ్వరుని గురించి ఒక పూజకు శంకుస్థాపన లాంటి ఉత్సవం జరిగింది. శ్రీమాన్ రమణాచారి గారు కూడా వచ్చారు. సిద్దిపేట ప్రాంతములో ఉన్న స్వామివారి భక్తులు, ముఖ్యంగా టిటిడి వారి ఆ ప్రాంతపు లోకల్ కమిటీ వారు వచ్చారు. పూజ చక్కగా జరిగింది. అందరూ వెళ్ళిపోయారు. ఆ తరువాత నేను, మరికొందరు ఆ ప్రాంతపు ముఖ్య టిటిడి సభ్యులు, శ్రీమాన్ రమణాచారి గారితో కలిపి ఒక ఆరేడు మందిమి ఉన్నాము. మిగిలిన కొన్ని ప్రసాదాలను ఒక్కొక్కటి తీసుకుని తినుచు ఇష్టాగోష్ఠి మాట్లాడుచున్నాము. ఇంతలో నేను శ్రీమాన్ రమణాచారి గారితో మేము మంచి సేవకులము అనే భావాన్ని మనసులో పెట్టుకుని ఇలా అన్నాను. మేము ఇంత సేవ చేస్తున్నాము కాబట్టి మాలో ఒకరిని తిరుమల ఆలయ కమిటీ (టిటిడి) మెంబర్ గా రికమెండ్ చేయవచ్చు కదా! అని అన్నాను. రికమెండ్ చేయమన్నాను. మాలో ఒకరిని అని అన్నానే కాని లోపల మాత్రం నన్ను మెంబర్ గా రికమెండ్ చేస్తారు అనే భావం నాలో ఉన్నది. శ్రీమాన్ రమణాచారి గారు రికమెండ్ చేస్తే టిటిడి ఆలయం వారు వింటారట. ఇంతే కల.

**దీనర్థం :** నాకు ప్రస్తుతం ఉన్న స్థితి కంటే ఉన్నతస్థితిని పొందాలనే కోరిక కలిగింది. మరియు దయచేసి త్వరగా నన్ను మీ వాడిగా చేర్చుకొమ్మని స్వామివారిని వేడుకుంటున్నానని అర్థం.

గత కొన్ని రోజుల నుండి సర్వే చేసి మా సర్వే నెంబర్స్ ను త్వరగా కూర్చోబెట్టమని స్వామివారిని తీవ్రంగా ప్రార్థిస్తున్నాను. కాని పని కావడం లేదు. ఈ రోజు ఇదే విషయాన్ని స్వామివారు కలలో చూపారు.

**తేది 22-07-2023 కల :** ఈ కలలో మా భూమిలో మండల సర్వేయర్ ను చూచాను. గతంలో నేను ప్రయత్నించినప్పటికీ నా దమ్మాయిగూడ ల్యాండ్ సర్వే చేయలేదు. ఈ రోజు ఎలాగైనా ఫిక్స్ చేయమని వారిని అడిగాను. వారు వచ్చే సర్వే తేది నాడు కూర్చోబెట్టుదురని చెప్పారు. మండల సర్వేయర్ వారి అసిస్టెంట్స్ మా భూమిలో కనపడ్డారు.

దీనర్థం – తప్పక మా భూములను సర్వే చేసి కూర్చోబెట్టుదురని చెప్పారు.

తేది 05-08-2023 నాడు సర్వే చేస్తారని 10 రోజుల క్రింద నోటీసు ఇచ్చారు. ఈ రోజు స్వామివారు సూచించినట్లు కూర్చోబెడుదురనుకున్నాను. గత 10 రోజుల నుండి స్వామివారిని తీవ్రంగా స్మరిస్తున్నాను. చివరకు సర్వే

క్యాన్సిల్ అయింది. స్వామి లీల ఫలించలేదు. మరోసారి తేది ఫిక్స్ చేస్తారనుకుంటున్నాను. ఈ విధంగా నన్ను మళ్ళీ మళ్ళీ తపించే విధంగా చేసి మరింత సన్నగా చేయుటే దీని అసలు లక్ష్యంగా కనిపించింది. తేది 04-08-2023 నాడు ఈ భూమిని స్వామికి సమర్పించాను. అయినా దానిపై వ్యామోహం తగ్గలేదు. హృదయం ద్రవిస్తోంది. ఫలితంగా సన్నబడుచున్నాను.

## ఆత్మ పరిశీలన

నిన్న నేను 16వ భాగం అనుభూతులను వ్రాశాను. ద్రౌపది లాగా సంపూర్ణ శరణాగతిని కోరినప్పుడు పొందిన అనుభూతిని మరోసారి చవి చూచాను. పూర్తి సమర్పణా భావంతో స్వామివారికి లోబడి ఉంటే స్వామివారు స్వయంగా వచ్చి మనలను కాపాడుదురని దీని ముఖ్యోద్దేశం. నా భూ సమస్య విషయంలో కూడా ఈ స్థితిని పాటించాలనే ఆలోచన వచ్చింది. నాలో మార్పు కోసం ఈ సమస్య వచ్చినదని ఎన్నోసార్లు గ్రహించాను. నా ఆస్తిని పణంగా పెట్టి, మరోప్రక్క దీనిపైన విపరీతమైన వ్యామోహాన్ని కలుగజేసి, దీనినుండి బయటకు రమ్మంటూ శిక్షణ ఇస్తుంటారు. ఎంత ప్రార్థించినా వినరు, చివరికి నా మూలంలో మార్పు జరిగిందని భావించినప్పుడు మాత్రమే ముక్తి లభిస్తుంది. అయితే నన్ను మీ ఇష్టం వచ్చినట్లు వాడుకోండని, నాలో తగిన విధంగా మార్పు తీసుకురండని, హరినామక్షేత్రం ఏర్పాటు చేయుటకు సిద్ధం చేయండని తేది 05-07-2023 నాడు కోరాను. దాని అనుగుణంగా ఆ రోజు నా ప్రక్క భూమాయన సివిల్ కోర్టులో స్టే తీసుకు వచ్చారు. ఫలితంగా భూ సర్వే కాకుండా, అయినా బౌండరీ పెట్టకుండా అడ్డు తగిలాడు. ఇది స్వామి లీలగా భావించి దానికనుగుణంగా ప్రవర్తిస్తూ జీవించాలని భావించాను. సర్వం స్వామివారే చూచుకొనునను భావంతో జీవించాలనుకున్నాను. దీనితో మనస్సు తేలికైంది.

ఇప్పటివరకు మా పిల్లలపై ప్రేమ, మమకారము నశించేవిధంగా చేసాడు. నేను బంధువులతో కూడా అంతంత మాత్రంగానే ఉంటాను. వారు కలిసినప్పుడు కూడా నా లోకంలో నేనే ఉంటాను కాబట్టి వారితో అంత సాన్నిహిత్యం లేదు. కాని మా సురేఖకు సాన్నిహిత్యం ఎక్కువ. సురేఖకు ఇద్దరు అక్కలు, నలుగురు అన్నలు, మొత్తం ఏడుగురు సంతానం. సురేఖ చిన్నది. వీరి అక్కలతో మంచి సాన్నిహిత్యమున్నది. ఇప్పుడు దీనిని స్వామివారు నిలువరించదలచారు. దాని భావమే ఈ కల.

**తేది 30-07-2023 కల :** ఈ కల సురేఖకు గత ఆరేడు రోజుల క్రింద వచ్చిందట. సురేఖ ఒక బట్టల దుకాణము లోనికి బట్టలు కొనే విషయమై వెళ్ళిందట. ఆ షాపులో మొదటి గది లోనికి వెళ్ళగానే వీరి పెద్దక్క మరియు చిన్నక్కలు కూడా షాపుకు వచ్చి, ఏదో మాట్లాడుకొనుచున్నారట. వీరిని చూచిన సురేఖ ఆశ్చర్యపోయిందట. వీరిని పలుకరించబోయిందట. కాని వారు ఈమెను చూడనట్లు నటించి వారి మాటల్లో ఉన్నారట. దీనిని గమనించిన సురేఖ వారితో మాట్లాడకుండానే లోని గదికి వెళ్ళిపోయిందట. ఇంతే కల. అంటే... ఇంక నుండి సురేఖకు వారి సోదరీ సోదరులు దూరమవుదురని అర్థం.

## ఆత్మ పరిశీలన – ఆచరణ

నేను 'నా' అన్నది మరియు వ్యామోహాన్ని వదిలితే యోగ్యత సాధించగలనన్నాడు. దీనిని సాధించుటకు రకరకాల సమస్యలతో పాటు భూ సమస్య సృష్టించబడ్డది. ఈ సమస్యను ఉపయోగించి యోగ్యత సాధించాలని భావించాను. సమస్య ఉన్న ఈ భూమితో పాటు నాకున్న సర్వస్వం, నావారు, పుత్రులు మరేదీ శాశ్వతము కాదు పైగా నాది కాదు భగవంతునిది కాబట్టి వాటిపై ఉన్న మమకారమును సమూలంగా త్రుంచి వేయాలనుకున్నాను. దీనికి సహాయం చేయుమని, స్వామివారిని, యోగమాయను, నా గురువు శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామివారిని వేడుకుంటున్నాను. నేను కేవలం హరినామక్షేత్రం ఏర్పాటు చేసి స్వామి కృప సర్వులకూ అందించుటే కర్తవ్యం అని, మరో విషయం అడ్డు వస్తే దానిని నాకు అనుకూలంగా మలచుకుని యోగ్యత సాధించాలని భావించాను. ఈ భూమి నాది కాదనుకున్నప్పుడు ప్రశాంతత కలిగింది. ఈ భావాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళాలని భావిస్తూ స్వామివారిని ప్రార్థించాను. ఈ చింతలో నేను మరింతగా చిక్కిపోయాను. ఈ చిక్కిపోవుటకు కూడా నేను 'నా' అన్నది నశింపచేసుకోక పోవుట వలన అనే విషయాన్ని గ్రహించాను. చివరికి స్వామివారికి శరణాగతుణ్ణైనాను, రక్షించమని వేడుకున్నాను. మరియు మొత్తం దమ్మాయిగూడ భూమిని స్వామివారికి సమర్పించాను. దాని చింత నుండి ముక్తుణ్ణి చేయమని వేడుకున్నాను. కాని ఈ మధ్యన మండల సర్వే వారు సర్వే చేస్తామని నోటీసు ఇచ్చి మళ్ళీ క్యాన్సిల్ చేశారు. సమస్య మరింత పొడిగించబడ్డది. చివరికి ఈ ఆటంకాలను తట్టుకోలేక స్వామివారితో పాటు కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారిని సహాయము చేసి యోగ్యత ప్రసాదించమని వేడుకున్నాను.

ఈ భూమిపైన ప్రక్కవాడు వేసిన సివిల్ కేస్ తీరుటకు సంవత్సరాలు పట్టును. కాబట్టి నాకు దీని ద్వారా మరింత శిక్షణ ఇస్తున్నట్లు భ్రమ కలిగింది. ఈ చింతతో మరింత సన్నబడ్డాను, చూచిన వారు ముక్కుమీద వేలు వేసుకునే స్థితికి వచ్చాను.

మరోప్రక్క ''చూడు మీ క్లాస్ మేట్స్ వారి రంగంలో చక్కగా ఎదిగి బొజ్జలు పెంచి ఉన్నారు. నీవు మాత్రం నీ రంగంలో ఎదగక చిన్నపిల్లవాడిగా ఉన్నావు'' అని స్వామివారు గతంలో అన్నమాట మాటి మాటికీ గుర్తుకు వచ్చింది. అందుకని స్వామివారిని దీనంగా ప్రార్థించాను. మరో విషయం: నాకు ఈ జీవితం పొడిగించబడ్డది. ఈ లోకంలో ఉన్న ప్రతి వస్తువు, ఆస్తి నాది కాదు అనే భావము కలిగి కేవలం సంకల్పం నెరవేర్చుటకు, నా అన్నది నశింప చేసుకుని, యోగ్యత సాధించుటకే సర్వదా ప్రయత్నించాలనుకున్నాను.

## 21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

21వ పర్యాయంగా 7 కోట్ల జపానికి తేది 21-08-2023 నుండి మూడు రోజులు మా ఇంటిలో ప్రత్యేక పూజలు చేసాము. ఆ తరువాత తేది 06-09-2023 నాడు సాయంత్రం 6 గంటల నుండి తిరుపతి లోని అలిపిరి పాదాల మండపము వద్ద స్వామివారి పాదాలకు సమర్పించి పూజించాము. శ్రీవేంకటేశ్వర మహా మంత్రాన్ని అనుసంధానిస్తూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేసాము. స్వామి పాదాలను అభిషేకించి పూజించాము. జపము వ్రాసిన వారి కోరికలు తీర్చాలని ప్రార్థించాము.

ఆ తరువాత తేది 07-09-2023 గురువారము నాడు టిటిడి గోశాలలో శ్రీవేంకటేశ్వర మహామంత్ర యజ్ఞము చేసాము. జపం వ్రాసిన వారి కోరికలు తీర్చుమని స్వామివారిని ప్రార్థించాము. ఆ తరువాత టిటిడి ఛైర్మన్ శ్రీమాన్ కరుణాకర రెడ్డి ఇతర అధికారులు వచ్చారు. యజ్ఞ పూర్ణాహుతి సమర్పించి, జపమును స్వామివారికి సమర్పించారు. ఆ తరువాత 22వ పర్యాయంగా 7 కోట్ల జపానికి ప్రారంభోత్సవం చేసారు.

ఆ తరువాత కొండకు పోయి స్వామివారిని దర్శించుకుని తేది 10-09-2023 నాడు హైదరాబాద్ వచ్చాము. సంకల్పం నెరవేర్చుమని, హరినామక్షేత్ర సేవను ప్రసాదించమని వేడుకున్నాను. మరియు మీరు గతంలో నేను తృప్తి చెందేవరకు మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించారు. నేను ఇంతవరకు తృప్తి చెందలేదని, తప్పక నాకు హరినామక్షేత్రం ఏర్పరచి, మీ అఖండనామ సంకీర్తనను ఏర్పాటు చేసే సేవను ప్రసాదించమని వేడుకున్నాను. మొత్తం మీద యోగ్యత సాధించుటకు ప్రసాదించిన సమస్యల లోని బాధలను తాళలేకపోవుట వలన స్వామివారిని తీవ్రంగా స్మరించాను. ఒక దశలో ఈ బాధల నుండి నేను ప్రక్కకు తప్పుకోకూడదని భావించి స్వామివారు ఈ క్రింది లీలను చూపారు.

## లోక కళ్యాణార్థం సాధన చేయాలి

గత 10 రోజుల నుండి మా ఇంటిలోని మునిసిపల్ నల్లా నీరు కంటామినేటెడ్ అయి మురికినీరు వస్తోంది. కాబట్టి మా ఇంట్లోని అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంకును కడిగి శుభ్రం చేసాము. మరియు ఈ ట్యాప్ నీరు అందులో పడకుండా చేసి, పైననే ప్రతిరోజూ పరీక్షిస్తున్నాము. ఇది దాదాపు గత 10-12 రోజుల నుండి జరుగుచున్నది.

**తేది 11-09-2023 కల :** ఈ కలలో నేను ఉదయం 6 గంటలకు మార్నింగ్ వాక్ కని హైదరాబాద్ లోని మా ఇంటి నుండి బయలుదేరేటప్పుడు మా ఇంట్లో ఈ ట్యాప్ నీరు అత్యంత ప్రెషర్ తో వస్తుంది. నేను వెళ్ళి ఆ నీరు వాసన చూసి పరీక్షించాను. ఎలాంటి మురికి వాసన లేకుండా స్వచ్ఛంగా ఉన్నవి. మరియు మా వాటర్ ట్యాంక్ ఖాళీగా ఉన్నది. కాబట్టి ఈ మంచినీటితో నింపాలనుకున్నాను. ఇంతలో సీను




మా ట్యాపు నీరు ఊరందరికి ఇచ్చుట. (లీల 11-09-2023)

మారిపోయింది. మా ఇల్లు ఒక ఊరిలో ఉన్నట్లు కనబడ్డది. ఆ ఊరికి మేము ముఖ్యమైన వారిమట. మేము ఊరిలోని మా ఇంటికి నీటి కనెక్షన్ తీసుకుని దాని ద్వారా ఊరివారి కోసం మా ఇంటి ముందు పబ్లిక్ కనెక్షన్ పెట్టామట. ఇదే నీరు మాకు వచ్చి ఆ తరువాత పబ్లిక్ ట్యాపుకు పోతుంది. అయితే ఊరివారి కోసం వదిలిన ఒకే పైపుకు ఏక కాలములో ఎంతోమంది పట్టుకునే వీలు కల్పించబడ్డది. నేను వెళ్ళి చూచాను. అక్కడ ఒక్క ట్యాప్ కు బదులు ఎన్నో ట్యాప్ లు ఉన్నవి. వాటినుండి నీరు ప్రెషర్ గా పోవుచున్నది. ఒక పైపుకు ఎక్కువ జనాలు ఏక కాలములో పట్టుకొనుటకు వీలుగా మరెన్నో పైపులు అమర్చబడి ఉన్నవి. అన్ని పైపుల నుండి నీరు ప్రెషర్ గా పోవుచున్నది. నేను నిజానికి ఈ నీటిని ఆపితే మా ఇంటిలో ఉన్న ట్యాపులో నీరు అదనపు ప్రెషర్ తో వచ్చి మా ట్యాంక్ తొందరగా నిండుతుంది. కానీ అలా చేయలేదు. కల చెదిరింది.

దీనర్థం స్వామి కృప దండిగా లభించునని ఈ కల కన్నప్పుడు భావించినప్పటికీ దీని నిజమైన అర్థం ఇలా ఉంది. నేను కేవలం నా వరకు, నా కుటుంబం వరకు మాత్రమే స్వామి కృప లభించాలనే విధంగా సాధన చేయకూడదు. ఈ సాధన మా ప్రాంతపు సంపూర్ణ ప్రజల కోసం, లోక కళ్యాణార్థం చేయాలి కాబట్టి మరింత కష్టపడవలసి ఉన్నదని సూచించారు.

పూర్వం ఇంజనీరింగ్ చదివి మా ఒక్క కుటుంబాన్ని మాత్రమే ఉన్నత స్థితికి తీసుకురావలెననుకున్నాను. కాని స్వామివారు మాత్రం మొత్తం ప్రాంతాన్ని ఉన్నతస్థితికి తీసుకురమ్మని చెప్పారని భావించాను. దానికనుగుణంగానే ఈ కల ప్రసాదించారు.

## మనవడు వస్తున్నాడని తెలుపుట

గతంలో స్వామివారు నాకు ఒక మనవడు పుట్టబోవుచున్నాడని గత 5 సంవత్సరాల నుండి ఒక ఆరేడు సందర్భాలలో ఇదుగో వచ్చే... అదుగో వచ్చే... అంటూ చూపెట్టాడు. కాని ప్రసాదించలేదు. కాని జూన్ 2023 లో నా కొడుకు చి|| వేదాంత్ చర్యల వల్ల వాడిని, వాడికి సంబంధించిన అన్ని విషయాలను త్యజించి వేసాము. అంటే... మాకు పుట్టబోయే మనవడిపై ప్రేమను త్రుంచి వేసుకున్న తరువాత ఈ మధ్య మా కొడుకుకు సంతానం కలుగుతుందని తెలిసింది. గతంలో స్వామివారు మాకు మనవడే పుట్టునని చెప్పాడు కాబట్టి వాడికి మగపిల్లవాడే పుట్టునని ఖచ్చితంగా చెప్పాను. తేది 04-11-2023 నాడు వాడి ఇంటిలో లింగ నిర్ధారణ కార్యక్రమం ఉందంటూ మా కొడుకు మెసేజ్ పెట్టాడు. నేను వాడి మెసేజ్ ను కావాలని చూడలేదు. ఎలాంటి వాత్సల్యతకు తావివ్వక స్వామినే స్మరిస్తూ మా కుమారునికి దూరంగా ఉన్నాను. స్వామివారిని ఒక చిన్నపిల్లవాడిగా వచ్చి నన్ను కటాక్షించుమన్నాను. కొడుకుకు సంబంధించిన విషయాలలో తల దూర్చదలుచుకోలేదు. కాని నా భార్య సురేఖ ఈ విషయాన్ని విని ఉత్తేజితురాలైంది. మరియు స్వామివారు మా కొడుకు చి|| వేదాంత్ ను ఇలా అనుగ్రహించారు.

## చి|| వేదాంత్ ను అనుగ్రహించుట

తేది 25-09-2023 ఉదయం నా పెద్ద కుమారుడు చి|| వేదాంత్ కు ఒక కల వచ్చిందట. అమెరికాలోని వాడి ఇంటి వెనుక కొంత స్థలము ఉన్నది. డైనింగ్ హాల్ నుండి బయటకు వెళ్ళుటకు వీలుగా ఒక డోర్ ఉన్నది. ఈ కలలో చి|| వేదాంత్ ఆ డోర్ తీసి ఎందుకో బయటకి పోబోతుంటే... డోర్ కు ఒక ఆరేడు అడుగుల దూరంలో, వీరి గోడకు ఆనుకుని ఒక పడగ విప్పి ఉన్న నాగుపామును చూచాడట. ఇంతే కల. దీనిని 25-09-2023 నాడు సురేఖకు చెప్పాడు.

దీనర్థం స్వామివారు వాళ్ళ ఇంటికి వస్తున్నారని కావచ్చును. తన భార్య ఇప్పుడు 3 నెలల గర్భవతి.

**నా దశ :** నా మనస్సు అన్య విషయాలపైకి పోకుండా స్వామివారు కట్టడి చేశారు. శంకుస్థాపన దిశగా వెళ్ళుచున్నామని సూచించారు. నేను యోగ్యత సాధించాలి తప్ప కష్టాలకు తప్పించుకోలేనని అన్నారు. స్వామి అనుగ్రహము అవసరమున్నప్పుడు లభిస్తుంది.

ఈ కాలములో జరిగిన కళ్యాణాలు : 45 వ కళ్యాణం నుండి 54 వ కళ్యాణం వరకు మొత్తం 10 కళ్యాణాలు.

**భాగవత ఆశీర్వాదము:** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా మిమ్మల్ని భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**గోవిందదాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**
**ఇ.నెం.1-1-53, వీధి నెం.1.హబ్సీగూడ,**
**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

'హరినామ క్షేత్రం'



# తిరుమల ఆలయ ప్రతిరూప నిర్మాణం

చిన్నగుండవెల్లి, సిద్ధిపేట, తెలంగాణ

## భక్తులకు విజ్ఞప్తి

ఓం నమో వేంకటేశాయ
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి
దివ్య ఆదేశముచే సిద్దిపేట జిల్లా చిన్నగుండవెల్లి
గ్రామములో 7 ఎకరాల విశాల ప్రాంగణములో
'హరినామక్షేత్రం' పేరుతో తిరుమల ఆలయ
ప్రతిరూపం (వెండివాకిలి వరకు)
నిర్మాణ కార్యక్రమము 02-07-2026 నుండి
శంకుస్థాపనతో ప్రారంభమైనది.
తిరుమల స్వామివారికి ఈ క్షేత్రం ఎంతో
ఇష్టమైనది. ఈ ఆలయం కోసం స్వామివారు
2000 సంవత్సరం నుండి ప్రసాదిస్తున్న వేలాది లీలలను
"దిశా నిర్దేశం" పేరుతో www.srivenkatesham.org లో
తెలుగు, ఇంగ్లీషులో చూడవచ్చును. భవిష్యత్తులో
ఇది ఒక దివ్యదేశం వలె వెలుగొందగలదని స్వామివారి వాక్కు.
ఈ ఆలయ నిర్మాణంలో పాలు పంచుకునే మహాభాగ్యం జన్మ జన్మలకైనా
లభించదు. మనతో రానిది సంపద... మనతో వచ్చేది శ్రీహరి సేవ మాత్రమే!

**ఈ ఆలయ నిర్మాణంలో మీ వంతు విరాళం ఇవ్వండి!**
**శ్రీవేంకటేశ్వరుని కృపను పొందండి!**



దాతలకు ప్రత్యేక గౌరవం

## చందా వివరములు

**రాజ పోషకులు**
రూ.25 లక్షలు ఆ పైన

**పోషకులు**
రూ.11 లక్షలు ఆ పైన

**మహాదాతలు**
రూ.1 లక్ష, ఆ పైన

**దాతలు**
రూ.10,116 ఆ పైన

**విశేష దాతలు**
ఆలయములో
ఒక భాగమును నిర్మించుట

భక్తులు యథాశక్తి సమర్పించవచ్చును.

ఒక చదరపు అడుగు రు. 7,116/-

SRI VENKATESHWARA MAHA MANTRA PEETHAM

SCAN & PAY

**BANK ACCOUNT DETAILS** PAN No : ABOTS9268H

| BANK | NAME | IFSC Code | A/c Number |
|---|---|---|---|
| SBI, Habsiguda | Sri Venkateshwara Maha Mantra Peetham | SBIN0016514 | 45388232753 |
| HDFC, Siddipet | Sri Venkateshwara Maha Mantra Peetham | HDFC0008931 | 50200124113242 |

We do not accept foreign currency

**వివరాలకు సంప్రదించగలరు:**

శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం
ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సిగూడ, హైదరాబాద్-500007.

గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
9348212354, 9348811223, 040-27175050

ఓం నమో వెంకటేశాయ

# పవిత్ర యజ్ఞ ఆహ్వానం

శ్రీ వేంకటేశ్వర మహా మంత్ర పీఠం ఆధ్వర్యంలో



## 2వ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం

**తేది 03-10-2026 శనివారం ఉ. 10.30 నుండి**

**హరినామ క్షేత్రం, చిన్నగుండవెల్లి, సిద్దిపేట.**



కలియుగ ప్రత్యక్షదైవం, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆజ్ఞచే సిద్దిపేట జిల్లా చిన్నగుండవెల్లి గ్రామములో 7 ఎకరాల స్థలములో, తిరుమల ఆలయ ప్రతిరూపం, హరినామక్షేత్ర నిర్మాణ కార్యక్రమాలు తేది 02.07.2026 శంకుస్థాపనతో ప్రారంభమై కొనసాగుతున్నాయి. ఈ క్షేత్రం స్వామివారికి ఎంతో ప్రీతికరమైనది. దీని సాధించుటకు స్వామివారు సం॥ 2000 నుండి చూపుతున్న లీలలను www.srivenkatesham.org లో 'దిశానిర్దేశం' పేరుతో చూడవచ్చును.

ఈ దివ్య తరుణంలో, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు త్వరితగతిన ఆలయంలో కొలువుదీరి భక్తులను అనుగ్రహించాలని, ఆలయ నిర్మాణం శీఘ్రంగా పూర్తి కావాలని, సమస్త లోకక్షేమం కలగాలి, భక్తుల మనోభీష్టాలు నెరవేరాలి అనే మహాసంకల్పంతో- శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం సిద్దిపేట చిన్న గుండవెల్లి గ్రామంలో ఆలయ ప్రాంగణంలో యాగ మండపంలో ఈ యజ్ఞాన్ని ప్రతి మాసము ఒకసారి, తిరుమల క్షేత్ర పండితుల చేత వైదికంగా నిర్వహించబడును.

ఈ యజ్ఞం ఎంతో విశిష్ట ఫలితాన్ని అందిస్తుందని శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య కృపాకటాక్షాలు లభించి సమస్త సుఖ శాంతులు కలుగుతాయని వైఖానస ఆగమం తెలియజేస్తున్నది, ధర్మాభివృద్ధి, భక్తుల మనోభీష్ట సిద్ధి కలగాలని ప్రార్థిస్తూ ఈ మహా యజ్ఞం నిర్వహించబడును.

ఈ మహా యజ్ఞంలో దంపతులుగా ప్రత్యక్షంగా పాల్గొని యజ్ఞ సంకల్పం చేసుకునే అవకాశం కలదు. యజ్ఞాన్ని దర్శించడం, పాల్గొనడం, యజ్ఞ ప్రసాదాన్ని స్వీకరించడం భక్తులకు ఒక అదృష్ట అవకాశం.

**యజ్ఞం రుసుము**
**రూ. 3,000/-**

ప్రత్యక్షంగా హాజరు కాలేని భక్తులు సైతం తమ గోత్రనామాలను నమోదు చేయించుకొని పరోక్షంగా ఈ పవిత్ర యజ్ఞంలో భాగస్వాములు కావచ్చు. యజ్ఞ ప్రసాదాన్ని స్వీకరించి శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపకు పాత్రులు కండి.

**BANK ACCOUNT DETAILS**

| BANK | NAME | IFSC Code | A/c Number |
|---|---|---|---|
| SBI, Habsiguda | Sri Venkateshwara Maha Mantra Peetham | SBIN0016514 | 45388232753 |
| HDFC, Siddipet | Sri Venkateshwara Maha Mantra Peetham | HDFC0008931 | 50200124113242 |

**సంప్రదించండి:**

**93482 12354, 98480 56468, 9030359359**

ఓం నమో వేంకటేశాయ

# అఖిలాండకోటి బ్రహ్మాండాలకు జనని

# శ్రీ లలితాంబిక

: చిల్లర సీతారామారావు

**(భండాసురుడి సంహరణ గాథ)**



**"ప్రాతర్నమామి లలితా చరణారవిందం**
**భక్తేష్ట దాన నిరతం భవసింధు పోతం**
**పద్మాసనాది సురనాయక పూజనీయం**
**పద్మాంకుశ ధ్వజ సుదర్శన లాంఛనాఢ్యమ్"**

భక్తులకు కోరికలను ప్రసాదించడంలో ఆసక్తి కలదియు, సంసార సముద్రమునకు నావ వంటిది, బ్రహ్మ మొదలైన దేవతా శ్రేష్ఠుల చేత పూజలు అందుకొంటున్నది, పద్మము, అంకుశము, ధ్వజము, సుదర్శనము అనెడు చిహ్నములతో ప్రకాశించుచున్నది అయిన లలితాదేవి యొక్క పాదములకు వందనము.

సంకల్పము మాత్రము చేతనే విశ్వమును సృజించి, దేవదేవులకు వివిధ శక్తులను ప్రసాదిస్తూ ఎప్పటికప్పుడు వారిని సద్ధర్మరీతిన పాలిస్తున్న జగజ్జనని శ్రీ లలితాదేవి. ఆమె సర్వమంగళ. సర్వ మంత్రములకు, సర్వ తంత్రములకు లక్ష్యము ఆమె. చతుష్షష్ఠి కళలకు అధిష్ఠాన దేవత. భక్తజనుల అజ్ఞానాంధకారమును రూపుమాపగల నఖకాంతులు గల పరాశక్తి శ్రీలలిత. త్రిపురసుందరి, త్రిపురేశ్వరి, కామేశ్వరి, రాజరాజేశ్వరి మున్నగు నామములతో అర్చనలు అందుకుంటున్న అఖిలాండకోటి బ్రహ్మాండాలకు జనని శ్రీలలిత. సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి అను అంబాత్రయం అమ్మవారి స్వరూపాలే. త్రిపురాత్రయంలో రెండో శక్తి శ్రీలలిత. దేవీ ఉపాసకులకు అత్యంత ముఖ్యమైన దేవత. ఈమె పంచ దశాక్షరీ మహామంత్ర అధిష్ఠాన దేవత. శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత. దశమహావిద్యలలో లలితాంబను ఒక శక్తిగా

పేర్కొంటారు.

శ్రీలలిత లేత ఎరుపు వర్ణముతో, అమిత లావణ్యవతిగా ప్రకాశిస్తూ ఉంటుంది. చతుర్భుజముల యందు చెరకు, విల్లు, బాణము, అంకుశము ధరించి కుడివైపున లక్ష్మీదేవి, ఎడమవైపున సరస్వతీదేవి సేవలు చేస్తుండగా శ్రీలలితా దేవి భక్తులను అనుగ్రహిస్తూ ఉంటుంది. శ్రీలలితను భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తే, ఆ దేవత దారిద్ర్య దుఃఖములను తొలగించి సకల మనోభీష్టాలను నెరవేరుస్తుంది. శ్రీలలిత సర్వలోకాతీతమైన కోమలత్వం కలిగిన మాతృమూర్తి.

జగన్మాత నాలుగవ అవతారము శ్రీలలితా పరమేశ్వరీ అవతారము. నవరాత్రులలో అయిదవ రోజున శ్రీలలితా పంచమీ వ్రతమును ఆచరిస్తారు. దీనినే ఉపాంగ లలితా వ్రతము అని కూడా అంటారు. ఆ రోజు ప్రాతః కాలముననే లేచి స్నానాదికములు పూర్తి గావించుకోవాలి. పూజగదిని శుభ్రపరచుకోవాలి. గడపలకు పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టాలి. గుమ్మములు తోరణములు కట్టాలి. పూజగదిలో ఒక మంటపము ఏర్పాటు చేసుకోవాలి. దానిమీద లలితాదేవి చిత్రపటమును గాని, ప్రతిమను గాని ఉంచాలి. ఆ ప్రతిమను పూలతో అలంకరించాలి. షోడశోపచారములతో, అష్టోత్తరములతో పూజించాలి. సకల శక్తిత్వము, సర్వశ్రేష్ఠము అయిన లలితా సహస్ర నామములు, లలితా త్రిశక్తిని పఠించాలి. శ్రీచక్రమును అర్చించాలి. శ్రీవిద్యా మంత్రమును జపించి, లలితా సహస్ర నామములు పఠిస్తే, సకలైశ్వర్యాలు ప్రాప్తిస్తాయి. పిండివంటలను అమ్మవారికి నైవేద్యముగా పెట్టాలి. సాయంకాలము ఆలయమునకు వెళ్ళి అమ్మవారిని దర్శించుకోవాలి.

లలిత అను పదమునకు శోభ, విలాసము, గాంభీర్యము, మాధుర్యము, ధైర్యము, తేజస్సు, లాలిత్యము, ఔదార్యము అను అర్థాలు ఉన్నాయి. సర్వలక్షణములు కలిగిన లలిత శివ శక్త్యైక స్వరూపిణి. ''లోకానాతీత్య లలితే లలితా తేన ఉచ్యతే''. లోకాతీతమైన చక్కని తేజస్సు, లాలిత్యము, శోభ, మాధుర్యము, విలాసము, గాంభీర్యము, ఔదార్యము, స్థైర్యము మొదలగు గుణములు ఉండుట వలన శ్రీమాతకు లలిత అను పేరు కలిగింది. శ్రీచక్ర సంచారిణి, భండసైన్య సంహారిణి, శ్రీమాత. మహారాజ్ఞిగా పూజలందుకునే అఖిలాండకోటి బ్రహ్మాండనాయకి, ఆదిపరాశక్తి శ్రీలలితామాత. దుష్టుల దుశ్చర్యలు మితిమీరినప్పుడు, ప్రజలు అల్లాడుతున్నప్పుడు వారిని రక్షించడానికి, దుష్టులను సంహరించడానికి ఆదిశక్తి ఆవిర్భవిస్తుంటుంది. పూర్వము భండాసురుడు అను రాక్షసుడి అకృత్యములు మితిమీరి పోవడంతో లోకాలన్నీ అల్లకల్లోలమయ్యాయి. ప్రజలందరూ విపరీతమైన భయాందోళనలతో విలవిల లాడుతున్న సమయంలో వారిని రక్షించుట కొరకు ఆదిపరాశక్తి, జగన్మాత లలితాదేవిగా ఆవిర్భవించి భండాసురుడిని సంహరించి ప్రజలకు ఆనందమును కలిగించింది. ఆ కథను స్మరించుకుని తరిద్దాం.

పరమేశ్వరుడు తపోనిష్ఠ యందుండగా, దేవతల కోరిక మేరకు మన్మథుడు తన బాణములతో శివుడి నిష్ఠకు భంగం కలిగిస్తాడు. శివుడు ఆగ్రహముతో తన మూడవ నేత్రాగ్నితో మన్మథుడిని భస్మము గావిస్తాడు. కొంతకాలమునకు ఆ ప్రాంతమునకు వచ్చిన లక్ష్మీగణపతి ఆ భస్మమును చూచి విచారమును పొంది, దయగలవాడై ఆ భస్మము నంతయు ప్రోగు చేసి, పురుషాకృతిగా చేసి ప్రాణప్రతిష్ఠ చేసి బ్రతికిస్తాడు. ఆ బాలుడు రూప యవ్వన సంపత్తి గలవాడై లక్ష్మీగణపతికి నమస్కారం చేస్తాడు. లక్ష్మీగణపతి ఆ బాలునకు శతరుద్రీయమునుపదేశించి, శివుడిని ఆరాధించమని చెబుతాడు. ఆ బాలుడు భక్తి శ్రద్ధలతో శివపంచాక్షరీ జపమును, శతరుద్రీయమును జపిస్తాడు. ఆ బాలుడి తపమునకు పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరమును కోరుకొమ్మని పలుకుతాడు. శివుడిని చూసిన బాలుడు ఆనందముతో, భక్తితో శివుడిని స్తుతిస్తాడు. పిదప తన కోరికను వెల్లడిస్తాడు. పరమేశ్వరా! నాకు అస్త్రముల వలన గాని, శస్త్రముల వలన గాని, ఇతర సాధనముల వలన గాని చావు లేకుండునట్లు, నాతో యుద్ధము చేయు పగవాని బలము నన్ను చెందునట్టుల వరమును ప్రసాదించుము అని కోరాడు. భక్తా! నీవు కోరిన వరములనిచ్చాను. నీవు ఇరువది వేల సంవత్సరముల కాలము దానవ రాజ్యమును పాలన చేసి శ్రీ పరదేవతావతారము చేత మృతిని పొందెదవు అని పలికి అదృశ్యమవుతాడు పరమేశ్వరుడు. అది వినిన ఆ బాలుడు ఒక స్త్రీ వలన నాకు మరణమా? అది అసంభవము అని శివుడు తెలియచేసిన విషయమును తేలికగా తీసుకున్నాడు. దీనినంతా గమనిస్తున్న బ్రహ్మ ఆ బాలుడి ముందు ప్రత్యక్షమవుతాడు. అతడిని భండ భండ అని ప్రశంసిస్తాడు. అప్పటినుండి ఆ బాలుడు భండుడు అను పేరుతో ప్రఖ్యాతి చెందాడు. 'భండ' అను శబ్దమునకు రెండు అర్థములు ఉన్నాయి. మొదటి అర్థము వ్యక్తికి శుభము కలుగుతుంది. రెండవ అర్థము లోకుల నిందలకు పాత్రుడై పరిహాసం పాలవుతాడు. భక్తి శ్రద్ధలతో శివుడిని ఆరాధించిన కాలం వరకు అతనికి శుభమే కలిగింది. పిదప మాయా మోహ జాలమునకు వశీభూతుడైనప్పటినుండి నిందలకు, పరిహాసములకు పాత్రుడైనాడు.

దానవ గురువు అయిన శుక్రాచార్యులు భండాసురుడి జననము, పరమేశ్వరుడి వలన అతడు పొందిన వరములను తెలుసుకుని భండాసురుడిని కలుసుకున్నాడు. భండాసురుడే

రాక్షస రాజ్యమునకు తగిన రాజు అని నిశ్చయించుకున్నాడు. మయుడిని రప్పించి సముద్ర మధ్యమున శోణిత పురము అను మహానగరమును నిర్మింపచేశాడు. భండాసురుడిని రాజుగా పట్టాభిషేకము గావించాడు. భండాసురుడు సమ్మోహిని, కుముదిని, చిత్రాంగి, సుందరాంగి అను నలుగురు కన్యలను వివాహము చేసుకున్నాడు. ఇంద్రశత్రుడు, నమితఘ్నుడు, విద్యున్మాలి, విభీషణుడు, సుగ్రకర్ముడు, సుగ్రధన్ముడు, విజయుడు, నృతిపారగుడు అను అష్టమంత్రులతో, అష్టసేనానాయకులతో లోకభయంకరుడిగా, నిరంకుశుడిగా రాక్షస రాజ్యమును పరిపాలించసాగాడు. గురువుగారి అనుజ్ఞతో ముల్లోకములను తన అధీనము లోనికి తెచ్చుకున్నాడు.

భండాసురుడు శివుడిని ఆరాధిస్తూ ధర్మానుసారముగా నడుచుకోసాగాడు. ప్రజలు కూడా శివుడిని ఆరాధిస్తూ ధర్మానుసారము నడుచుకొనసాగిరి. శివ పంచాక్షరీ మంత్రమును జపించుట, యజ్ఞ యాగాదులు చేయుట, వేద శాస్త్రములను పఠించుట మున్నగు వానిని ఆచరిస్తూ ప్రజల చేత కూడా చేయించసాగాడు. ప్రతి రాక్షసుడి గృహము వేదఘోషలతో ధ్వనిస్తూ ఉండేది. భండాసురుడు సుఖశాంతులతో, భోగభాగ్యములతో ఇరవై వేల సంవత్సరములు సునాయాసంగా గడిపేశాడు.

భండాసురుడి పరిపాలనలో కొంతమంది దేవతలు అమరావతిని వదిలి వెళ్ళారు. మరికొంతమంది దేవతలు భండాసురునకు సేవలు చేయసాగారు. మహర్షులు నిత్య కర్మానుష్ఠానములను వదిలివేశారు. ప్రజలు, దేవతలు భండాసురుడి వలన బాధలు పడటం చూసిన దేవేంద్రుడు త్రిమూర్తుల దగ్గరకు వెళ్ళి తమను రక్షించవలసినదని ప్రార్థించాడు. వారితో శ్రీహరి – పరమేశ్వరుడు భండాసురునకు ఇచ్చిన వరకాలము పూర్తయినది. అతడు పరా దేవత వలన గాని మరణించడు. మనమందరము కలిసి పర దేవతను ప్రార్థిద్దాము. ఆ దేవి ప్రసన్నురాలై మనలను రక్షిస్తుంది అని పలికాడు. అందరూ పర దేవతను ఆరాధించడం మొదలుపెట్టారు. వారి ప్రార్థనకు పరదేవత ప్రసన్నురాలై ప్రత్యక్షమై వారితో ఇలా అన్నది. భండాసురాది దానవులను సంహరించడానికి మీకు సహాయకారిగా మాయా మహాశక్తిని పంపించుచున్నాను. మీరందరూ పరదేవత కొరకు హోమాది తర్పణ సమారాధనలు చేయండి అని పలికి అదృశ్యమైంది. త్రిమూర్తులు దేవీ యాగమును గూర్చి ఆలోచనలు చేయుచుండగా నారద మహర్షి అక్కడికి వచ్చి – బృహస్పతిని పురస్కరించుకుని దేవీ యాగము చేయండి. ఆ హోమ గుండము నుండి పరాశక్తి లలితా పరాశక్తి రూపమున ఉద్భవించి భండాసురాది దానవులను సంహరిస్తుంది అని పలికాడు. నారదుడి వచనానుసారం బృహస్పతి అనుమతితో పుణ్య గంగానదీ తీరమున విశాలమైన సమ ప్రదేశములో హోమగుండమును నిర్మించి పరాశక్తి కొరకు హోమములు చేయుచుండగా కొంతకాలమునకు మాయా పరాశక్తి వలన జగన్మోహనాంగి అనేక వేల సహస్ర పరిచారికలతో మహాలక్ష్మి అవతరించింది. జనార్దన స్వామి అనుజ్ఞతో భండాసురుని పట్టణమునకు సమీపమునందు గల పుష్పవనము నందు విహరించసాగింది.

ఒక దివ్యాంగన పుష్పవనములో విహరిస్తున్నదని, ఆమె అత్యంత రూప లావణ్య సౌందర్యముతో ఒప్పారుతున్నదని చారుల ద్వారా భండాసురుడు తెలుసుకుని ఆమెను చూస్తాడు. మాయకు వశీభూతుడైన భండాసురుడు ఆమెను తన గృహమునకు తీసుకొని వస్తాడు. ఆమె మైకంలో పడిపోయిన భండాసురుడు నిత్య కర్మానుష్ఠానములను మరిచి విహరించసాగాడు. భండాసురుడి ప్రవర్తనను గమనించిన మంత్రులు, సేనానాయకులు, ప్రజలు అందరూ పరివార కాంతలతో కర్మానుష్ఠానములను మరచి తిరుగసాగారు. అందువలన వేదాది సదాచారములు నశించి వారి పుణ్యమంతయూ నశించిపోయింది. శివారాధనలు, వేదఘోషలు లోపించడం వలన రాజ్యములో అశాంతి మొదలైంది. శోణితపురము నందు బయలుదేరిన ఉత్పాతములు, శల్య, రక్త, ఉల్కాపాతములు మున్నగు వాటిని చూచి శుక్రాచార్యుడు భయపడిపోయాడు.

శుక్రాచార్యుడు భండాసురుడిని కలుసుకుని అతడితో ఇలా అన్నాడు. చారుల ద్వారా దేవతలు హిమాలయాలకు వెళ్ళి భక్తి శ్రద్ధలతో పరాశక్తిని ఆరాధించుకుంటున్నారని తెలిసింది. పరాశక్తి దేవతల ప్రార్థనలను మన్నిస్తే, నీకు, నీ రాజ్యమునకు గొప్ప ఆపద రాగలదు. కనుక నీవు వెంటనే బయలుదేరి వారు చేస్తున్న అభిచారికాది హోమాదులను విఘ్నము చేసిన యెడల నీ రాజ్యము, నీవు ఆపదల నుండి బయట పడగలరు. భండాసురుడు శుక్రాచార్యుల వారి సలహాతో దేవతల హోమములకు విఘ్నము కలిగించడానికి బయలుదేరాడు. రాక్షసులు దేవతల మీద అస్త్ర శస్త్ర గదాది సాధనములను పరంపరలుగా వేయసాగారు. దానిని చూచిన పరాదేవత రాక్షసుల అస్త్ర శస్త్రాదులను మధ్య భాగము నందే భస్మము చేయసాగింది. పరదేవత చేస్తున్న సహాయమును చూచిన దేవేంద్రుడు ఆనందము, ఉత్సాహము కలిగి దేవతలతో ఇలా అన్నాడు. దేవతల్లారా! పరదేవత మనలను రక్షిస్తున్నది. రాక్షసుల మాయలో పడి హోమ కార్యమును ఆలస్యము చేయకూడదు అన్నాడు. దేవతలు అత్యంత ఉత్సాహముతో

హోమ కార్యమును నిర్వహించసాగారు. తత్ఫలితముగా శ్రీలలితాదేవి హోమగుండము నుండి ప్రత్యక్షమయి దేవతలతో ఇలా అంది. దేవతల్లారా! భండాసురుడిని సంహరించాలంటే నాకు పరమేశ్వరుడి సహాయము చాలా అవసరం. మీరు పరమేశ్వరుడిని ప్రార్థించండి అన్నది. అమ్మ వచనానుసారం దేవతలు పరమేశ్వరుడిని ప్రార్థించారు. పరమేశ్వరుడు వారి ప్రార్థనలకు ప్రసన్నత చెంది కామేశ్వరుడిగా అవతరించాడు. లలితా పరమేశ్వరులు అనురాగయుతులు కావడం గమనించి త్రిమూర్తులు, దేవతలు వారిరువురకు వివాహము చేశారు.

దేవతలు, ప్రజల రక్షణార్థం లలితాదేవి భండాసురుడితో యుద్ధానికి సంసిద్ధమై శోణితపురమును ముట్టడించింది. ఇరువురి మధ్య భయంకర యుద్ధం జరిగింది. అమ్మవారి మంత్రులు,సేనానులుఅందరూభండాసురుడిరాక్షససైన్యమును అంతమొందించారు. పరమేశ్వరికి, భండాసురుడికి మధ్య ఘోరమైన పోరు మొదలైంది. భండాసురుడు రాక్షసాస్త్రాలను, దేవి దివ్యాస్త్రాలను ప్రయోగించారు. దేవి చేతిగోళ్ళ నుండి దశావతారములు ఉద్భవించి భండాసురుడు సృష్టించిన రాక్షసులను చంపివేశాయి. లలిత భండాసురుడిని తన బాహువులతో పట్టుకుని క్రింద పడవేసింది. కామేశ్వరాస్త్రముతో తలను, మొండెమును వేరు చేసింది. బ్రహ్మాది దేవతలు ఆనందముతో పరమేశ్వరిని స్తుతించారు.

**శ్లో ॥ "నమో నమస్తే జగదేకనాథే నమో నమః శ్రీ త్రిపురాభిధానే**
**నమో నమో భండాసురఘ్నే నమోఽస్తు కామేశ్వరి వామకేశి"**

జగదేకమాతా! మీకు వందనము. త్రిపురాభిధానే మీకు వందనము. భండాసుర సంహారిణీ, కామేశ్వరీ, వామకేశీ మీకు అనేక ప్రణామాలు సమర్పిస్తున్నాము. తల్లీ! లలితాంబికా! నీవు పరదేవతా స్వరూపిణివి. సృష్టి స్థితి లయములకు ఆధారమైనదానవు. ధర్మము నశించి అధర్మము వృద్ధి పొందుతున్నప్పుడు ధర్మమును స్థాపించుటకు అనేక అవతారములను దాల్చి దుష్టులను సంహరిస్తుంటావు. దుర్మార్గుడైన భండాసురుడిని సంహరించి ముల్లోకములను కాపాడావు. నిత్య కర్మానుష్ఠానములను, యజ్ఞ యాగాది కర్మలను నెరవేర్చుకొనుటకు ఋషులకు ఆధారమును కల్పించావు అన్నారు. దేవతల స్తుతికి దేవి ప్రసన్నత చెందింది. పరివార దేవతలను ఆయా తావులందు ఉండమని ఆదేశించింది. శాంతరూపమును దాల్చి రుద్రగణములు సేవించుచుండగా సమస్త లోకములను కాపాడుచున్నది. జగద్గురువులు శ్రీశంకరాచార్యులవారు లలితాంబను స్తుతిస్తూ లలితా పంచకమును రచించారు.

**లలితాంబను భక్తి శ్రద్ధలతో ఆరాధించి ఆ దేవత ఆశీస్సులను పొందుదాము.**

# దేవీ నవరాత్రులు

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**

దేవీ నవరాత్రులు చేసుకొనే సంప్రదాయం ఎందుకు వచ్చిందో మనం తెలుసుకుందాం. సంవత్సర కాలాన్ని చైత్రమాసం నుండి భాద్రపద మాసాంతం వరకు పురుషకాలంగాను, ఆశ్వయుజ శుక్ల పాడ్యమి నుండి ఫాల్గుణ మాసాంతం వరకు స్త్రీ రూపాత్మకంగానూ పెద్దలు విభజించారు.

చైత్రమాసం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది. అలాగే ఆశ్వయుజ మాసం నుంచి ఎండలు తగ్గి చలికాలం మొదలవుతుంది. ప్రకృతి లోని ఈ మార్పుల వలన రోగకారక క్రిములు విస్తరించి వ్యాధులు విజృంభిస్తాయి. అందుకే వసంత, శరత్ ఋతువులను యముని రెండు కోరలుగా వర్ణిస్తారు. వసంత ఋతువులో కలిగే ఈ దోషాలను నివారించుకోవడానికి చైత్ర పాడ్యమి నుండి మొదలయ్యే పురుష రూపాత్మక అర్ధ సంవత్సర ప్రారంభంలో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తారు. అలాగే పితృపక్షం పూర్తి అయిన తర్వాత స్త్రీ రూపాత్మక అర్ధ సంవత్సరం ప్రారంభమయ్యే ఆశ్వయుజ పాడ్యమి నుండి దేవీ నవరాత్రులు నిర్వహించి శరదృతువులో కలిగే దోషాలను నివారించుకొంటారు.

''దశహరా'' అన్న పదమే జనబాహుళ్యంలో దసరాగా మారింది. దశహరా అంటే పది రకాలైన పాపాలను నశింపచేసేది అని అర్థం. నవ అంటే నూతనము. రాత్రి అంటే జ్ఞానము. నవరాత్రి అంటే నూతన జ్ఞానము. అజ్ఞానాన్ని తొలగించి నూతన జ్ఞానాన్ని ప్రసాదించమని కోరుకోవడమే దుర్గా నవరాత్రి పూజల పరమార్థం.

**నమో దేవి మహావిద్యే**
**నమామి చరణే తవ**
**సదా జ్ఞాన ప్రకాశం మే**
**దేహి సర్వార్థ సాధికే**

* * *




**గత సంచిక తరువాయి**

# కర్దమ మహర్షి

కృతయుగం ప్రారంభంలో మరోసారి భూమి సంతాన హీనమయింది. సంతానం తక్కువై ప్రజలు లేరు. భూమి చాలా పెద్దది. అన్నీ ఉన్నాయి కానీ అనుభవించటానికి ప్రజలు లేరు. తగ్గిపోయారు. తపస్సులు చేసుకుని పూర్వం అనేకమంది పుట్టారు, పోయారు. మళ్ళీ సంతతి పెరగలేదు. కర్దముణ్ణి బ్రహ్మదేవుడు మళ్ళీ సంతానోత్పత్తి చేయమని అడిగాడు. ''ఈ భూమి యందు జన సమ్మర్దం కావాలి. జన సమృద్ధి కావాలి'' అని అడిగాడు.

అప్పుడు కర్దముడు ''నేను సంతానాన్ని కన్నాను. అన్నీ చూచాను. నేను మళ్ళీ సంసారంలో ప్రవేశించాలని బ్రహ్మదేవుడంటున్నాడు. సరే'' అనుకుని తపస్సుకు వెళ్ళిపోయాడు. చిరకాలం తపస్సు చేశాడు. తపస్సు లోంచి బయటకు వచ్చిన తరువాత హరిని స్మరించాడు. తపస్సు కేవలం భగవంతుణ్ణి గురించే చెయ్యనవసరం లేదు. నిష్కారణంగా, నిర్గుణంగా తపస్సు చేసి సమాధిలో ఉన్న తరువాత, ఏ దేవతను స్మరించినా అప్పుడే వస్తారు వాళ్ళు. భావన చేసి దేవతలను ప్రత్యక్షం చేసుకునే శక్తి తపస్సుకే ఉన్నటువంటి విశేషమైన శక్తి. అతడు హరిని గురించి అలా చిరకాలం తపస్సు చేసిన తరువాత ఆ సమాధి లోంచి బయటకు వచ్చి, హరిని ఒక్కమాటు స్మరించాడు అని అర్థం. ఇట్లాంటి విషయాలు పురాణంలో మామూలుగానే చెప్పబడతాయి కాని, అందులో ఒక విశేషం ఉంటుంది.

అంటే నిర్గుణమైనటువంటి ఒక తేజస్సుకై తపస్సు చేస్తే, ఆ తేజస్సు సర్వాంతర్యామిగా ఉండటం చేత, ఏ రూపంలో కావాలంటే ఆ రూపం పొంది కనబడుతుంది. రుద్రుడు అంటే రుద్రుడు ఆ తేజస్సు లోంచి వస్తాడు. కర్దముడు అలా హరిని స్మరించేసరికి హరి వచ్చి దర్శనమిచ్చాడు. ''కాలచక్ర గతినంతా నడిపించేవాడివి నీవు. ఈ చరాచర జగత్తంతా నీ మాయ చేత పుట్టుచున్నది, పోతున్నది'' అని స్తోత్రం చేసాడు కర్దముడు.

ఆయనను హరి, ''ఏ కోరికతో నీవు తపస్సులో నన్ను స్మరించావు? ఆ కోరిక నాకు చెప్పకుండానే సిద్ధించు గాక'' అన్నాడు. ''బ్రహ్మ నిన్ను కోరాడు. నీవా కోరిక నన్ను అడగకుండా తపస్సు చేసావు. బ్రహ్మ నిన్ను కోరిన కోరిక నీ ద్వార సిద్ధించును గాక'' అని కూడా అన్నాడు హరి. అంతేకాకుండా, ఆయనతో ''బ్రహ్మపుత్రుడు, సామ్రాట్టు అయిన స్వాయంభూ (స్వాయంభువ) మనువు బ్రహ్మావర్త దేశాన్ని పరిపాలిస్తున్నాడు. (బ్రహ్మావర్త దేశమంటే బర్మా అంటున్నారు ఇప్పుడు. బ్రహ్మ నామం చేతనే బర్మా అయింది అని vedic geography చెబుతోంది). ఆ స్వాయంభూ మనువు నీ దగ్గరకు వచ్చి అతడి కుమార్తెను నీకిస్తాడు. ఆమెను వివాహం చేసుకుని తొమ్మిదిమంది కుమార్తెలను నీవు కంటావు'' అని చెప్పాడు.

ఇప్పటి బర్మా ఆనాడు చాలా పెద్దదే కావచ్చు. ఇప్పుడు ఎంత భూభాగం ఉందో అంతమాత్రమే ఆనాడు ఉండేదని కాదు. చాలా ఎక్కువే ఉందని అనుకోవాలి. అలా ఈ బ్రహ్మదేశం చాలా పెద్దదని చెపుతారు. ఇంకా దక్షిణానికి వెళితే arch గా చిన్న చిన్న ద్వీపాలు వెలున్నాయి. లక్ష ఉన్నాయి. అదంతా ఒకప్పుడు పెద్ద land mass. సముద్రం దానిపైకి ప్రవేశించటం చేత చిన్న చిన్న ముక్కలుగా సముద్రం పైకి తేలి ఉన్నాయి కాస్త కాస్త. అదంతా కూడా భూభాగమే. కుంగిపోయింది. ఇంకాస్త దూరం వెళితే, నేటి ఆస్ట్రేలియా దాకా ఉండేది ఆ land mass. (సరస్వతి – దృషద్వతి దేవనదుల నడుమ దేశం బ్రహ్మావర్తమని మరొక పురాణోక్తి). అదేమో నాలుగు చెక్కలై ఉన్నదని అభిప్రాయం ఉంది. మొత్తం ఏడు ద్వీపాలు – 'సప్తద్వీపా వసుంధరా' అని అంటుంటాం. భరతవర్షం – అందులో భరత ఖండం. బహుశా ఆ భరతవర్షం



అదే దాంట్లోకి ఈ బ్రహ్మదేశం వస్తుందేమో.

శ్రీహరి కర్దముడితో ఇంకా ఇలా అన్నాడు. ''బ్రహ్మావర్త దేశపు రాజు నీ దగ్గరికి వస్తాడు. ఆయన కుమార్తెను నీవు వివాహం చేసుకో. మీకు తొమ్మిదిమంది కుమార్తెలు పుడతారు. ఆ కన్యల వివాహం తరువాత నీకు మునులు, యోగులు, తపస్వులు మనుమలుగా పుడతారు. నువ్వు అది బంధనం అని దుఃఖపడకు. ఈ సంసారం బ్రహ్మ ఆజ్ఞ ప్రకారం, నా అభిమతం ప్రకారం జరుగుతుంది. నీవు ఈ కర్మ చేస్తూనే ఉండు. ఈ కర్మ అంతా కూడా నా యందు జరుగుతుంది. ఈ కర్మ అంతా నా యందు సమర్పణ బుద్ధితో చెయ్యి. బంధనహేతువుగా భావించి నీవు దుఃఖపడవద్దు. కర్మ చేసేటప్పుడు నీకు బంధనం ఏర్పడుతుంది. కాని దానిని నాకర్పణ చేయటం చేత నీకు దుఃఖం కలుగదు. ఆ తరువాత నేనే స్వయంగా నీకు కుమారుడిగా పుడతాను'' అన్నాడు హరి.

హరి ఆజ్ఞ ప్రకారంగా కర్దముడు అలాగే చేసాడు. స్వాయంభూ మనువు తన భార్య శతరూప తమ కుమార్తె అయిన దేవహూతితో సహా వచ్చి కర్దముడితో, ''నా కుమార్తె అయిన దేవహూతి నీ చరిత్ర అంతా విని నిన్ను తప్ప వేరెవరినీ వరించనని ప్రతిజ్ఞ చేసింది. దీనికి ఏదో కారణము, దైవ సంకల్పము ఉంటుంది. నీవు ఈమెను వివాహమాడు'' అన్నాడు.

అయితే కర్దముడికి ఈ వివాహం బొత్తిగా ఇష్టం లేదు. రుచి లేదు. ఆజ్ఞాపాలన చేస్తున్నాడు అంతే. ఆయన స్వాయంభూ మనువుతో ''మంచిది. నీ కుమార్తెను నేను వివాహం చేసుకుంటాను. సంతానం కలగగానే వెళ్ళిపోతాను. నీ కుమార్తె నడుగు. అందుకు సమ్మతిస్తేనే నేను వివాహం చేసుకుంటాను'' అన్నాడు. అందుకు వాళ్ళు అంగీకరించారు. దేవహూతి – కర్దముల వివాహం జరిగింది. శతరూప, దేవహూతికి అనేక బోధలు చేసింది. దంపతులు వెళ్ళారు.

వైవాహిక జీవితంలో కర్దముడు దేవహూతిని పరీక్ష చేసాడు. ఆయన ఎప్పుడూ ఉదాసీన వైఖరిలో, ప్రవృత్తిలో ఉండేవాడు. ఆమెను స్వీకరించినట్లు కాదు, స్వీకరించనట్లు కాదు. ఆమె ఎప్పుడూ సేవ చేస్తూ ఉండేది. చివరకు నిరాహారిగా ఉండిపోయింది. కుంగి కృశించిపోయింది. కృశించిన శరీరంతో శక్తిలేక ఉన్నా, యావచ్ఛక్తినీ కూడా ఆయన సేవకు ధారపోసింది.

అప్పటిదాకా ఆమెను పరీక్షించి ఆమెతో, ''నాకు నీవు తపస్సు లాంటి సేవ చేసావు. దీనికి నీకు ఫలం కలుగుతుంది. ఏమైనా కోరికలు కోరుకో. నీకు సమస్త భోగాలు లభిస్తాయి. సుఖంగా ఉండు'' అని చెప్పి భార్యకు ఆశీర్వచనం ఇచ్చాడు. ఆమె చేసిన సేవాకాలంలో ఆమెకు గాని, తనకు గాని, ఆహారం గాని, నిద్ర కాని లేదు. ఇద్దరూ కూడా కృశించిపోయారు.

ఆయన వరప్రసాదం చేత తరువాత అనేక సంపదలు, ఆరోగ్యము, బలము, యౌవనము ఆమెకు లభించాయి. ఒక దివ్యవిమానం, అనేక దివ్య భవనాలను సృష్టించాడు కర్దముడు. వాటన్నింటినీ సృష్టించిన తరువాత ఇవన్నీ నీకే అన్నాడు ఆమెతో. తనకేమీ కనబడటం లేదు అన్నదావిడ. అంటే ఆమె తపస్సు చేసే కాలంలో భౌతికమైనటువంటి జడపదార్థ భావమును కోల్పోయింది అని అర్థం చేసుకోవాలి.

తన భార్య ఎంతటి తపస్సు చేసిందో ఆయన అప్పుడు గ్రహించాడు. ఆమెకు సృష్టే కనబడటం లేదు. ఆమెకు తను చేసినదంతా మాయాప్రభావం చేత చేసినవేనని అనిపించింది. అప్పుడు ఆయన సమీపంలో కనబడుతున్న బిందుసరోవరంలో ఆమెను స్నానం చేసి రమ్మన్నాడు. ఆమె అందులో స్నానం చేసి వచ్చేటప్పటికి అనేక వందలకొలదీ దాసీజనం సేవ చెయ్యటం, తనకున్న ఐశ్వర్యం అంతా ఆమెకు కనపబడింది. ఇద్దరూ కలిసి దేవ విమానం ఎక్కి సమస్త లోకాలు విహరించారు. వంద సంవత్సరాలు అలాగే సుఖంగా ఉన్నారు. ఆ తరువాత శ్రీహరి ఆజ్ఞ ప్రకారం ఆమెకు తొమ్మిదిమంది కుమార్తెలు కలిగారు. తన పూర్వపు షరతు ప్రకారం, కర్దముడు సంతానం కలగగానే తను సన్యసించి వెళ్ళిపోతానన్నాడు ఆమెతో.

''మీరు వెళ్ళిపోతే ఈ కుమార్తెలకు పెళ్ళిళ్ళు ఎవరు చేస్తారు స్వామీ?'' అన్నాదామె. దాంతో ఆయన అప్పటికి సన్యాస ప్రయత్నం మానుకున్నాడు. ఆ తరువాత కొంత కాలానికి ఆమె మళ్ళీ గర్భం ధరించింది, కొడుకును కన్నది. ఆ పుట్టినవాడే శ్రీహరి అవతారమైన కపిలుడు. హరివంశంలోనే, విష్ణువు అంశలోనే పుట్టాడు. బ్రహ్మ చెప్పిన ప్రకారమే జరిగింది.

ఆ తరువాత తన తొమ్మిదిమంది కుమార్తెలకు పెళ్ళిళ్ళు చేసాడు కర్దముడు. మరీచి మహర్షి కళను, అత్రిమహర్షికి అనసూయను, అంగీరసుడికి శ్రద్ధను, పులస్త్యుడికి హవిర్భువును, పులహుడికి గతిని, క్రతువుకు క్రియను, భృగువుకు ఖ్యాతి అను కుమార్తెను, వసిష్ఠుడికి అరుంధతిని, అధర్వుడికి శాంతిని ఇచ్చి పెళ్ళిళ్ళు చేసి భర్తలతో వాళ్ళను పంపించాడు.

కొంతకాలానికి తను ఇంకా చిరంజీవిగా ఇలాగే ఉంటే ఈ సంసారం పునః పూరణంతో బ్రహ్మ మళ్ళీ మళ్ళీ ఇలాగే చేయమని చెప్తాడేమో అని అనుమానం కలిగింది. మోక్షేచ్ఛతో, తను ఈ సృష్టిలో ఎక్కడా ఉండకూడదు అనుకున్నాడు. తను (కర్దముడు) ప్రజాపతిగా ఉన్నాడు. చాలా తపస్సు చేశాడు. అయినా ముక్తి హేతువయినటువంటి విషయం బ్రహ్మ తనకు చెప్పడు. బ్రహ్మ ప్రవృత్తి మార్గమే చెప్తాడు. ఆయనను ప్రార్థించి లాభం లేదు. విష్ణువేమో బ్రహ్మ వాక్య పరిపాలన చేయమని అడుగుతాడు తనను. అందుకని విష్ణువే తన కొడుకుగా వచ్చాడు కాబట్టి, ఆశతో ఆయనను అడిగాడు. ఒకనాడు ఏకాంతంగా కుమారుడై పుట్టిన కపిలుడి దగ్గరకు వెళ్ళి నమస్కరించి, ''నీవు విష్ణువువే కదా! నాకు మోక్షోపదేశం చెయ్యి. బోధ చెయ్యి. నీ పుట్టుకతో నేను ఋణవిముక్తుడిని అయ్యాను'' అన్నాడు. కపిలుడు ఆయనకు సకల తత్త్వములు బోధించాడు.

అంతకుముందే కర్దముడు పరమ విరాగిగా ఉండటం చేత, తపో మహిమ చాలా ఉన్నవాడు కాబట్టి, ఇంద్రియములను ఎప్పుడో నిగ్రహించినవాడు కాబట్టి, అతడికి కపిలుడు ఇలా బోధించాడు. ''సాంఖ్య, యోగ మార్గములు చెపుతున్నాను. నేను చెప్పే ఈ మార్గం మహోత్కృష్టమయినది. ఈ మార్గంలోనైతే నీకు ఎప్పుడూ విష్ణుదర్శనము, బ్రహ్మదర్శనము లాంటి బంధనహేతువులు ఏవీ రావు. పరంజ్యోతిగా నన్ను చూస్తావు'' అని చెప్పాడు.

ఎందుచేతనంటే, ఎంతకాలం సగుణమైన స్వరూపం దర్శనమిస్తుందో, మన తపస్సుకు మనలో ఉండే వృత్తే అలా దర్శనమిస్తుంది కాని మనలో లేనిది దర్శనమివ్వదు. సమస్త యోగాలలో ఒక్క రహస్యమేమిటంటే, మనం పొందేటటువంటి దర్శనానికి హేతువు, బీజం సంస్కార రూపంలో కోరిక రూపంలో మన దగ్గర మన లోపలే ఉంటుంది. అదే బయటికి వచ్చి ఒక రూప దర్శనం- ఒక రూప కల్పన చేసికొని – దర్శనమిస్తుంది. తపస్సు మనదే. ఆ కనబడేటటువంటి రూపము కూడా మనలోంచి ఉత్పన్నమైనటువంటిదే. మనం అడిగే కోరికలు మనవే. దాని ఫలం అనుభవించేది మనమే. లోపల పరతత్త్వం మాత్రం ఏమీ కాదు. అది దేనికీ హేతువు కాదు. తటస్థంగా ఉండే వస్తువది.

అలా కపిలుడినుంచి కర్దముడు బోధ పొందిన తరువాత, అతడికి ప్రదక్షిణం చేసి సాష్టాంగ ప్రణామం చేసాడు. కొడుకు రూపంలో ఉండే హరికి తను నమస్కరించాడంటే, అక్కడ హరి హరిగానే దర్శనమిచ్చాడంటే, అది ప్రవృత్తి. ఆయన బోధాంశలో వచ్చాడు కాబట్టి ఇక్కడ ముక్తిమార్గాన్ని చూపించాడు. కాబట్టి భగవంతుణ్ణి ముక్తిమార్గం కోసమే ఆశ్రయిస్తే, ఆయనే గురువుగా వస్తాడు. కోరికలు తీర్చుకోవటానికి ఆశ్రయిస్తే, పురాణంలో చెప్పిన రూపంలోనే వస్తాడు. ఆ కోరికలు తీరుస్తాడు. కానీ అదంతా బంధన హేతువు అవుతుంది కానీ ముక్తిమార్గం కానేరదు. ముక్తిని కోరితేనే భగవంతుడు గురుస్వరూపుడై వస్తాడని దాని తాత్పర్యం.

ఆ తరువాత కర్దముడు లోకం అంతా వాసుదేవమయంగా, పరంజ్యోతిమయంగా చూచాడు. చివరకు కర్దముడు మోక్షంతో లయం చెందాడని అంటారు. అంటే ఆయన ఇతర మునులవలె గాక, ఏ లోకంలోనూ ఉండకుండా వెళ్ళిపోయాడు.

# దశరూప ధారిణీ - దనుజ సంహారిణీ

: ఆచార్య పి.వి.ఉమాశశి, 9440735155



జగదేక జనయిత్రి, త్రైలోక్య సంధాత్రి, ఓంకార రూపిణి, విద్యాప్రదాయిని, సర్వార్థ దాత్రి, సౌభాగ్య ప్రదాత్రిగా కీర్తించబడి, సృష్టి స్థితి లయలకు మూల స్తంభంగా నిలిచి కొలవబడిన పరాశక్తి దుర్గాదేవి. శ్రీమాతా, శ్రీమహారాజ్ఞీ, శ్రీమత్సింహాసనేశ్వరిగా ప్రశంసలంది శ్రీచక్ర మధ్యంలో విరాజిల్లే సహస్ర నామ విరాజిత, శ్రీచక్ర రాజ నిలయ. లోక వినాశనానికి పూనుకున్న మహిషాసుర, రక్తబీజ, శుంభ నిశుంభ, చండ ముండ, ధూమ్రాక్షాది రాక్షసులను సంహరించిన శక్తి స్వరూపిణి. నవరాత్రులలో తొమ్మిది విశిష్ట దేవతా రూపాలలో దర్శనమిచ్చి దానవ సంహారంతో విశ్వశాంతిని అందించిన అమ్మలగన్న అమ్మ. ఆ ఆదిపరాశక్తి అనంత ప్రపంచానికి ఆనందాన్ని అందజేసిన పర్వదినమే విజయదశమి. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి అన్న తొమ్మిది రూపాలలో కొలువై భక్తుల కొంగుబంగారమైంది. తొమ్మిది రోజులు నవదుర్గలుగా ప్రసిద్ధి పొందిన ఆ తల్లి దశమి రోజున అపరాజితగా నిలిచి, లోక భయ సంహారిణిగా, విశ్వవిజేతగా పూజలందుకుంది.

ఆదిపరాశక్తి రూపం అమేయం, అపూర్వం, అనన్య సామాన్యం. ఒక్కొక్క చేతిలో ధరించిన పాశ, అంకుశ, ఇక్షు, పుష్పబాణాలు ప్రతి ఒక్కటీ ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకున్నదే.

**పాశం** – భక్తులను తనవైపు వాత్సల్యంతో ఆకర్షించే శక్తికి ప్రతీక.

**అంకుశం** – మనస్సును సన్మార్గంలో నడిపించడానికి ప్రతీక.

**చెరుకు విల్లు** – మధురమైన భావాలకు నిలయమైన మనస్సుకు ప్రతీక.

**పుష్పబాణాలు** – ఇంద్రియ అనుభూతులకు ప్రతీక.

భక్తుల ఇంద్రియాలను అదుపులోకి తెచ్చి, మనస్సును నిగ్రహించుకునే శక్తినిచ్చి, వారిని సన్మార్గంలో నడిపిస్తూ, తనను పరిపూర్ణంగా నమ్మి పూజించే భక్తులను అపారమైన అనుగ్రహంతో అక్కున చేర్చుకుంటుంది ఆ కరుణాంతరంగ.

ఆ ఆదిదేవి అనంతశక్తిని విశేషంగా స్మరించుకునే పర్వదినం విజయదశమి. స్త్రీల శక్తి సామర్థ్యాలను సకల లోకాలకు చాటిచెప్పే పండుగరోజు. అనుకోని విపత్తులు ఎదురైనప్పుడు అతివ ఆదిశక్తిగా మారి అసుర గణాలను అంతం చేసి, అపరాజితగా ప్రశంసలందుకోగలదు అన్న సత్యాన్ని జగద్విదితం చేసిన శుభ సమయం.

రక్తబీజ, మహిషాసురుల సంహారంలో పరమేశ్వరి ప్రదర్శించిన ధైర్య సాహసాలు అబలలనుకునే ఆడపిల్లలకు కొండంత మనోబలాన్నిస్తాయి. రక్తబీజుని సంహారంలో ఒక మెలిక ఉంది. ఆ రాక్షసుడి శరీరం నుండి నేల రాలిన ప్రతి రక్తపు బొట్టూ ఒక్కొక్క రక్తబీజుణ్ణి పుట్టిస్తుంది. అలా ఆ అసురుణ్ణి చంపితే, ఆ దేహం నుండి రాలే రక్తంతో వేలాది రక్తబీజులు పుట్టుకొస్తారు. అది అతనికి శివుడిచ్చిన వరం. వరమిచ్చిన శివుడు, రాక్షస సంహారి విష్ణువు ఇద్దరూ ఆ రక్తబీజ సంహారానికి ఆ జగన్మాతను శరణు వేడారు. కన్నబిడ్డలు ఆపదలో ఉంటే కన్నతల్లే ఊరుకోదు. అలాంటిది జగాలనేలే తల్లి తన చేత పుట్టించబడిన లోకానికి లోక కంటకులైన రాక్షసుల వలన కష్టం కలిగితే ఊరుకుంటుందా. అందుకే స్వయంగా తనే అసుర సంహారానికి బయలుదేరింది. ఖడ్గంతో ఒక్క వేటుకు రక్తబీజుడి తల నరికిపారేసింది. కాళికగా మారి తన నాలుకను రణభూమి అంతటా పరిచి నేలమీద చిందబోతున్న రక్తాన్ని ఒక్క చుక్క కూడా భూమి మీద పడకుండా పీల్చేసింది. లోకానికి ఆ రక్కసుని పీడ వదిలించింది. తల్లి అనుకుంటే, అండగా ఉంటే ఆ బిడ్డలకు ఆటంకాలనేవే దరి చేరవు. మరి లోకమాత అయితే తన భక్తులకు రక్షణ కవచమే.

మహిషాసుర వధ లోక వాంఛితం. ఏ పురుషుడి చేతిలోనూ తనకు చావు ఉండకూడదన్న వరాన్ని బ్రహ్మదేవుడి నుండి పొందినవాడు మహిషాసురుడు. ఆడవాళ్ళు అబలలు, తనను ఏమీ చెయ్యలేరన్న అహంకారం. స్త్రీ శక్తి తెలియక అడిగిన వరం అది. మహిషం అంటే దున్నపోతు. అహంకారానికి, మదానికి ప్రతీక. ఆ లక్షణాలు పుష్కలంగా ఉన్నవాడే మహిషుడు. దేవలోకంపై దండెత్తి ఇంద్రుడి అమరావతిని చేజిక్కించుకున్నాడు. పురుషుడి చేతిలో చావు లేదన్న వరం ఉండటం వల్ల త్రిమూర్తులు కూడా ఏమీ చెయ్యలేకపోయారు. నిస్సహాయులు అయిన స్త్రీల వలన ఎలాంటి అపాయం లేదని విర్రవీగుతున్న మహిషుడికి బుద్ధి చెప్పాల్సిన సమయం సమీపించింది. సకల దేవతాగణం, సర్వలోకాలు, త్రిమూర్తుల అభ్యర్థనతో అసుర సంహారానికి పూనుకుంది ఆదిశక్తి. సకల దేవతల శక్తులను తనలో ఇముడ్చుకుంది. అలాంటి ఆ శక్తిస్వరూపిణి మహిషాసురుడి కళ్ళకు ఒక అందమైన ఆడదిలా మాత్రమే కనబడింది. స్త్రీని వక్ర దృష్టితో చూసేవారికి అది సాధారణ విషయమే. ఆ తల్లి అనంత నామాలలో త్రిపురసుందరి ఒకటి. ఆ అందాన్ని ఏమని వర్ణించగలం. ఎంతని వర్ణించగలం. ఆ అందంలో వాత్సల్యం తొణికిసలాడుతుంది. కానీ రాక్షసుడు ఆ దృష్టితో చూడలేదు. కామదృష్టితో చూసిన మహిషుడి తల ఆ తల్లి కత్తివేటుతో నేల రాలింది. స్త్రీల పట్ల చులకనభావం కలిగిన వారందరికీ ఇదొక గుణపాఠం. స్త్రీ గర్భాన జన్మించి, ఆ స్త్రీనే కించపరచడం, అకృత్యాలకు పాల్పడడం వంటి ఆలోచనలున్న పురుషులకి బుద్ధి చెప్పే మహత్తర గాథ మహిషాసుర వధ.

దుర్గమాసురుడు దేవతలను, మహర్షులను బంధించాడు. హింసించాడు. దాంతో లోకమంతా కరువు కాటకాలతో అల్లాడింది. లోకం దుస్థితి చూసి చలించిపోయింది ఆ జగజ్జనని. ఆ తల్లి కళ్ళు వర్షించాయి. మనస్సు ద్రవించింది. ఆ నీటి ప్రవాహంతో చెరువులు, తటాకాలు నిండిపోయాయి. పంటలతో, ఫల శాకాలతో ప్రజల ఆకలి తీరింది. ఈ కష్టానికి కారకుడైన దుర్గముణ్ణి సంహరించింది. దుర్గగా ప్రసిద్ధి పొందింది. లోకం ఆకలి తీర్చి శాకంబరీదేవిగా పూజలందుకుంది.

''మాతృవత్ పరదారేషు'' అంటే పర స్త్రీని తల్లితో సమానంగా చూడాలని అర్థం. నవరాత్రుల పూజా విధానంలోను, రాక్షస సంహార పరంపరలోను, విజయదశమి పండుగ నేపథ్యంలోను ఇమిడి ఉన్నది స్త్రీ శక్తి నిరూపణమే. అంతేకాక చెడుమీద మంచి, అధర్మం మీద ధర్మం, అజ్ఞానం మీద జ్ఞానం, సాధించిన విజయం. బాహ్య శత్రువులతో పాటు అరిషడ్వర్గాలనే అంతశ్శత్రువులపై కూడా విజయం సాధించాలన్నదే విజయదశమి పండుగ బోధించే అంతరార్థం.

ఆ లలితా త్రిపురసుందరి పూజ మూడు రకాలుగా చెప్పబడింది. సాత్విక, రాజస, తామస పూజలు అవి.

సాత్విక పూజ – వేద మంత్రాలతో, జప హోమాలతో, యజ్ఞ యాగాదులతో నిర్వహించబడేది.

రాజస పూజ – అలంకారాలతో, ఆడంబరాలతో

ఆచరించేది.

తామస పూజ – తాంత్రిక విద్యలతో చెయ్యబడేది.

మానవుడు తామస పూజను, రాజస పూజను వదిలి సాత్విక పూజ వైపుకి మళ్ళినప్పుడే జీవితం సార్థకమవుతుంది. మనిషిని మహర్షిగా మారుస్తుంది. మహేశ్వరికి దగ్గర చేస్తుంది. ముముక్షువుగా మార్చి, మోక్ష మార్గానికి దారి చూపిస్తుంది. దసరా పర్వదినాల్లో జరిగే పూజలన్నీ సాత్విక పూజలుగా నిర్వహిస్తే ఆ తల్లి అనుగ్రహానికి పాత్రులు కావడం అసాధ్యమేమీ కాదు.

భారతదేశంలో నవరాత్రులను విభిన్న ప్రాంతాలలో విభిన్నంగా జరుపుకుంటారు.

ఉత్తర భారతదేశం – తొమ్మిది రోజులూ ఉపవాసం ఉంటూ చివరి మూడు రాత్రులను అంటే సప్తమి, అష్టమి, నవమిలను ప్రత్యేక పూజలతో ఉత్సాహంతో, ఉత్సవంలా జరుపుకుంటారు.

తూర్పు భారతదేశం – ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ లో దుర్గాపూజగా జరిగే ఈ ఉత్సవం ఎంతో ప్రసిద్ధి పొందింది. దుర్గాదేవి విగ్రహాలను వీధి వీధిలో ఏర్పాటు చేసి, పూజలు నిర్వహించి, ఆఖరి రోజున నదిలో నిమజ్జనం చేస్తారు.

పశ్చిమ భారతదేశం – ప్రత్యేకించి గుజరాత్ లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. గర్బా, దాండియా నృత్యాలతో ఎంతో వేడుకగా జరుపుకుంటారు.

గోవాలో దేవతా మూర్తులను పసుపు, కుంకుమ, పువ్వులు, గంధం మొదలైన వాటితో అలంకరించి పూజిస్తారు. నవరాత్రులలో ఆ పూలను మార్చరు. ఉత్సవం ఆఖరి రోజు రాత్రి ఆ నిర్మాల్యపు పువ్వులను భక్తులకు ప్రసాదంగా పంచిపెడతారు. ఆ ప్రసాదాన్ని 'కౌల్' ప్రసాదంగా భక్తులు స్వీకరిస్తారు.

దక్షిణ భారతదేశం – విగ్రహాలను వేదికలపై నిలిపి పూజలు చేస్తారు. సప్తమి రోజు మూలనక్షత్ర సుముహూర్తంలో సరస్వతి రూపంలో జగజ్జననిని అర్చిస్తారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తారు. ఆ రోజున చదువుకు శ్రీకారం చుడితే పిల్లలు మంచి విద్యావంతులవుతారని నమ్మకం. ప్రత్యేకించి తెలంగాణలో బతుకమ్మ పండుగ వేడుకలు, దేవీ నవరాత్రులతో కలిపి జరుపుకుంటారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై సద్దుల బతకమ్మతో పూర్తవుతుంది. నాగరిక, జానపద సంప్రదాయాల అపురూప కలయిక ఇక్కడే కనబడడం విశేషం.

మరికొన్ని ప్రాంతాలలో ఒక కుండను తీసుకుని ఆ కుండలో తొమ్మిది రోజులూ ఒక దీపం వెలిగించి ఉంచుతారు. కుండ ఈ అఖిల ప్రపంచానికీ ప్రతీక అయితే, అందులో నిరంతరాయంగా వెలుగొందే ఆ దీపమే ఆ ఆదిపరాశక్తి అని భావించి పూజలు చెయ్యడం ప్రత్యేకంగా కనబడుతుంది.

నవరాత్రులలో ఆడపిల్లలను బాలాత్రిపురసుందరిగా భావించి పూజించడమూ కనబడుతుంది. ఒక సంవత్సరం వయసున్న పాపను కుమారిగా, మూడేళ్ళ పాపను త్రిమూర్తిగా, నాలుగేళ్ళ పాపను కళ్యాణిగా, అయిదేళ్ళ పాపను కాళికగా, ఏడేళ్ళ పాపను చండికగా, ఎనిమిదేళ్ళ పాపను శాంభవిగా, తొమ్మిదేళ్ళ బాలను దుర్గాదేవిగా, పదేళ్ళ బాలను సుభద్రగా అలంకరించి, పూజించడం విశేషం. రకరకాల పిండివంటలతో భోజనం పెట్టి, తాంబూలం సమర్పించి, వయసులో చిన్నవాళ్ళైనా వాళ్ళని బాలాత్రిపురసుందరి అవతారంగా భావించి, వారి పాదాలకు నమస్కరించి దీవెనలందుకుంటారు. ఆ బాలను పూజించడం వల్ల సాక్షాత్తూ ఆ బాలాత్రిపురసుందరిని పూజించినంత ఫలితం దక్కుతుందని వారి నమ్మకం.

శ్రీరామచంద్రుడు రావణుడిపై విజయం సాధించిన రోజు, పాండవుల అరణ్య, అజ్ఞాత వాసాలు ముగిసి, ఉత్తర గోగ్రహణంలో అర్జునుడు విజృంభించి కౌరవ వీరులను జయించిన రోజు ఈ విజయదశమే. అంటే ధర్మ విజయ సాధనకి శ్రీకారం చుట్టే రోజుగా ప్రసిద్ధి పొందిందని స్పష్టమవుతుంది. శ్రీరాముని విజయానికి ప్రతీకగా రావణ దహనం, అజ్ఞాతవాస సమయంలో అర్జునాదులు తమ ఆయుధాలను జమ్మిచెట్టుపై దాచిన దానికి గుర్తుగా ఆయుధపూజ, శమీ పూజ చెయ్యడం ఆనవాయితీగా హిందూ సంప్రదాయంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయి.

ఆదిపరాశక్తి అష్టాదశ శక్తులుగా, యాభై ఒక్క ఉపశక్తులుగా, గ్రామ గ్రామానా గ్రామ దేవతా శక్తిగా అనేక రూపాలలో దర్శనమిచ్చి భక్తలను సంరక్షిస్తోంది. బ్రహ్మదేవుని శక్తి బ్రాహ్మిగా, మహేశ్వరుని శక్తి మాహేశ్వరిగా, కుమారస్వామి శక్తి కౌమారిగా, విష్ణుశక్తి వైష్ణవిగా, వరాహమూర్తి శక్తి వారాహిగా, మహేంద్రుని శక్తి మాహేంద్రిగా సకల దేవతా శక్తులను తనలో ఇముడ్చుకుని లోకుల సకల బాధలు పోగొట్టి, ఆటంకాలు తొలగించి, ఆపదలు నివారించి, సర్వసంపదలను అనుగ్రహించే అపరాజితాదేవి త్రిమూర్తులూ, త్రిమాతలూ ఏకమైన త్రిగుణాత్మిక, త్రిపురసుందరి, వరప్రదాత్రి, జగజ్జనయిత్రి, సౌభాగ్యకారిణి, శక్తిస్వరూపిణి, విశ్వకారిణి, విజయరూపిణి, ఆ అఖండమూర్తి ఆదిపరాశక్తి.

**యాదేవీ సర్వభూతేషు**
**శక్తిరూపేణ సంస్థితా**
**నమస్తస్యై నమస్తస్యై**
**నమస్తస్యై నమో నమః**

***

# వీణాపుస్తక ధారిణి–విశుద్ధ తత్త్వ ప్రకాశిని

: చింతలపాటి శివశంకర శాస్త్రి

అశ్విని నక్షత్రంతో కూడిన పున్నమి గల మాసమును ఆశ్వయుజ మాసం అని అంటారు. ఈ మాసానికే ''ఇష'' అనే పేరు కలదు. ఆహ్లాదకరమైన శరదృతువులో వచ్చే ఈ మాసము నందు అఖిల జగత్తుకు మూలదేవతగా జగన్మాతను ఆరాధించడం మన సంప్రదాయం. జగన్మాత పరిపూర్ణమైన చైతన్య స్వరూపిణి. శక్తి స్వరూపిణి. హస్తా నక్షత్రంతో కూడిన పాడ్యమికి ''నందా తిథి'' అని పేరు. ఈ నందాతిథి నాడు అమ్మవారిని పూజిస్తే సకల కోరికలు నెరవేరుతాయంటారు. పరమేశ్వరి పార్వతి, గాయత్రి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, కనకదుర్గ, లలిత, రాజరాజేశ్వరి – ఇలా ఏ పేరుతో పిలిచినా ఆయా రూపాల్లో ఉండే పరాశక్తి ఒకటే. ఈ పరాశక్తిని ఆరాధించేందుకు అత్యుత్తమ కాలం ఆశ్వయుజమాసం.



"శరదిందు వికాస మందహాసం
స్ఫుర దిందీవర లోచనాభిరామం
అరవింద సమాన సుందరాస్యాం
అరవిందాసన సుందరీ ముపాసే"

శరదృతువులో కాచే పండువెన్నెల వంటి కాంతి, చల్లని చూపుల మందహాసం, ముఖపద్మం కలిగినదిగా పరాశక్తిని ఋషులు భావన చేశారు. ''శరదిది భవా శారదా''. శరత్కాలంలో ఆవిర్భవించడం వల్ల ఆ దేవికి ''శారద'' అనే పేరు వచ్చింది. ఈ దేవిని ఉపాసన చేసే కాలం శరన్నవరాత్రి ఉత్సవాలుగా లోకంలో బహుళ ప్రచారం పొందాయి. దేవీ నవరాత్రులలో సప్తమీ తిథి రోజున మూలా నక్షత్రం ఉన్న రోజున సరస్వతీ మాతను ఆరాధిస్తారు. ఆ దేవిని హిందూ సమాజంలో సంగీత, సాహిత్యాలకు అధిష్ఠాన దేవతగా పరిగణిస్తారు. వాగ్దేవి, వాగీశ్వరి, భారతి, వాణి, శారద మొదలైనవి సరస్వతీదేవికి పేర్లు.

విద్యాబుద్ధి, వాక్ ప్రతిభకు ప్రతీకయైన ఆమె అనుగ్రహం ఉంటేనే విద్యా బుద్ధులు, సంస్కారం అలవడతాయి. జ్ఞాన స్వరూపం వాగ్దేవి.

వాగ్దేవి – వాక్ + దేవి. వాక్ జ్ఞాన స్వరూపం. వాక్కు లేకపోతే సృష్టి లేదు. మాట్లాడే శక్తి లేకపోతే మన మనసులోని భావాలను ఎదుటి వారికి చెప్పలేము. వాగ్దేవి సర్వ సృష్టిని నడిపించే అద్భుత దివ్యశక్తి.

మూల ప్రకృతి మూడు గుణాలతో, మూడు మూర్తులుగా అవతరిస్తుంది.

అందులో సత్వగుణ స్వరూపమే సరస్వతీదేవి. ఆ తల్లి జన్మ నక్షత్రం మూల. మూలా నక్షత్ర సంయుక్తమైన పండుగ రోజున సరస్వతీ మాతను ఆరాధిస్తారు. అర్చిస్తారు. జ్ఞానాన్ని కోరేవాడు, కోరినవాడు మూలా నక్షత్రపు రోజున సరస్వతీ దేవిని పూజించవలెనని దేవీ భాగవత గ్రంథము ద్వారా అవగతమవుతోంది. ఆ రోజు అమ్మవారిని దర్శించుకుంటే మంచి జ్ఞానము లభిస్తుందన్న నమ్మకంతో అందరూ దేవాలయాలకు వెళతారు. అమ్మవారిని అర్చిస్తారు.



దేవీభాగవతంలో నారాయణుడు నారదుడికి అమ్మవారి రూపాన్ని వర్ణిస్తూ ''కోటి చంద్రులు ఒకేచోట చేరితే ఎలా ఉంటుందో, అలాంటి తెల్లని కాంతితో ప్రకాశిస్తూ, తెల్లని వస్త్రాన్ని ధరించి, చల్లని చిరునవ్వును చిందిస్తూ దర్శనమిస్తుంద''ని వివరించాడు. ''రజోగుణం, తమోగుణం లేకుండా, సత్వగుణమే ప్రధానంగా ఆ దేవి విరాజిల్లుతోంది. అటువంటి దేవిని బ్రహ్మాది దేవతలందరూ కీర్తిస్తున్నారు'' అంటూ దేవిని వర్ణిస్తాడు. సాక్షాత్తు నారాయణుడే ఆ దేవిని, ఆమె మహిమను వర్ణించాడంటే ఆమె శక్తి ఎంతటిదో తేటతెల్లమవుతోంది.

సరస్వతి అంటే ప్రవాహమని అర్థం. దీపం నుండి కాంతి ఎలా ప్రసరిస్తుందో, అలాగే అమ్మ చైతన్యమంతా జగమంతా ప్రభవిస్తుంది. అలాంటి అమ్మవారి నామాన్ని తలిస్తే చాలు బుద్ధిశక్తి, జ్ఞానశక్తి మనలో ప్రవేశిస్తాయి.

''వాగ్బుద్ధీ, జ్ఞానాధిష్ఠాత్రీ సరస్వతీ'' అంటూ సరస్వతీదేవిని కీర్తిస్తున్నాయి శాస్త్రాలు. ఆదికాలంలో విరాట్పురుషుడైన శ్రీమన్నారాయణుని నాలుక నుండి సరస్వతీదేవి ఉద్భవించిందని పురాణ గాథ. నాలుక వాక్కుకు మూలం. సృష్టికి మూలమైన పరమేశ్వరుని వాక్ శక్తి, బుద్ధి శక్తి, జ్ఞాన శక్తి సమూహ స్వరూపమే సరస్వతి అని శాస్త్రాలు వర్ణించాయి.

సరస్వతీదేవి ప్రస్తావన ఋగ్వేదంలో చాలాచోట్ల కనిపిస్తుంది. తైత్తిరీయ పురాణంలో గల సరస్వతీ ప్రార్థన చాలా ప్రసిద్ధమైంది. దేవతలందరి సంకల్పం చేత, సర్వలోక సంక్షేమం కోసం వాగ్దేవి అవతరించింది. ఈమె శ్వేతవర్ణంలో ఒక చేతిలో వీణ, మరో చేతిలో పుస్తకం ధరించి ఉంటుంది. తెల్లతామర పుష్పంపై ఆసీనురాలై ఉంటుంది. ఈమె మిగిలిన చేతులలో అక్షమాల, అంకుశం, వీణ, పుస్తకంతో విరాజిల్లుతూ విశుద్ధ తత్వ గుణాంశతో మహా సరస్వతీ రూపంలో గోచరిస్తుంది. మహావిద్య, మహావాణి, భారతి, వాక్కు, ఆద్యా, బ్రాహ్మీ, కామధేను, వేదగర్భ, ధీశ్వరిగా (బుద్ధికి స్వామినిగా) శోభాయమానంగా వెలుగుతూ (శోభిల్లుతూ) అలరారుతున్నది. ఈమె అక్షరాలకు అధిదేవత. సత్పురుషులంతా ఆమెను విసర్గ, బిందు మాత్రలకు మూలాధారంగా వర్ణిస్తారు. కాలస్వరూపిణి, వ్యాక్యాధిష్ఠాన దేవత, కల్పనాశక్తి ఆ దేవతే.

సరస్వతీదేవిని ఎన్నో పేర్లతో పిలుస్తారు. వాటిలో 'భారతి' అంటే ప్రకాశ స్వరూపిణి అని, యజ్ఞమయి అంటే యజ్ఞ స్వరూపమని అంటారు. అందుకే భారతంలో అగ్నిహోత్ర ఫలం – నా యొక్క పదం అని చెబుతుంది అమ్మ.

ప్రాణశక్తి స్వరూపిణి సరస్వతీ అంటూ వేదాలు సరస్వతిని కీర్తించాయి. విశ్వమంతా ఏ ప్రాణశక్తి ఆవహించి ఉన్నదో, అదంతా సరస్వతీదేవి విభూతి. ప్రాణశక్తిగా జీవుల శరీరాలలో ఉచ్ఛ్వాస, నిశ్వాసల రూపంలో నిరంతరం ప్రసరించేది సరస్వతీ తత్వమే. శ్వాసక్రియ జరిగేటప్పుడు వచ్చే ధ్వనులైన 'సోహం' లోని రెండక్షరాలు సరస్వతి అధిరోహించే హంసకి ఉన్న రెండు రెక్కలు. ఈ సరస్వతి ప్రసరిస్తూ సోహం గీతాన్ని పాడుతున్నంత కాలం జీవుడు శరీరధారియై ఉంటాడు. గాలి వదులుతున్నప్పుడే శబ్దాలని ఉచ్చరించడం జరుగుతుంది.

ఋగ్వేద, యజుర్వేదాలలో సరస్వతీదేవిని గూర్చి అనేక సూక్తులున్నాయి. సర్వజీవులలో చైతన్య స్వరూపిణిగా ఉన్న శక్తి సరస్వతీదేవియే. అందుకే వేదాలు ఆమెను వేనోళ్ళ కీర్తించాయి. శరన్నవరాత్రులలో మూలా నక్షత్రం సరస్వతి జన్మ నక్షత్రం కాదు. ఆనాడు శుంభ నిశుంభులను సంహరించడానికి పునరావిర్భవించింది. అందుకే జన్మతిథిగా మాఘ శుక్ల పంచమిని, అవతారమెత్తిన నక్షత్రంగా

మూలను పండితులు వివరిస్తారు. తెలిసికానీ, తెలియక కానీ వేదశాస్త్రాలను, మహాత్ములను నిందించేవారు ఈ జన్మలో మూగవారుగా గానీ, విద్యావిహీనులుగా గానీ జన్మిస్తారు.

ఋగ్వేదంలో వాగ్దేవి పేరు సరస్వతి అని చెప్పబడింది. దీనికి మూడు స్థానాలున్నాయి. స్వర్గం, పృథ్వి, అంతరిక్షం. స్వర్గలోకంలో ఉన్న వాగ్దేవికి భారతి అని, పృథ్విలోని వాగ్దేవికి 'ఇల' యని, అంతరిక్షవాసినియైన వాగ్దేవికి సరస్వతి అని పేర్లు. ఈమెను ఉపాసించిన వారికి అన్ని సిద్ధులూ లభిస్తాయి. తాళము, స్వరము, లయ, రాగరాగిణి మున్నగునవి సరస్వతీదేవి దయ వలన ఆవిర్భవించాయి. సప్తస్వరాల ద్వారా సరస్వతిని స్మరిస్తూ ఉంటారు కావున ఈమెను 'స్వరాత్మిక' అని కూడా అంటారు. సప్త విధ స్వరాల జ్ఞానమును ప్రసాదిస్తుంది గావున ఈమెను ''జ్ఞానధాత్రి'' అని కూడా అంటారు.

శరత్కాలంలో మూల ప్రకృతినాడు అనగా మూలా నక్షత్రం నాడు బ్రాహ్మీ ముహూర్తంలో నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, తలంటుకుని, గడపలకు పసుపు రాసి, కుంకుమ పెట్టి, గుమ్మములకు మామిడాకులను తోరణములుగా కట్టి, పూలదండలతో అలంకరించి, గోమయంతో పూజాగృహాన్ని శుభ్రం చేసి, మంటపాన్ని ఏర్పాటు చేసుకుని, ఆ మంటపములో కొత్త వస్త్రమును పరచి, దానిపై బియ్యాన్ని పోసి నలుచదరంగా చేసి, వాటిపైన తమలపాకులు వేసి కలశాన్ని ఏర్పాటు చేసుకుని, ఆ కలశంపై కుడిచేతిని ఉంచి 'కలశస్య ముఖేవిష్ణు కంఠేరుద్ర సమాశ్రితాః'' అనే శ్లోకాన్ని చదువుతూ కలశంలోని నీటిని తమలపాకులతో తిప్పుతూ ''గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి... సన్నిధిం కురు'' అంటూ నీటిని పసుపు వినాయకునిపై చల్లాలి. కలశానికి వెనుకవైపున సరస్వతి పటాన్ని ఏర్పాటు చేసుకుని ఆవునేతితో జ్యోతిని వెలిగించాలి. అష్టోత్తర శతనామాలతో దేవీపూజ చేసి, హారతినివ్వాలి. అమ్మవారి ప్రతిమను బంగారం, వెండి, రాగి, ఇత్తడి లోహాలలో ఏదేని లోహంతో తయారు చేసుకుని కలశానికి ముందుభాగంలో ఉంచి, పంచామృతాలతో, ఆపై శుద్ధజలంతో అభిషేకించాలి. వెన్న, పెరుగు, పాలు, పేలాలు, నువ్వుల ఉండలు, చెరుకురసం, బెల్లం, లడ్డూలు, అటుకులు మొదలైన వాటిలో శక్తి ననుసరించి ఏదేని నైవేద్యంగా పెట్టి, నమస్కరించాలి. ఆపై ''శ్రీం హ్రీం సరస్వత్యై నమః'' అంటూ జపించి, సరస్వతీ కవచాన్ని పఠించాలి.

మానవజాతి మనుగడకు, అక్షయ సంపదకు మూలమైన సరస్వతీదేవి జ్ఞానానంద శక్తిగా, వేదజ్ఞాన మాతృకగా, అలౌకిక విద్యాప్రదాతగా దర్శనమిచ్చి, కటాక్షించే భగవతి. కృపాకటాక్ష ప్రసాదానికి వాక్శుద్ధితో స్వరార్చన చేసి ధన్యులమవుదాం. అక్షర సంపదను లోక కళ్యాణానికి వినిమయం చేద్దాం.

# దుర్గాపూజ

– శ్రీమతి వెలమకన్ని పద్మావతి



దుర్గా పూజ వలన దుఃఖ దారిద్ర్యాలు తొలగుతాయి. దుర్లభ కార్యాలు సులభమవుతాయి. విజయాలు, పరలోక సుఖాలు ప్రాప్తిస్తాయి. క్రూర శత్రువుల వినాశనం సంభవిస్తుంది. అమ్మ దయ వలన ధనం, ధాన్యం, విజయం, కీర్తి, సుఖం, సమృద్ధి, ఆరోగ్యం, ఆయుర్భాగ్యం అన్నీ ప్రాప్తిస్తాయి.

**దుఃఖ దారిద్ర్య నాశాయ**
**సంగ్రామే విజయాయ చ**
**క్రూర శత్రు వినాశార్థం తదోగ్ర కర్మసాధనే**
**దుర్గాంచ పూజయేత్ భక్త్యా**
**పరలోక సుఖాయ**

దుర్గాపూజ వలన అసంభవం సంభవమౌతుంది. భోగం – మోక్షం కలవని సమాంతర రేఖలు. అవి ఉత్తర దక్షిణ ధ్రువాలు. కానీ దుర్గాపూజ వలన భోగ మోక్షాలు – భుక్తి ముక్తులు – లౌకిక పారలౌకిక సుఖశాంతులు లభిస్తాయి.

**యత్రాస్తి భోగో సహితత్ర మోక్షః**
**యత్రాస్తి మోక్షో నహి తత్ర భోగః**
**శ్రీ సుందరీ సేవన తత్పరాణాం**
**భోగశ్చ మోక్షశ్చ కర్థ ఏవ**

దేవీ నవరాత్రులలో చేసే దుర్గాపూజ వలన ఈ ఫలితాలు సత్వరంగా సిద్ధిస్తాయి.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

### 438. మ్లేచ్ఛ ప్రహర్త్రే నమః

పాషండాదులను, ధర్మదూరులను, దురాచారులను కలియుగమందలి నాల్గవ భాగమున శిక్షించువాడు కల్కి అవతారము దాల్చిన విష్ణువు. దశావతారములలో చివరిది, పదవ అవతారము.

మ్లేచ్ఛ ప్రహర్త అయిన కల్కిగా అవతరించనున్న విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 439. దుష్ట నిగ్రహ కారకాయ నమః

అవతార ప్రయోజనమైన దుర్మార్గులను నాశనము చేయువాడు కల్కిగా అవతరించు విష్ణుదేవుడు.

దుష్ట నిగ్రహ కారకుడైన కల్కిగా అవతరించనున్న విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 440. ధర్మ ప్రతిష్ఠా కారిణే నమః

లోకమున సద్ధర్మములను సంస్థాపన చేయువాడు విష్ణువు యొక్క దశావతారమైన కల్కి.

ధర్మప్రతిష్ఠాకారి యగు విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

చాతుర్వర్ణం మయా సృష్టం గుణ కర్మ విభాగశః – భగవద్గీత, 4-13 అని వెల్లడించినాడు.

### 441. చాతుర్వర్ణ విభాగ కృతే నమః

మానవులను బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అను నాలుగు వర్ణములుగా విభాగము చేయువాడు.

మన దేశమున చాతుర్వర్ణ విభాగకర్త అయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 442. యుగాంతకాయ నమః

ఈ కలియుగమును అంతమొందించువాడు కల్కిగా అవతరించనున్న విష్ణుదేవుడు. ఈ కలియుగము అంతము కాగానే కృత యుగము వస్తుంది.

ఈ కలియుగాంతము తరువాత ఈ శ్వేత వరాహ కల్పములో (7) వైవస్వత మన్వంతరములో (29) మహాయుగములోని కృతయుగము ప్రారంభమవుతుంది.

యుగాంతకుడైన కల్కిగా అవతరించనున్న విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 443. యుగాక్రాంతాయ నమః

యుగములను ఆక్రమించినవాడు కాలపురుషుడైన విష్ణుదేవుడు. భగవద్గీతలో –

**శ్లో ॥ కాలోఽస్మి లోకక్షయ కృత్ప్రవృద్ధో**
**లోకాన్ సమాహర్తు మిహ ప్రవృత్తః – గీత, 11-32**

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

నేను లోక సంహారకుడనై విజృంభించిన కాలము (కాలుడు) అయి ఉన్నాను. ప్రాణులను సంహరించు నిమిత్తమే ఈ ప్రపంచమున ప్రవర్తించుచున్నాను అని కృష్ణుడు అర్జునునకు తెలిపినాడు.

యుగాక్రాంతుడయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 444. యుగకృతే నమః

కృతాది నాలుగు యుగములను కల్పించినవాడు భగవంతుడగు విష్ణువు.

1.కృతయుగము – 17,28,000 మానవ సంవత్సరాలు.

2.త్రేతాయుగము – 12,96,000 సంవత్సరాలు.

3.ద్వాపరయుగము – 8,64,000 సంవత్సరాలు.

4.కలియుగము – 4,32,000 సంవత్సరాలు.

ఈ నాలుగు యుగముల కాలమును 43,20,000 సంవత్సరములు ఒక మహాయుగము అంటారు.

విష్ణువు కాలపురుషుడు కనుక యుగకర్త అయినాడు. యుగకర్త అయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 445. యుగ భాసకాయ నమః

తన అవతారాదుల చేత యుగ ప్రకాశకుడు భగవంతుడగు విష్ణువు.

విష్ణుదేవుడు సమయానికి తగిన అవతారములను ధరించి ఆయా యుగములను ప్రకాశింప చేయుచున్నాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయుచున్నాడు. ఈ కలియుగ దైవము విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశ్వరుడు. యుగభాసకుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 446. కామారయే నమః

మోక్షము యొక్క విరోధ స్పృహను పోగొట్టువాడు. అందరినీ ముముక్షువుగా చేయువాడు విష్ణువు. కామమును హరించి మానవులను ముముక్షువులుగా చేయునట్టి విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

కామారయే నమః (25) అను నామము శివ 108 నామములలో గలదు. మన్మథుని యొక్క శత్రువు. మన్మథుని తన మూడవ నేత్ర దృష్టి చేత కాల్చి, బూడిద చేసినాడు. కామములకు కోరికలకు – శత్రువనుటలో ఉపలక్షణము చేత శివుడు అరిషడ్వర్గములను జయించిన వాడనవచ్చును. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు అరిషడ్వర్గములు.

### 447. కామ కారిణే నమః

భక్తుల కోరికలను ఈడేర్చువాడు. భోగ మోక్షాదులను భక్తులకు అనుగ్రహించువాడు.

భక్తుల కామ కారి – భక్తులకు ఇహలోక సుఖములను ప్రసాదించువాడు – అయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

# రుక్మాంగదుడు

– మందరపు వి.జి.శంకరాచారి

## (ఏకాదశి వ్రత ప్రాముఖ్యం కథ)

విష్ణుభక్తులలో రుక్మాంగదుడు ప్రముఖమైనవాడు. ఇతడు సత్యయుగంలో (కృతయుగం) ఋతధ్వజునికి కుమారుడుగా జన్మించాడు. విదిశ (ఇప్పుడు మధ్యప్రదేశ్ లో కలదు) రాజ్యానికి ఏలికగా ఉంటూ ప్రజలందరినీ భక్తిమార్గంలో నడిపించేవాడు. రాజ్యమంతా సుభిక్షంగా ఉండేది. ప్రజలందరూ దైవభక్తిలో లీనమై ఉండేవారు. రుక్మాంగదుడు విష్ణుభక్తిని సర్వవ్యాప్తం చేయడానికి ప్రయత్నం చేస్తూ ఉండేవాడు. ఈతడి ప్రయత్నం కారణంగానే రాజ్యంలోని ప్రజలంతా విష్ణు భక్తులయ్యారు.



రుక్మాంగద మహారాజు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి వచ్చే ఏకాదశి వ్రతాన్ని పరమ నిష్ఠతో చేసేవాడు. ఆ రోజంతా ఉపవాసం ఉండి మరునాడు వచ్చే ద్వాదశి ఘడియల్లో ఉపవాసమును విరమించేవాడు. రాజుతో పాటు మహారాణి అయిన 'సంధ్యావళి' కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలో పాల్గొంటూ భర్తకు సహకరించేది.

ఈ ఏకాదశి వ్రతం చేయడం వలన మహారాజుకి శత్రువులెవరూ ఉండేవారు కాదు. అందరినీ మిత్రులుగా భావించేవాడు. శత్రువుకైనా సహాయపడే గొప్ప మనసు రుక్మాంగదుడిది. కాబట్టి అతడు అజాత శత్రువుగా అందరి చేత పిలవబడ్డాడు.

రుక్మాంగదుడి కుమారుడు ధర్మాంగదుడు కూడా విష్ణుభక్తుడే. ఇతడికి 5 సంవత్సరాలు వచ్చిన నాటినుండి మహావిష్ణువుపై భక్తి భావం ఏర్పడింది. ఈ కారణం వలననే తను కూడా తల్లితండ్రులతో పాటుగా ఉపవాసం చేస్తూ వ్రతంలో పాల్గొనేవాడు. ఉపవాసం ఉండొద్దని తల్లి సంధ్యావళి

పదే పదే చెప్పినా కాదని ఉపవసిస్తూ పూజలో పాల్గొనేవాడు. పెద్దవాడు అవుతున్న కొలదీ ధర్మాంగదుడిలో విష్ణుభక్తి మరింత పెరిగింది.

రుక్మాంగదుడు ఏకాదశి వ్రతం చేయడం వలన వచ్చే ఫలాన్ని, ఫలితాన్ని ప్రజలందరికీ దక్కాలనే ఉద్దేశంతో తన రాజ్యం లోని ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో ఎవరి ఇళ్ళల్లో వారు ఈ ఏకాదశి వ్రతాన్ని చేసుకోవాలని చాటింపు వేశాడు.

ఆ రాజ్యంలోని ప్రజలందరికీ దైవచింతన ఎక్కువగా ఉండటం వలన ఈ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో చేసుకోసాగారు. ఫలితంగా ఆ రాజ్యంలోని ప్రజలందరూ సుఖసంతోషాలు అనుభవిస్తున్నారే తప్ప కష్టాలంటే ఏమిటో తెలియడం లేదు సరికదా మరణించినవారు సరాసరి వైకుంఠానికి వెళ్తున్నారు తప్ప యమలోకం వెళ్ళడం లేదు. విదిశ రాజ్య పౌరులెవ్వరూ నరకానికి రావడం లేదని తెలుసుకున్న యమధర్మరాజు విచారణ జరిపించి, ఇందుకు కారణం విదిశ రాజ్య ప్రజలందరూ ఏకాదశి వ్రతాన్ని పరమ భక్తి శ్రద్ధలతో రాజుతో పాటుగా చేస్తున్నారని తెలిసింది.

ఈ విషయం తెలిసిన తరువాత యమధర్మరాజు సరాసరి బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళి ''సృష్టికర్తా! భూలోకంలోని విదిశ రాజ్యపు ప్రజలు దైవచింతన కలవారై ఏకాదశి వ్రతం చేస్తూ అశేషమైన పుణ్యాన్ని సముపార్జించుకుని పుణ్యాత్ములై మరణించిన తరువాత సరాసరి వైకుంఠానికి వెళ్ళిపోయి మోక్షాన్ని పొందుతున్నారు. అందువల్ల విదిశ రాజ్యం నుండి ఒక్క పాపి కూడా నరకంలోకి అడుగు పెట్టడం లేదు.

విదిశ ప్రజలు చేసే ఏకాదశి వ్రతం ఆ దేశ రాజైన రుక్మాంగదుడి వలననే. కావున ముందుగా ఏదో ఒక నెపముతో రాజుచేత ఈ ఏకాదశి వ్రతమును చేయించకుండినట్లయితే ప్రజలు కూడా ఈ వ్రతాన్ని చేయకుండా ఉంటారు. అప్పుడు వారికి పాపం వాటిల్లడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి ఏదో ఒక ఉపాయం ఆలోచించి అమలు చేయవలెను. మీరు అమలు చేయబోయే ఉపాయం విదిశ రాజ్య ప్రజలు పాపులుగా మారడానికి కారణమవాలి. ఆ దేశ రాజ్య ప్రజలు అందరిలాగా పాపాలను చేస్తూ ఫలితంగా ''నరకలోకం'' చేరుకోవాలి అని చెప్పి ప్రార్థించాడు.

యమధర్మరాజు చెప్పగా రుక్మాంగదుడు మరియు ఆ దేశ ప్రజలు చేస్తున్న ఏకాదశి వ్రతాన్ని గురించి తెలుసుకున్న బ్రహ్మదేవుడు మొదటగా రాజుగారి దృష్టిని భక్తి నుండి రక్తి వైపు మళ్ళించడానికి ఒక అప్సరసను సృష్టించాడు. ఆమెకు మోహిని అని పేరు పెట్టాడు.

విధాత ఆమెతో విషయం చెబుతూ విదిశ దేశాన్ని పరిపాలిస్తున్న రుక్మాంగదుడు తను ఏకాదశి వ్రతాన్ని చేయడమే కాక, తన రాజ్య ప్రజలందరితో ఆ వ్రతాన్ని చేయిస్తున్నాడు. అందరూ పుణ్యాత్ములై వైకుంఠానికి వెళ్ళిపోతున్నారు. నారాయణుడిలో ఐక్యమవుతున్నారు. సాధారణంగా ఉండే పాపాత్ములు కూడా ఈ వ్రతాన్ని చేస్తూ తమ పాపాలను పోగొట్టుకుని పుణ్యాత్ములవుతున్నారు. ఇందువలన యమలోకానికి ఎవరూ రావడం లేదని యమధర్మరాజు నా వద్దకు వచ్చి ప్రార్థన చేశాడు. ఈ కారణం వల్లనే నేను నిన్ను సృష్టించాను. నీవు తక్షణం భూలోకానికి వెళ్ళి రుక్మాంగదుడు వేటాడుతున్న సమయంలో అతడి కంటపడి, నీ అందంతో అతణ్ణి వశం చేసుకుని, ఏకాదశి వ్రతం చేయకుండా ఉండేట్టుగా వరాన్ని అతడి నుండి పొంది అతడితో వ్రతాన్ని మాన్పించు. ఏ సమయంలో ఏ విధంగా కోరితే అతడు ప్రసన్నుడై నీ కోర్కెను తీరుస్తాడో గమనించి నీ కోర్కెను బయటపెట్టు. అంతేకాదు నీవు గంధర్వ కన్యవని అసత్య వచనము పలుకు. దోషం లేదు. తర్వాత ఈ కథనంతా నా తండ్రి గారైన శ్రీమహావిష్ణువు నడిపిస్తారు అని చెప్పి మోహినిని భూలోకానికి పంపించాడు బ్రహ్మదేవుడు.

భూలోకానికి వచ్చిన మోహిన ఒక అరణ్యంలోకి ప్రవేశించి మహారాజైన రుక్మాంగదుడు ఎప్పుడు వస్తాడో నని ఎదురు చూడసాగింది. ఆమె ఎదురు చూపులు ఫలించినట్లుగా వేటకు వచ్చిన రుక్మాంగద మహారాజు ఆ అరణ్యంలో ఒక మృగాన్ని వేటాడుతూ వచ్చిన అతడికి మోహిని తారసపడింది. ఆమె అందాన్ని చూసి మోహంలో పడిపోతాడు మహారాజైన రుక్మాంగదుడు.

తనకు తారసపడిన మోహినితో ఎవరు నువ్వు? ఈ కీకారణ్యంలోకి ఎలా రాగలిగావు? నీదేవూరు? అని ప్రశ్నిస్తాడు.

అప్పుడు మోహిని తను ఒక గంధర్వ కన్యనని, శాపవశాత్తు ఈ భూలోకం వచ్చానని చెబుతుంది. తనకు ఒక కోరిక ఉందని, ఆ కోరికను ఏ రాజైతే తనను పెళ్ళి చేసుకుని ఆ కోరికను తీరుస్తాడో అప్పుడు తనకు శాప విమోచనం కలుగుతుందని, అప్పుడు తనకు గల అతీంద్రియ శక్తులన్నీ సమకూరి గంధర్వలోకం వెళ్ళిపోతానని చెబుతుంది.

మోహిని చెప్పిన అబద్ధాన్ని నిజమనుకున్న మహారాజు మోహినీ! నీ అందంతో సరితూగ గల కన్య ముల్లోకాలలోనూ లేదు. అందుకే నీ అందానికి దాసుడనైపోయాను. నన్ను వివాహం చేసుకుంటే నీ కోరిక తీరుస్తాను. ఇక్కడే నిన్ను నేను గాంధర్వ వివాహం చేసుకుని నా రాజ్యానికి తీసుకుని వెళతాను. నీకు ఇష్టమేనా? అని అడిగాడు.

మోహిని – ఇష్టమే కానీ, ఏనాడైతే మీరు నా కోరికను తీరుస్తారో ఆ రోజే నేను నిన్ను విడిచి మా లోకానికి వెళ్ళిపోతాను అంటుంది.

మోహినీ! నీవు నన్ను విడిచి వెళ్ళిపోతే నేను బ్రతకగలనా? అంటాడు రుక్మాంగదుడు.

నా కోర్కెను తీర్చినప్పుడు కదా నేను నిన్ను విడిచి వెళ్ళేది. అప్పటివరకు నేను మీ దాసనే కదా. అయినా ఒక స్త్రీపై అంతగా మోహం పెంచుకోవడం సరికాదు. తెలిసిందా అంటుంది.

తరువాత రుక్మాంగద మహారాజు, మోహినిని గాంధర్వ వివాహం చేసుకుని తన రాజ్యానికి వెళతాడు.

రుక్మాంగదుడు ఎప్పటిలాగే భక్తి సామ్రాజ్యంలో మునిగి తేలుతూ ఉంటాడు. పదిహేను రోజులకి ఒకసారి వచ్చే ఏకాదశి రోజున వ్రతము చేయాలని సంకల్పిస్తాడు. ఈ వ్రతము చేయడానికి మహారాజుతో పాటు భార్య సంధ్యావళి, కుమారుడు ధర్మాంగదుడు కూడా ఉద్యుక్తులయ్యారు. ఆ రోజు రాత్రి మోహినికి మహారాజు మరుసటి రోజు తాము ఏకాదశి వ్రతమును చేయబోతున్నామని, తమతో పాటుగా వ్రతం చేయమని చెబుతాడు.

ఆ రాత్రి మహారాజుకి మోహిని ఎటువంటి సమాధానం చెప్పలేదు.

మరునాడు మహారాజుతో పాటుగా భార్య సంధ్యావళి, కుమారుడు ధర్మాంగదుడు వ్రతం చేయడానికి కూర్చోబోతున్న తరుణంలో మోహిని వారి దగ్గరకు వచ్చి రుక్మాంగదుడితో – మహారాజా! మీరు నన్ను వివాహం చేసుకున్న రోజున నేను ఒక కోరికను కోరుకుంటాను. సమయం వచ్చినప్పుడు నా కోరికను చెబుతాను అని చెప్పాను గుర్తుందా? ఇప్పుడు ఆ సమయం వచ్చింది అంటుంది.

ఏమిటి నీ కోరిక? ప్రశ్నిస్తాడు మహారాజు

మహారాజా! ఈ ఏకాదశి వ్రతము రోజున మీరు నాతో కలిసి భోజనం చేయాలి. ఈ వ్రతం చేయడం మానుకోవాలి. మీరు మాత్రమే కాదు. ఈ దేశ ప్రజలందరూ ఈ వ్రతం చేయకూడదు. చాటింపు వేసి ప్రజలకు చెప్పాలి. అలా కాకుండా వ్రతం చేద్దామని అనుకుంటే నీ కుమారుణ్ణి నీ ఖడ్గంతో తల నరికి ఏకాదశి వ్రతమును చేసుకోమని అంటుంది.

ఆమె కోర్కెను విన్న మహారాజు మూర్ఖురాలా! నా రాజ్య ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించడం, నరకంలోకి ప్రవేశించకుండా వైకుంఠ ప్రాప్తిని పొంది, శ్రీమహావిష్ణువులో ఐక్యం కావడం ఇష్టం లేదా? ఈ ఏకాదశి వ్రతం చేయడానికి కూడా పూర్వ.జన్మ సుకృతం ఉండాలి. నీ మోహంలో ఉన్న నేను నీవు కోరితే అది ఇస్తాను. కోర్కె నెరవేరుస్తానని అనుకుంటున్నావా? నీ మాటలు విని నీ కోర్కె తీర్చడం కన్నా ఈ ఏకాదశి వ్రతం చేయడమే నాకు ప్రియమైనది అని చెబుతున్న సమయంలో కుమారుడైన ధర్మాంగదుడు తండ్రి చెంతకు వచ్చి జనకా! ఈమె కోర్కెను తీర్చడం కన్నా ఏకాదశి వ్రతం చేసుకుని విష్ణు భక్తుడిగా మరణించడమే మిన్న, మీరు ఎటువంటి చింతను మనసులో పెట్టుకోకుండా నా తలను ఈ ఖడ్గంతో నరికి వేయండి అంటూ ఖడ్గాన్ని తండ్రి చేతిలో పెడతాడు.

కుమారుడు ఇచ్చిన ఖడ్గంతో ధర్మాంగదుడి తలను నరకబోతాడు రుక్మాంగదుడు. అతడు ఖడ్గాన్ని పైకెత్తిన మరుక్షణంలోనే శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై భక్తాగ్రేసరా! నీ భక్తి అపూర్వమైనది. ఈ వ్రతం చేయడం కోసం నీవు నీ కుమారుణ్ణి కూడా వదులుకుంటావని నీకు తెలుసు. అందుకే ఈ వ్రతమాహాత్మ్యాన్ని నీ ద్వారా ప్రజలందరికీ తెలియపరచాలనే ఉద్దేశ్యంతో నేను ఆడించిన నాటకమిది. నా ఆజ్ఞ మేరకే యమధర్మరాజు బ్రహ్మను ఆశ్రయించి మోహిని సృష్టింప చేశాడు. నిజానికి మోహిని గంధర్వ కన్య కాదు. బ్రహ్మ మానసపుత్రిక. ఇప్పుడు ఆమె తన అవతారాన్ని చాలించి విధాత అంశ తిరిగి అతడిలోకి చేరుకుంటుంది అని చెప్పగానే మోహిని తన రూపాన్ని విడిచి జ్యోతిగా మారి బ్రహ్మలో ఐక్యం కావడానికి సత్యలోకం వైపు ప్రయాణం సాగిస్తుంది అని చెప్పిన శ్రీమన్నారాయణుడి ఉద్దేశ్యం ఏమిటో గ్రహిస్తాడు.

అందరూ చూస్తుండగానే మోహిని జ్యోతిగా మారి బ్రహ్మలోకం వైపు వెళ్ళిపోతుంది.

మోహిని వెళ్ళిపోయినది కళ్ళారా చూసిన మహారాజు నారాయణుడితో స్థితికర్తా! ఏ స్థితిలోనూ నేను ఇంద్రియ నిగ్రహమును కోల్పోకుండా ఏకాదశి వ్రతమును చేసే అనుగ్రహాన్ని ఇవ్వు అని కోరతాడు.

అప్పుడు శ్రీమహావిష్ణువు రాజా! నీవు జితేంద్రియుడవు. అందుకే నేడు నీవు మోహిని యొక్క అందానికి దాసుడివి కాకుండా ఆమె కోర్కెను నెరవేర్చకుండా ఏకాదశి వ్రతాన్ని చేయడానికి మాత్రమే ప్రాముఖ్యతిచ్చావు. ఈ వ్రతం చేయడం వలన ప్రజలు సుఖ సంతోషాలను పొందడమే కాకుండా ముక్తిని, మోక్షాన్ని పొందుతారు. రాబోయే త్రేత, ద్వాపర, కలి యుగాలలో ఈ వ్రతం విశేషమైన ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. నీద్వారా లోకాలన్నింటికీ తెలిసేట్లు చేయడానికి గాను, నా భక్తుడవైన నిన్ను ఎంచుకున్నాను. ఇకనుండి ప్రజలందరి చేత క్రమం తప్పకుండా ఏకాదశి వ్రతమును చేయించే బాధ్యత నీది అని చెప్పి అదృశ్యమవుతాడు శ్రీహరి.

రుక్మాంగదుడు ఏకాదశి వ్రతమును ఎంతో నిష్ఠతో ఇంద్రియ నిగ్రహమును ఏ పరిస్థితిలోనూ కోల్పోకుండా అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ వ్రతం చేశాడని తెలుసుకున్న మనం అదే నిష్ఠతో, ఇంద్రియ నిగ్రహంతో ఏకాదశి వ్రతాన్ని ఆచరించి ముక్తిని, మోక్షాన్ని పొందుదాము.




### గత సంచిక తరువాయి

అంతవరకు సారణుడు చెప్పాడు. ఇప్పుడు శుకుడు చెప్పసాగాడు. రాజా! అటు చూడు మదపుటేనుగుల్లా ఉన్నారు. హిమవత్పర్వతం మీద మద్ది చెట్లలా ఉన్నారు. మహాకాయులు. దుర్జయులు. మహాబలవంతులు. కామరూపులు. యుద్ధంలో దైత్య దానవ సములు. దేవేంద్రునిలా పరాక్రమవంతులు. అంతులేకుండా ఉన్నారు. వారందరూ సుగ్రీవుని అనుచరులు. దేవ గంధర్వాంశతో పుట్టినవారు. పుట్టుకతోనే కామరూపులు.

అదుగో ఆ కనపడే యువకులు మైందుడు, ద్వివిదుడు. బ్రహ్మానుగ్రహంతో అమృతం తాగారు. లంకా పట్టణాన్ని ధ్వంసం చేయాలని ఉన్నారు. అదో మదపుటేనుగుల్లా నిలుచున్నాడు. వాడే లంకకు వచ్చాడు. సీతాదేవితో మాట్లాడాడు. వాడు కేసరి కొడుకు. వాయు పుత్రుడు. హనుమంతుడు. వాడు కుపితుడైతే సముద్రాన్ని అతలా కుతలం చేయగలడు. కామరూపి. బలవంతుడు. రూపసి. వాయుదేవునిలా ఎక్కడికైనా పోగలడు. బాలుడుగా ఉన్నపుడు వాడికి ఆకలి వేసింది. సూర్యుణ్ణి చూశాడు. ఎర్రని పండు అనుకున్నాడు. 3 వేల యోజనాల పైకి ఎగిరాడు. సూర్యుణ్ణి తినబోయాడు. అయితే సూర్యుణ్ణి చేరుకోలేదు హనుమ. అక్కడి నుంచి ఉదయగిరిపై పడ్డాడు. ఒక రాతిబండ తగిలింది. వాడి హనుమ (దవడ) దెబ్బతినింది. హనుమ కలవాడు. హనుమంతుడని పిలువబడ్డాడు. వాడి రూపం బలం ప్రభావం వర్ణనాతీతం. ఒక్కడే లంకను మర్దించాలని ఉన్నాడు.

రాజా! హనుమ సమీపంలోని శూరుణ్ణి చూడు. అతడే రాముడు. దేహం శ్యామవర్ణం. నేత్రాలు పద్మపత్రాలు. ఇక్ష్వాకు వంశస్థుడు. అతిరథుడు (రథ గమనంలో అడ్డు లేనివాడు అని అర్థం చెప్పవచ్చు. కానీ రాముడు మహారథుడు. శుకునికి తెలియక అతిరథుడు అన్నాడు). లోక విఖ్యాతుడు. ధర్మం తప్పనివాడు. వేదవిదుడు. కోపానికి మృత్యువు లాంటివాడు. పరాక్రమానికి దేవేంద్ర సముడు. జనస్థానంలో ఎత్తుకు వచ్చిన సీతే – ఇతని భార్య. నీ గర్వాన్ని అంతం చేయాలని వస్తున్నాడు.

రామునికి పక్కన ఉన్నాడు చూడు – బంగారు రంగులో ఉన్నాడు. వాడే రాముని తమ్ముడు. లక్ష్మణుడు. విశాల వక్షస్థలం, ఎర్రని కనులు, ఉంగరాల జుట్టు, సర్వాస్త్ర విశారదుడు, మహా కోపిష్ఠి. రామునికి ప్రాణప్రియుడు. నీతిజ్ఞుడు. యుద్ధకుశలుడు. జయశీలి. రామునికి కుడిభుజం. అతడి బహిః ప్రాణం. అతడి కోసం ప్రాణత్యాగం చేసేవాడు.

సమస్త రాక్షస సంహారం తానే చేయాలని ఉన్నాడు.

రాముని ఎడమ వైపు చూడు. విభీషణుడు ఉన్నాడు. నలుగురు మంత్రులతో ఉన్నాడు. రాముడతణ్ణి లంకకు పట్టాభిషిక్తుణ్ణి చేసేశాడు. నీమీద యుద్ధానికి ఉత్సాహ పడుతున్నాడు. రామ విభీషణుల మధ్య చూడు. కొండలా ఉన్నాడు – అతడే సుగ్రీవుడు. తేజోబలానికి జ్ఞానబలానికి పెట్టింది పేరు. రాముని చేత వాలిని చంపించాడు. అదో మెడలో చూడు, నూరు కమలాలతో చేసిన కాంచనమాల. చూడు. రామానుగ్రహంతో ఆ మాల వచ్చింది. వాలి భార్య తారని, వానర రాజ్యాన్ని పొందాడు.

తర్వాత సంఖ్యామానం వివరిస్తున్నాడు. నూరు లక్షలు ఒక కోటి. లక్ష కోట్లు ఒక శంఖం. లక్ష శంఖాలు ఒక మహా శంఖం. లక్ష మహా శంఖాలు ఒక బృందం. లక్ష బృందాలు ఒక మహా బృందం. లక్ష మహా బృందాలు ఒక పద్మం. లక్ష పద్మాలు ఒక మహాపద్మం. లక్ష మహాపద్మాలు ఒక ఖర్వం. లక్ష ఖర్వాలు ఒక మహాఖర్వం. లక్ష మహాఖర్వాలు ఒక సముద్రం. లక్ష సముద్రాలు ఒక ఓఘం. లక్ష ఓఘాలు ఒక మహౌఘం – అని పెద్దలు చెప్పారు అన్నాడు శుకుడు. చివర్లో అంటున్నాడు.

ప్రభూ! అసంఖ్యాకమైన సేనలు. రామ లక్ష్మణ సుగ్రీవ విభీషణులు నీ మీద యుద్ధానికి వస్తున్నారు. జ్వలించే గ్రహ గోళాల్లా ఉన్నాయి సేనలు. నిశితంగా చూడు. విజయం కోసం ఆలోచించు. పరాజయం పొందరాదు.

మనలో మాట – అన్ని వేల కోట్ల వానర భల్లూకాల సేనలు – వేల కోట్లాది రాక్షస సేనలు – అప్పటి రణరంగస్థలం ఎంత వైశాల్యంలో ఉండాలి లంక. సమీపంలో అంతటి మైదానం ఉందా మహర్షీ! నీ రచనలో అసత్యాలు ఉండవు అన్నాడు వాల్మీకితో బ్రహ్మదేవుడు. అపుడా సంఖ్యామానం అసత్యం కావాలి. రామ రావణ యుద్ధం త్రేతా యుగాంతాన జరిగింది. కనుక అంతటి జనాభా వుండొచ్చు అన్నారు కొందరు.

దీర్ఘ సత్రయాగాలు కొన్ని సంవత్సరాల దాకా జరిగేవి. అపుడా యాగభూమి వేదికలు తదితరాలకు ఇటుకలు అవసరం. లక్షల కోట్ల సంఖ్యామానం ఇటుకలన్నారు కొందరు వ్యాఖ్యాతలు. శ్రీరామాయణంలో ఎన్నో ప్రక్షిప్తాలున్నాయి. ఈ సంఖ్యామానంలోని సేనల వివరాలు ప్రక్షిప్తం అన్నారు కొందరు వ్యాఖ్యాతలు. యుద్ధకాండ 29 సర్గ – 33 నుంచి 38 శ్లోకాల వరకు ఆ సంఖ్యామానం వివరింపబడింది.

## మందలింపు

శుక సారణులు శత్రువులను ప్రశంసించారు. అందుకు కుపితుడైనాడు రావణుడు. ఇద్దరినీ మందలించాడు. అంటున్నాడు – రాజు నిగ్రహానుగ్రహ సమర్థుడు. ఆశ్రితులు అప్రియాలు పలకరాదు. రాజుకి అప్రియ వార్తలు చెప్పరాదు. శత్రువుల్ని స్తుతించరాదు. రాజనీతి లోని భృత్యధర్మం తెలీదు మీకు. ఆచార్యుల, గురువుల, వృద్ధుల సేవలు వృథా కారాదు. మీరు నీతిశాస్త్రం చదివినా అర్థం కాదు. ఒకవేళ అర్థమైనా – దాన్ని ఆచరణలో పెట్టలేరు. కేవలం బరువు మోస్తున్నారు. మీరు మూర్ఖులు. మీతో రాజ్యమేలుతున్నాను నేను. నేను ఆదేశిస్తే – మేలు జరుగుతుంది. లేదా కీడు జరుగుతుంది. అలాంటి నాతో పరుషంగా మాట్లాడారు. మీకు మృత్యుభయం లేదేమో! రాజు కోపానికి గురైన అపరాధులు – బతికి బట్ట కట్టలేరు. శత్రుపక్షాన్ని స్తుతిస్తారా? కృతఘ్నులు మీరు. అయితే నాకు ఉపకారం చేసారు కనుక – నా కోపం చల్లారింది. లేకపోతే ఎప్పుడో మిమ్మల్ని చంపేసేవాణ్ణి. మీరు మీ పదవులు వదిలిపెట్టి పోండి. వధార్హులు అయినా వదిలేస్తున్నాను. వెళ్ళండి.

విన్నారు శుక సారణులు. సిగ్గుతో తల వంచుకున్నారు. రావణుని జయమని స్తుతించారు. వెళ్ళిపోయారు. తర్వాత అక్కడే ఉన్నాడు మహోదరుడు. చూసాడతణ్ణి. నీతి శాస్త్ర నిపుణులున్నారు. ఆ చారుల్ని పిలిపించు – అది అతని ఆదేశం.

## శార్దూలుడు

గూఢచారులు వచ్చారు. అందులో శార్దూలుడు ముఖ్యుడు. జయించాలని ఆశీర్వదించారు రాజుని. అంజలి ఘటించారు. నిలుచున్నారు. చూసాడు రావణుడు. అంటున్నాడు. చారులారా! వెంటనే వానరుల సేనలోకి వెళ్ళండి. రాముని యుద్ధ ప్రయత్నాలు గమనించండి. అతని మంత్రులు ఎవరో తెల్సుకోండి. ఆంతరంగికులెవరో తెలుసుకోండి. రాముడెవరితో సన్నిహితంగా ఉంటాడో తెలుసుకోండి. అతడెలా నిద్రిస్తాడు – పనులెలా చేస్తాడు? అన్నీ బాగా పరిశీలించండి – చారులు బుద్ధిమంతులు. వారి స్వల్ప ప్రయత్నం చాలు. రాజులు శత్రువుల్ని పరాజితులు చేస్తారు.

విన్నాడు శార్దూలుడు. రావణునికి ప్రదక్షిణం చేసాడు. తక్కినవారు అనుసరించారతణ్ణి. వెళ్ళిపోయారు.

అందరూ మారు వేషాలు వేసారు. సువేల పర్వతం చేరారు. రామ లక్ష్మణ సుగ్రీవ విభీషణుల్ని చూసారు. అపార సేనని చూసారు. భయపడ్డారు. దీనులైనారు. అంతలో వాళ్ళని చూసాడు విభీషణుడు. వారిలో శార్దూలుడు పాపిష్టివాడు. చారుల్లో ప్రధానుడు. వాణ్ణి పట్టాడు. వానరులకి అప్పగించాడు. తక్కినవారిని పట్టారు వానర వీరులు. బాగా కొట్టారు. చంపాలని చూసారు. అడ్డుపడ్డాడు రాముడు. విడిపించాడు వాళ్లని. చావు దెబ్బలకి నిట్టూర్చారు. వెనక్కి తిరిగారు. వెళ్లారు లంకకి. రావణుని సమీపించారు.

సువేల పర్వతం మీదున్నాడు రాముడు. వానర సైన్యం అపారం. అక్కడి సంగతులన్నీ చెప్పాడు శార్దూలుడు. విన్నాడు రాక్షస రాజు. కొంత వ్యాకులపడ్డాడు. శార్దూలా నిశాచరా! నీ ముఖం ఎప్పటిలా లేదు – దీనంగా ఉంది. శత్రువులకి చిక్కలేదు కదా! – అడిగాడు.

మహారాజా! మేం వెళ్లాం. చూసాం. వానర వీరుల కదలికలు మాకు అంతు పట్టలేదు. అందరూ మహా పరాక్రమవంతులు. బలవంతులు. పైగా రాముని రక్షణలో ఉన్నారు. ఎవ్వరితోనూ మాట్లాడలేకపోయాం. పరిశీలించలేక పోయాం. అటు ఇటు తిరగలేకపోయాం. విభీషణుడు గుర్తించాడు. వానరులు పట్టుకున్నారు మమ్మల్ని. మట్టిలో పొర్లించారు. పిడికిళ్లతో పొడిచారు. కోరలతో కొరికారు. అరచేతులతో చావబాదారు. కాళ్లతో కుమ్మారు. సేనల చుట్టూ తిప్పారు. నా వళ్లంతా రక్తమే. అవయవాలు పట్టు తప్పాయి. కొడుతుంటే చేతులు జోడించాను. రామసన్నిధికి తీసుకెళ్లారు. అతడు రక్షించాడు. దైవికంగా బయట పడ్డాం.

కొండలతో బండరాళ్లతో సేతువు నిర్మించారు. ఈవలి తీరాన ఉన్నారు. గరుడ వ్యూహంలో సేనలున్నాయి. లంకా ద్వారం వద్ద ఉన్నాడు రాముడు. త్వరలో నగర ప్రాకారాలు పడగొడ్తారు. నీవు సీతని ఇవ్వటం మంచిది. లేదా మహా యుద్ధం తప్పదు. రెండింటిలో ఏదో ఒకటి తేల్చుకో!

విన్నాడు రావణుడు. నిశాచరా! దేవతలు దానవులు గంధర్వులు ఏకమై వచ్చినా – సర్వలోకాలు ఏకమై వచ్చినా రామునికి సీతనివ్వను. అది అలా ఉండనీ.

## వానరుల సంతతి

సేనల్ని చూసావు కదా. వాళ్లలో శూరులెవరు? దురాసదులెవ్వరు? తండ్రులెవరు? తాతలెవరు? వివరంగా చెప్పు. దాంతో బలా బలాలు తెలుస్తాయి. ఎవరి విషయంలో ఏం చేయాలో నిర్ణయిస్తాను. శత్రువు బలం తెల్సుకోవాలి. అప్పుడే యుద్ధ సన్నాహాలు చేయవచ్చు.

విన్నాడు శార్దూలుడు. వాడు చారుల్లో శ్రేష్ఠుడు. అంటున్నాడు. రాజా! ఋక్షరజుని పుత్రడు సుగ్రీవుడు. వాణ్ణి జయించడం అసాధ్యం. జాంబవంతుడు గద్గదుని కొడుకు. ధూమ్రుడు జాంబవంతుని తమ్ముడు. బృహస్పతి పుత్రుడు కేసరి. వాని పుత్రుడు హనుమంతుడు. సుషేణుని తండ్రి వరుణదేవుడు. దధిముఖుని తండ్రి చంద్రుడు. సుముఖుడు దుర్ముఖుడు వేగదర్శి – ఈ ముగ్గురిని బ్రహ్మ సృష్టించాడు. వాళ్లు నిజంగా మృత్యుదేవతలే. వానర సేనా నాయకుడు నీలుడు. వాడు అగ్నిదేవుని పుత్రుడు. అంగదుడు వాలి పుత్రుడు. మైంద ద్వివిదులు అశ్వనీ దేవతల పుత్రులు. గజుడు గవాక్షుడు గవయుడు శరభుడు గంధమాదనుడు – ఈ ఐదుగురు యముని పుత్రులు. శ్వేతుడు జ్యోతిర్ముఖుడు సూర్యపుత్రులు. వరుణ దేవునికి హేమకూటుడని మరో కొడుకు ఉన్నాడు. నలుడు విశ్వకర్మ పుత్రుడు. దర్దనుడు వసువు పుత్రుడు. వానరులందరూ పది కోట్ల మంది – అందరూ దేవతల సంతానం. అందరూ కాంతిమంతులు. ఇంకా ఎందరో వీరులున్నారు.

దశరథుని పుత్రుడు రాముడు. అతడు యువకుడు. సింహపరాక్రముడు. విరాధుని కబంధుని చంపాడు. జనస్థానంలో రాక్షసుల్ని హతమార్చాడు. రాముని తమ్ముడు లక్ష్మణుడు దృఢకాయుడు. బలశాలి. అతని బాణాల ధాటికి ఇంద్రుడు కూడా మృత్యుదేవతని చేరాల్సిందే. నీ తమ్ముడు విభీషణుడు లంకాధిపతి యైనాడు. అతడు రాముని హితైషి. అందరూ సువేల పర్వతం మీద విడిది చేసారు. రాజా! అన్ని వివరాలు చెప్పాను. ఇక శేషకార్యం నీదే.

## మాయమాటలు

గూఢచారులు చెప్పారు – వెళ్ళిపోయారు. భయపడ్డాడు రావణుడు. అక్కడున్న మంత్రులన్ని చూసాడు. 'రహస్య సమాలోచనలు చేయాలి. అందరినీ పిలిపించండి' – అది లంకాధిపతి ఆదేశం. కాసేపటికి అందరూ వచ్చారు. కర్తవ్యం గూర్చి సచివులతో చర్చించాడు. వాళ్లని పంపాడు. తర్వాత తన భవనంలోకి వెళ్లాడు.

విద్యుజ్జిహ్వుని రమ్మన్నాడు. వాడు మాయలమారి. మహా బలశాలి. అంటున్నాడు. ''జనకాత్మజ సీత. ఆమెను మోసగించాలి. రాముని తల – రాముని విల్లు కల్పించు. వాటితో అశోకవనానికి రా'' – అది రాక్షసరాజు ఆజ్ఞ. అంగీకరించాడు వాడు. వాడికో ఆభరణం బహూకరించాడు.

భవనం నుంచి బయటికి వచ్చాడు రావణుడు. నడిచాడు. అశోకవనం చేరాడు. సీతని చూసాడు. ఆమె తల వంచుకుని ఉంది. రామ ధ్యానంలో దుఃఖంతో ఉంది. ఆమె చుట్టూ ఉన్నారు రాక్షసాంగనలు. సంతోష వార్త చెప్పేట్లుగా అంటున్నాడు.

కళ్యాణీ! నిన్నెంతో బతిమాలాను. నా మాట వినలేదు. ఆ రాముణ్ణి నమ్ముకున్నావు. ఖరాదుల్ని చంపాడు కదా. నీ రాముడు యుద్ధంలో చనిపోయాడు. నీ ఆధారం పోయింది. నీ గర్వం అణచివేసాను. ఇంకా దుఃఖమెందుకు? నన్ను పతిగా స్వీకరించు. రాముని తప్ప మరొకణ్ణి కాదన్నావుగా. నీ రాముడు లేడు. పిచ్చి ఆలోచన్లు మానుకో. చచ్చిపోయిన నీ భర్తతో ఏం చేస్తావు? తెలివి తెచ్చుకో. నా భార్యలకి అధికారిణిగా ఉండు. అదృష్టహీనులారా! వృత్రాసురునిలా నీ భర్త దుర్మరణం



పాలైనాడు. అదెలా జరిగిందో చెబుతాను విను.

రాముడు సుగ్రీవునితో సముద్రం దాటు. వానరసేనలు తీరాన చేరాయి. సూర్యాస్తమయమైంది. బాగా అలసిపోయాయి సేనలు. నిద్రలోకి జారాయి. అదను చూసాడు ప్రహస్తుడు. చతురంగ బలాలతో వెళ్లాడు. వివిధ ఆయుధాలతో వానరసేన మీద పడ్డాడు. నిద్రిస్తున్న రాముణ్ణి చూసాడు ప్రహస్తుడు. ఖడ్గం తీసాడు. క్షణంలో రాముని తల నరికాడు. అది మెరుపుదాడి. విభీషణుని బంధించాడు. సుగ్రీవుని తల తెగింది. హనుమంతుడు దవడలు పగిలి చచ్చాడు. జాంబవంతుని మోకాళ్ళు నరికేసారు. మొదలు నరికిన చెట్టుల్లా కూలాడు వాడు. మైంద ద్వివిదులు నడుములు తెగిపోయాయి. రక్తసిక్తాలైనాయి. శరీరాలు ముక్కలయ్యేలా చంపారు. పనసుడు పనసపండులా కొన వూపిరితో ఉన్నాడు, దధీముఖుని ఒళ్లంతా బాణాలే. ఒక గుహలో పడి చచ్చాడు. శత్రుధాటికి తట్టుకోలేకపోయాడు కుముదుడు. నోట మాట లేక చచ్చాడు. అంగదుని చేతులు తెగాయి. నెత్తురు కక్కాడు. నేల కూలాడు. నిద్రిస్తున్న వానరుల్ని తొక్కేసాయి ఏనుగులు. కొందరు గుర్రాల కాళ్లకింద పడ్డారు. నలిగి చచ్చారు. కపటోపాయంతో కొందరిని చంపారు. కొందరు సముద్రంలో పడ్డారు. కొందరు ఆకాశంలో కెగిరారు. కొందరు వానరులతో లక్ష్మణుడు పారిపోయాడు. భల్లూక వీరులు వానర యోధులు చెల్లా చెదురైనారు. కొండల్లో కోనల్లో వనాల్లో వెదికారు. పట్టారు. చంపేసారు.

**(సశేషం)**

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. మనం భగవంతుణ్ణి ఎక్కడ దర్శించగలం? కర్మసాక్షి సూర్యునిలోనో, మనకు జన్మనిచ్చిన తల్లితండ్రులలోనో కాక ఉపనిషద్, వేదాంతపరంగా, కాని సరళంగా చెప్పండి**

**– జి.రాజేంద్రప్రసాద్, కాళీమందిర్**

జవాబు – మంచి ప్రశ్న. ఉపనిషత్తుల ప్రకారం మరియు మహాత్ముల అనుభవాల ఆధారంగా అయితే 'తత్త్వమసి' (అది నువ్వే అయి ఉన్నావు. 'తేనత్వమ్ అసి' (ఆయనవల్లే నువ్వుండగలుగుతున్నావు) 'తస్యత్వం అసి' (నీవు అతనికి చెందుతావు), 'తత్ త్వమ్ అసి' (అది నువ్వే అయి ఉన్నావు) అని మనం చెప్పుకోవచ్చు. సృష్టిలోని అణువణువులో ఉన్న ఆ దైవం మనలోనూ ఉన్నాడని గ్రహించి, సాధన ద్వారా ఆయనను అంతటా, అన్నిటా దర్శించవచ్చు. 'యద్భావం తద్భవతి' మరియు యథా దృష్టి, తథా సృష్టి అనే వాటి ప్రకారం మన పెద్దల ఉపదేశానుసారం ప్రయత్నం చేయాలి. ఆయన మనకు ఏ రూపంలోనైనా దర్శనమిస్తాడు, అనుభవంలోకి వస్తాడనే దృఢ నమ్మకంతో మనం జీవించాలి.

**2. భగవంతుడంటే...?** **– పద్మావతి (పద్దు) ఖమ్మం**

జవాబు – విష్ణు పురాణంలో మీరడిగిన ప్రశ్నకు మంచి జవాబు ఉంది. భగ... అనే శబ్దానికి ఐశ్వర్యము, యశము, శ్రీ, వాక్కు, జ్ఞానము, వైరాగ్యము అనేవి ఎవరిలో అయితే సంపూర్ణంగా ఉంటాయో, ఎవరిలో సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, సర్వశక్తిమత్వము ఉంటాయో ఆయనే భగవంతుడు. ఆయనో అద్భుతశక్తి. అన్నిటికీ ఆధారం, మూలకారణం భగవంతుడే.

**3. ఆనందం – ఆనందం, ... దీని గురించి వివరించండి?**

**- డా॥ ఎం.నాగేశ్వరరావు, హైదరాబాద్.**

జవాబు – 'ఇంక నాకు ఏదీ అక్కరలేదు' అనే భావనే ఆనందం. ఏదైనా గొప్పదైన కార్యం విజయవంతంగా పూర్తి చేసినప్పుడు కలిగే అనుభూతే ఆనందం. ఆనందం అనే పదానికి 'సంపూర్ణత్వం' అనే అర్థం కూడా వస్తుంది. ఆనందమే పరబ్రహ్మ తత్వం అంటుంది (ఆనందో బ్రహ్మ....) ఉపనిషత్. మానవుడు తన స్థాయికి మించిన కోరికలు కోరుకోకపోతే, వాటి కోసం తపన పడకపోతే, ఉన్నదాన్లో తృప్తితో ఉంటే, ఇతరులతో పోల్చుకోకుండా ఉంటే అదే... అదే... ఆనందం.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు.**
**భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
**– ఎడిటర్, శ్రీవేంకటేశం**



# జయదేవుని గీత గోవిందము

– డా॥ మారేపల్లి భువనేశ్వరి, 9550241921

గత సంచిక తరువాయి

## 5. చరణం: భావార్థం

యమునా నదీతీరంలో గోపికలు శ్రీకృష్ణుడితో సాగించే శృంగార లీలలలో భాగముగా, ఒక రసికురాలైన గోపిక కృష్ణునిపై తనకున్న అధికారాన్ని, ప్రణయ చాపల్యాన్ని ఎలా వ్యక్తపరిచిందో సఖి రాధకు వర్ణించే సందర్భమిది.

**కేళి కళా కుతుకేన చ కాచిదముం యమునా జల కూలే ।**

**మంజుల వంజుల కుంజ గతం విచకర్ష కరేణ దుకూలే ॥ 5 ॥**

ప్రతిపదార్థం - చ = మరియు; కా అపి = ఒకానొక (గోపిక); కేళి కళా కుతుకేన = శృంగార క్రీడా కళలందలి వేడుకతో / కుతూహలముతో; యమునా జల కూలే = యమునా నదీ జలాల తీరము నందు; మంజుల = అందమైన / మనోహరమైన; వంజుల కుంజ గతమ్ = పొదరింటి (వంజుల / లతా గృహము) వైపునకు వెళుతున్న; అముమ్ = ఈ శ్రీకృష్ణుడి యొక్క; దుకూలే = పట్టు వస్త్రాన్ని (పీతాంబర చెంగును); కరేణ = తన చేతితో; విచకర్ష = (తన వైపునకు) లాగింది / ఈడ్చింది.

**విశేషాలు - వంజుల కుంజము:** 'వంజులము' అనగా రమణీయమైన వెదురు / రెల్లు లేదా పొదరింటి లత. యమునా తీరాన ఉండే లతా గృహాలు (లతా కుంజాలు) రాధాకృష్ణుల మరియు గోపికల ప్రణయ కేళులకు ముఖ్య వేదికలు.

నాయికా ప్రగల్భత (ప్రణయాధికారం): భగవంతుడైన శ్రీకృష్ణుడి వస్త్రాన్ని చేతితో పట్టుకుని లాగడం అనేది గోపికకు ఆయనపై ఉన్న గాఢమైన అనురాగానికి, సఖ్య భావానికి మరియు ప్రణయ హక్కుకు నిదర్శనం.

**నాద సౌందర్యం:** "మంజుల - వంజుల - కుంజ" వంటి శబ్ద ప్రయోగాలు జయదేవుని అనుప్రాస నైపుణ్యానికి, "గీత" మాధుర్యానికి మరొక చక్కని ఉదాహరణ.

**తాత్పర్యం** - మరియొక గోపిక కేళీ విలాసాల యందు గల తీవ్రమైన కుతూహలంతో, యమునా నది తీరంలో రమణీయమైన పొదరింటికి వెళుతున్న శ్రీకృష్ణుడిని చూసి... తన చేతితో ఆయన ధరించిన పట్టు వస్త్రం (పీతాంబరం) చెంగును పట్టుకుని తన వైపునకు ప్రణయపూర్వకంగా లాగింది.

## 6. చరణం: భావార్థం

రాసక్రీడా మహోత్సవంలో గోపికలు తాళాలు వేస్తూ, నృత్యం చేస్తూ శ్రీకృష్ణుడి మురళీగానానికి ఏ విధంగా ప్రతిస్పందిస్తున్నారో మరియు వారి నృత్యాన్ని చూసి శ్రీకృష్ణుడు ఎలా ప్రశంసించాడో సఖి రాధకు వివరించే సందర్భమిది.

**కర తల తాళ తరళ వలయావళి కలిత కలస్వన వంశే ।**

**రాసరసే సహ నృత్య పరా హరిణ యువతీ ప్రశశంసే ॥ 6 ॥**

ప్రతిపదార్థం - కలస్వన వంశే = మధురమైన ధ్వనిని వెలువరించే మురళి (వేణువు) ఊదుచుండగా; కర తల తాళ = చేతులతో వేసే తాళ దెబ్బల వలన; తరళ = కదులుతున్న / అటుఇటు ఊగుతున్న; వలయావళి = గాజుల సమూహముల (గాజుల తలల) చేత; కలిత = ఉత్పన్నమైన / ఏర్పడిన (సందడి కలిగిన); రాస రసే = రాసక్రీడా రసమయ వాతావరణంలో; సహ నృత్య పరా = ఆయనతో (శ్రీకృష్ణుడితో) కలిసి నృత్యం చేయుటయందు ఆసక్తురాలైన; యువతీ = ఒక గోపకాంతను; హరిణా = శ్రీకృష్ణుని చేత; ప్రశశంసే = (ఆమె నృత్య కౌశలానికి మెచ్చి) ప్రశంసించబడెను / మెచ్చుకోబడెను.

**విశేషాలు** - సంగీత-నాట్య కళల సమ్మేళనం: ఈ చరణంలో వేణుగానం (వంశే), హస్త తాళం (కరతల తాళ), కంకణ ధ్వని (వలయావళి స్వన) మరియు నృత్యం (నృత్య పరా) - ఈ నాలుగు లలిత కళల అద్భుత సమ్మేళనాన్ని జయదేవుడు వర్ణించారు.

**శబ్దాలంకారం (అనుప్రాస):** "తాళ - తరళ - వలయావళి - కలిత - కలస్వన" అనే దీర్ఘ సమాస పదం వేగవంతమైన

లయబద్ధమైన నాట్యానికి, గాజుల ఘల్లనల చప్పుడుకు ప్రతిబింబంగా శ్రవణ సుభగత్వాన్ని ఇస్తుంది.

**భగవదనుగ్రహం (ప్రశంస):** నృత్యం చేస్తున్న గోపికను కృష్ణుడు ప్రశంసించడం అంటే – భక్తుడు ఆత్మ సమర్పణతో చేసే సేవను / భక్తిని భగవంతుడు ప్రీతితో స్వీకరించి అనుగ్రహించడమే అనే ఆధ్యాత్మిక అంతరార్థం ఇందులో నిమిషితమై ఉంది.

**తాత్పర్యం** - శ్రీకృష్ణుడు తన వేణువుపై మధురమైన మురళీగానం చేస్తుంటే... ఆ రాసక్రీడా రసమయ వాతావరణంలో ఒక గోపిక ఆయన గానానికి అనుగుణంగా చేతులతో తాళం వేస్తూ నృత్యం చేస్తోంది. ఆమె చేతుల తాళ గతికి అనుగుణంగా చేతులకున్న గాజుల సమూహం ఘల్లుఘల్లున శ్రవణపేయ మైన శబ్దాలు చేస్తోంది. అలా తనతో కలిసి తన్మయత్వంతో నృత్యం చేస్తున్న ఆ గోపిక నాట్య కౌశలాన్ని చూసి శ్రీకృష్ణుడు ఎంతో మెచ్చుకుని ఆమెను ప్రశంసించాడు.

## 7. చరణం: భావార్థం

బృందావనంలో సాగుతున్న రాసక్రీడలో శ్రీకృష్ణుడు ఏకకాలంలో ఎందరో గోపికలకు తన దివ్య లీలల ద్వారా ఆనందాన్ని పంచుతూ, వారందరితో ఎలా విహరిస్తున్నాడో సఖి రాధకు వివరిస్తున్న సందర్భమిది.

**శ్లిష్యతి కామపి చుంబతి కామపి రమయతి కామపి రామాం ।**
**పశ్యతి సస్మిత చారు తరామపరామనుగచ్ఛతి వామామ్ ॥ 7 ॥**

ప్రతిపదార్థం - కామ్ అపి = ఒకానొక గోపికను; శ్లిష్యతి = ఆలింగనము చేసుకుంటున్నాడు (కౌగిలించు కుంటున్నాడు); కామ్ అపి = మరొక గోపికను; చుంబతి = ముద్దు పెట్టుకుంటున్నాడు; కామ్ అపి రామామ్ = ఇంకొక సుందరియైన గోపికను; రమయతి = (శృంగార విలాసాలతో) ఆనందింప జేస్తున్నాడు; సస్మిత చారు తరామ్ = చిరునవ్వుతో అత్యంత సుందరంగా ఉన్న; అపరామ్ = వేరొక గోపికను; పశ్యతి = చూస్తున్నాడు; వామామ్ = (తన పట్ల) ప్రణయ కోపంతో ఎదురుతిరిగిన / అందమైన మరొక గోపికను; అనుగచ్ఛతి = అనుసరించి వెళ్తున్నాడు (ఆమె వెనుకనే వెళ్తున్నాడు).

**విశేషాలు** - యోగమాయా విశేషం (విభూతి తత్త్వం): ఒక్కడే అయిన శ్రీకృష్ణుడు ఏకకాలంలో అనేకమంది గోపికల కోరికలను తీరుస్తూ, ప్రతి ఒక గోపికకు "కృష్ణుడు నా దగ్గరే ఉన్నాడు" అనే భావాన్ని కలిగించడం ఆయన యొక్క దివ్య ప్రసిద్ధ లీల (రాసలీల).

**అనుప్రాసల ఆనందం:** "శ్లిష్యతి కామపి, చుంబతి కామపి, రమయతి కామపి" అనే శబ్దాల పునరావృత్తి (అనుప్రాస) కవితకు అద్భుతమైన నృత్య లయను, నాద సౌందర్యాన్ని తెచ్చిపెట్టింది.

**నాయికల వివిధ భావాలు:** ఇందులో ప్రసన్నులైన గోపికలతో పాటు, ప్రణయ కోపం చూపే "వామా" (మానవతి) ను కూడా కృష్ణుడు అనుసరించడం ఆయన భక్త పరాధీనతను సూచిస్తుంది.

**తాత్పర్యం** - శ్రీకృష్ణుడు ఒక గోపికను ఆలింగనం చేసుకుంటున్నాడు;మరొకగోపికనుముద్దుపెట్టుకుంటున్నాడు; వేరొక సుందరిని శృంగార లీలలతో అలరిస్తున్నాడు; చిరునవ్వుతో ఎంతో అందంగా ఉన్న ఇంకొక గోపికను కడకంటి చూపులతో చూస్తున్నాడు; ప్రణయ కోపంతో పక్కకు తప్పుకున్న మరొక మానవతి వెనుకే ఆమెను బుజ్జగించడానికి అనుసరించి వెళ్తున్నాడు. ఈ విధంగా ఆయన అనేక రూపాలతో గోపికలందరినీ ఆనందపరుస్తున్నాడు.

## 8. చరణం: భావార్థం

ఈ అష్టపది ముగింపులో కవి జయదేవుడు ఈ దివ్య ప్రబంధం యొక్క మహిమను, ఇది పాఠకులకు మరియు శ్రోతలకు కలిగించే శుభాలను (ఫలశ్రుతిని) ఆశీర్వచన రూపంలో అందిస్తున్నారు.

**శ్రీ జయదేవ భణితమిద మద్భుత కేశవ కేళి రహస్యం ।**
**బృందావన విపినే లలితం వితనోతు శుభాని యశస్యమ్ ॥ 8 ॥**

ప్రతిపదార్థం - శ్రీ జయదేవ భణితమ్ = శ్రీ జయదేవ కవిచే చెప్పబడిన / రచించబడిన; బృందావన విపినే = బృందావనమనే పుణ్య అడవిలో (వనంలో) జరిగిన; అద్భుత = ఆశ్చర్యకరమైన / దివ్యమైన; కేశవ కేళి రహస్యమ్ = శ్రీకృష్ణుని (కేశవుని) శృంగార రాసక్రీడల గుహ్యార్థాన్ని / రహస్యాన్ని వర్ణించే; ఇదమ్ = ఈ (అష్టపది / కావ్య సమూహము); లలితమ్ = సుందరమైనది మరియు మధురమైనదై; యశస్యమ్ = (సజ్జనులకు / భక్తులకు) కీర్తిని కలిగించేదిగా; శుభాని = అఖండమైన శుభాలను / మంగళాలను; వితనోతు = విస్తరింపజేయుగాక! (వ్యాపింపజేసి ప్రసాదించుగాక!).

**విశేషాలు** - ఫలశ్రుతి ప్రాశస్త్యం: సంస్కృత కావ్య సంప్రదాయంలో ప్రబంధం చివరిలో ఫలశ్రుతిని చెప్పడం ఆనవాయితీ. జయదేవుడు ఈ అష్టపదిని గానం చేసేవారికి మరియు వినేవారికి శుభం (సకల మంగళాలు) మరియు యశస్సు (మంచి పేరు/కీర్తి) సిద్ధించాలని ఆకాంక్షించారు.

**కేళి రహస్యమ్ (ఆధ్యాత్మిక అంతరార్థం):** ఇక్కడ "కేశవ కేళి రహస్యమ్" అని వాడడంలో గల రహస్యం ఏమిటంటే — ఇది కేవలం ప్రాకృతమైన శృంగార వర్ణన కాదు; సచ్చిదానంద

స్వరూపుడైన పరమాత్మ (కృష్ణుని) తో ముక్త జీవులైన జీవాత్మల (గోపికల) పరమ సమాగమాన్ని సూచించే దివ్య తత్త్వం.

**మధుర భక్తి ముగింపు:** ఈ 8వ చరణంతో 4వ అష్టపది సంపూర్ణమవుతుంది. దీని ద్వారా జయదేవుడు లౌకిక కామ వికారాలను నశింపజేసి, దివ్యమైన మాధుర్య భక్తిని ప్రతిష్ఠించారు.

**తాత్పర్యం** - శ్రీ జయదేవ కవిచే అత్యంత మధురంగా రచించబడినది, బృందావనంలో శ్రీకృష్ణుడు గోపికలతో జరిపిన అద్భుతమైన లీలా వినోదాల (రాసక్రీడల) దివ్య రహస్యాన్ని వర్ణించేది అయిన ఈ లలిత కావ్య భాగం... పాఠకులకు, శ్రోతలకు అఖండమైన మంగళాలను, సుఖసంతోషాలను మరియు సమాజంలో ఉన్నతమైన యశస్సును (కీర్తిని) ప్రసాదించుగాక!

**భావం** - ఇక్కడ చిన్న విషయాన్ని గమనించాలి. ప్రతి ప్రాణి, భగవంతుడిని అన్వేషిస్తూ, ధ్యానిస్తూ, తమకు అత్యంత ఆప్తుడు భగవంతుడేనని భావిస్తూ, తమ కష్టాలను నివారించమని, జ్ఞానాన్ని ప్రసాదించి, మంచి నడవడిక ఇవ్వమని, తమకి తోడూ- నీడగా ఉండమని, భగవంతుడికై తపిస్తూ ఉంటుంది. సూక్ష్మంగా, ఆత్మ తన మజిలీ అయిన పరమాత్మకై అతని ప్రేమకై, అనుగ్రహానికై తపిస్తుంది. అయితే అందరికీ ఆధ్యాత్మికంగా అంత స్థాయి, పరిణితి ఉండకపోవచ్చు. భగవంతుడు కరుణామూర్తి కనుక "యద్భావం తద్భవతి" అంటే, ఎలా ఎవరు కోరుకుంటారో, అలా అనుగ్రహిస్తాడు. ఎంతో గొప్పదయిన ఈ రహస్యం, సులభంగా మనకు అర్థం కావడానికి, జయదేవకవి గోపికల పరంగా, రాధ పరంగా రచించి మనకు అందించారు.

అందుకే, కేవలం ఈ కావ్యాన్ని, కేవలం శృంగార పరంగా కాక, ఆధ్యాత్మిక పరంగా అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. మరి భగవంతుడు మనను సరిగ్గా అనుగ్రహించడం లేదని, తన పక్కవారినే చక్కగా వెన్నంటి కాపాడతాడని, కోరిన కోరికలన్నీ తీర్చట్లేదని, ఆయన మీద అలిగేస్తాం కదా! ఇదే భావం రాధ పరంగా చెబుతున్నారు కవి. కృష్ణుడు అందరు స్త్రీలను, తనతో సమానంగా భావించడం, రాధకు ఈర్ష్య కలిగించింది. తను, మిగిలిన గోపికలు సమానం ఎలా అవుతారు. తన పట్ల ఎక్కువ ప్రేమ చూపించాలి కదా! అందుకే అలిగి, ఒక పొదరింట చేరి, దుఖంతో, తన చెలికత్తెతో ఇలా అంటున్నది...

## 11 వ శ్లోకం భావార్థం

(4వ అష్టపది ముగిసిన వెంటనే వసంత విలాసాన్ని సమగ్రంగా ఉపసంహరిస్తూ, కృష్ణ సౌందర్యాన్ని శిఖరాగ్ర స్థాయిలో వర్ణించే శ్లోకం).

సఖి (చెలికత్తె) రాధతో వసంత రుతువులో గోపికలతో కూడి విహరిస్తున్న శ్రీకృష్ణుని అలౌకిక రూపాన్ని, శృంగార మూర్తిత్వాన్ని వర్ణించి చెబుతున్న సన్నివేశమిది.

**విశ్వేషామనురంజనేన జనయన్నానందమిందీవర**
**శ్రేణీ శ్యామల కోమలై రుపనయన్నంగైరనంగోత్సవం ।**
**స్వచ్ఛందం వ్రజ సుందరీభిరభితః ప్రత్యంగమాలింగితః**
**శృంగారః సఖి మూర్తిమానివ మధౌ ముగ్ధో హరిః క్రీడతి ॥11॥**

ప్రతిపదార్థం - సఖి = ఓ చెలీ! (ఓ రాధా!); మధౌ = ఈ వసంత రుతువు నందు (చైత్ర-వైశాఖ మాసములలో); విశ్వేషామ్ = సమస్త లోకాలకు / సకల జనులకు; అనురంజనేన = ఆనందాన్ని / అనురాగాన్ని కలిగిస్తూ; ఆనందమ్ జనయన్ = నిరతిశయమైన ఆనందాన్ని పుట్టిస్తూ; ఇందీవర శ్రేణీ = నల్ల కలువల (కమలాల) వరుసల వలె; శ్యామల = నల్లనైనట్టియు; కోమలైః = సుకుమారమైనట్టియు; అంగైః = తన శరీర అవయవములతో; అనంగ ఉత్సవమ్ = మన్మథోత్సవాన్ని (కామోత్సవాన్ని / శృంగార రసోత్సవాన్ని); ఉపనయన్ = సమాకృష్టి చేస్తూ / తీసుకువస్తూ; వ్రజ సుందరీభిః = గోకులంలోని అందమైన గోపికల చేత; అభితః = నలువైపులా; స్వచ్ఛందమ్ = తమ స్వేచ్ఛానుసారముగా (తమ ఇష్టమొచ్చినట్లు); ప్రత్యంగమ్ = (ఆయన) ప్రతి అవయవాన్ని; ఆలింగితః = ఆలింగనము చేసుకోబడినవాడై; ముగ్ధః = అత్యంత మనోహరుడైన; హరిః = శ్రీకృష్ణుడు; మూర్తిమాన్ శృంగారః ఇవ = మూర్తీభవించిన (రూపమెత్తిన) శృంగార రసమో అన్నట్లుగా; క్రీడతి = లీలగా విహరిస్తున్నాడు / ఆడుకుంటున్నాడు.

**విశేషాలు - ఉత్ప్రేక్షా అలంకారం:** "శృంగారః మూర్తిమాన్ ఇవ" (శృంగార రసమే సాక్షాత్తు ఒక రూపాన్ని ధరిస్తే ఎలా ఉంటుందో శ్రీకృష్ణుడు అలా ఉన్నాడు) అని కవి వర్ణించడం ఇందులో విశేషమైన అలంకార శోభను తెచ్చిపెట్టింది.

**ఉపమా సౌందర్యం:** శ్రీకృష్ణుని నల్లని, మృదువైన దేహాన్ని "ఇందీవర శ్రేణీ" (నల్ల కలువల వరుస) తో పోల్చడం ద్వారా ఆయన అప్రాకృత శ్యామల సౌందర్యం దృశ్యమానమవుతుంది.

**రస పోషణ:** నవరసాలలో రాజైన 'శృంగార రసాని'కి శ్రీకృష్ణుడే అధిదైవం. లౌకిక కామానికి అతీతమైన దివ్య రసానుభూతిని జయదేవుడు ఈ శ్లోకంలో పరాకాష్ఠకు చేర్చారు.

**శ్లోక ఛందస్సు:** ఇది శార్దూలవిక్రీడిత వృత్తంలో నడిచే అత్యంత గాంభీర్యమైన, శ్రవణసుభగమైన శ్లోకం.

**తాత్పర్యం** - ఓ రాధా! ఈ వసంత కాలంలో మధుర మనోహరుడైన శ్రీకృష్ణుడు సమస్త లోకాలకు అనంతమైన

ఆనందాన్ని పంచుతున్నాడు. నల్ల కలువల సమూహం వలె నల్లనై, అత్యంత సుకుమారంగా ఉన్న తన దేహ కాంతులతో మన్మథుని ఉత్సవాన్నే కళ్లముందు సాక్షాత్కరింపజేస్తున్నాడు. వ్రజ సుందరీమణులైన గోపికలు ఆయన నలువైపులా చేరి, తమ స్వేచ్ఛానుసారం ఆయన ప్రతి అవయవాన్ని మైమరచి ఆలింగనం చేసుకుంటున్నారు. ఆ శ్రీహరిని చూస్తుంటే స్వయంగా శృంగార రసమే రూపం దాల్చి (మూర్తీభవించి) బృందావనంలో క్రీడిస్తున్నాడా అన్నట్లుగా ఉంది!

## 12 వ శ్లోకం భావార్థం

వసంత రుతువు ప్రవేశించిన వేళ మలయ పవనాలు (చందన శైల వాయువులు), మామిడి పూత మరియు కోకిలల మధుర కూజితాలు విరహుల హృదయాలలో ప్రణయ భావాన్ని ఏ విధంగా ఉత్తేజపరుస్తున్నాయో సఖి రాధతో వర్ణించి చెప్పే సన్నివేశమిది.

**నిత్యోత్సంగ వసద్భుజంగ కబల క్లేశాదివేశాచలం**
**ప్రాలేయ ప్లవనేచ్ఛయాఽనుసరతి శ్రీఖండ శైలానిలః ।**
**కించ స్నిగ్ధ రసాల మౌళి ముకుళాన్యాలోక్య హర్షోదయా**
**దున్మీలంతి కుహూః కుహూరితి కలోత్తాలాః పికానాం గిరః ॥12॥**

ప్రతిపదార్థం - శ్రీఖండ శైల అనిలః = మలయ పర్వతం (చందన పర్వతం) పై నుండి వీచే మలయ మారుతం (గాలి); నిత్య ఉత్సంగ = ఎల్లప్పుడూ తన ఒడిలో / తొడలపై; వసత్ భుజంగ = నివసించే సర్పాల (పాముల) యొక్క; కబల క్లేశాత్ ఇవ = పీల్చివేయు వేడి శ్వాసల (విషజ్వాలల) బాధ వలన; ప్రాలేయ ప్లవన ఇచ్ఛయా = మంచు కొండలైన హిమవత్పర్వత మంచు నీటిలో స్నానం చేయాలనే కోరికతో; ఈశ అచలమ్ అనుసరతి = శివుడు నివసించే కైలాస / హిమాలయ పర్వతం వైపు ప్రయాణిస్తోంది; కించ = అంతేకాకుండా; పికానామ్ గిరః = కోకిలల యొక్క గానాలు / కూజితాలు; స్నిగ్ధ రసాల మౌళి ముకుళాని = పసిమిదేరిన మామిడి చెట్ల కొమ్మల చివర్లలో వికసిస్తున్న చిగుళ్లను / మొగ్గలను; ఆలోక్య = చూసి; హర్ష ఉదయాత్ = ఉద్భవించిన ఆనంద పారవశ్యం వలన; కుహూః కుహూః ఇతి = 'కుహూ కుహూ' అనే మధుర శబ్దాలతో; కల ఉత్తాలాః = గంభీరమైన మధుర ధ్వనులతో; ఉన్మీలంతి = అంతటా ప్రతిధ్వనిస్తున్నాయి / వెలువడుతున్నాయి.

**విశేషాలు - ఉత్ప్రేక్షాలంకారం:** దక్షిణం నుండి ఉత్తరానికి వీచే చందన పవనాలను కవి "పాముల వేడికి తట్టుకోలేక హిమాలయాల్లో స్నానానికి వెళ్తున్నాయి" అని వర్ణించడం జయదేవుని అత్యున్నత ఊహాశక్తికి (ఉత్ప్రేక్షకు) గొప్ప నిదర్శనం.

**కవి సమయం:** సంస్కృత సాహిత్య సంప్రదాయంలో చందన వృక్షాలను సర్పాలు చుట్టుముట్టి ఉంటాయని, వసంత కాలంలో వీచే మలయ పవనాలు విరహులకు కామ తాపాన్ని కలిగిస్తాయని వర్ణించడం ప్రసిద్ధ 'కవి సమయం'.

**ప్రథమ సర్గ ముగింపు:** ఈ శ్లోకంతో ప్రథమ సర్గము 'సమోద దామోదరః' పూర్తవుతుంది. వసంత రుతువు ప్రకృతి శోభను సమగ్రంగా వర్ణించిన తర్వాత, రాధాకృష్ణుల ప్రణయ విరహ ఘట్టాలకు ఈ శ్లోకం నాంది పలుకుతుంది.

**ఛందస్సు:** ఇది శార్దూలవిక్రీడిత వృత్తంలో రచింపబడింది.

**తాత్పర్యం** - మలయ పర్వతంపై వీచే చందన పవనాలు తమ చుట్టూ అల్లుకుని ఉండే సర్పాల శ్వాసల తాపానికి (వేడికి) తాళలేక, హిమాలయాల మంచు నీటిలో తడిసి చల్లబడాలనే కోరికతో దక్షిణం నుండి ఉత్తరం వైపు (కైలాసం వైపు) వీస్తున్నాయో అన్నట్లుగా మలయమారుతం చల్లగా వీస్తోంది. మరోవైపు, మామిడి కొమ్మలపై నూతనంగా వికసించిన చిగుళ్లను చూసి ఉప్పొంగిన ఆనందంతో కోకిలలు 'కుహూ కుహూ' అంటూ సప్తస్వరాలలో మధురంగా కూస్తూ వసంత శోభను దిశలన్నిటా నింపుతున్నాయి.

## 13 వ శ్లోకం భావార్థం

జయదేవ మహాకవి విరచిత 'గీత గోవిందం' కావ్యంలోని ప్రథమ సర్గం (సమోద దామోదరః) నందు వసంత విలాస ఘట్టాన్ని మంగళాశాసనంతో సంపూర్ణంగా ఉపసంహరించే 13 వ శ్లోకం (ప్రథమ సర్గ ముగింపు శ్లోకం) ఇది.

రాధాదేవి శ్రీకృష్ణుడి గానాన్ని మెచ్చుకుంటున్నట్లు నటిస్తూ, ప్రణయ పారవశ్యంతో ఆయనను గాఢంగా ఆలింగనం చేసుకుని ముద్దుపెట్టుకున్న మనోహర దృశ్యాన్ని కవి వర్ణిస్తూ శ్రోతలకు భగవదనుగ్రహాన్ని (మంగళాశాసనాన్ని) ప్రార్థిస్తున్నారు.

**రాసోల్లాస భరేణ విభ్రమ భృతామాభీర వామ భ్రువా**
**మభ్యర్ణం పరిరభ్య నిర్భరమురః ప్రేమాంధయా రాధయా ।**
**సాధు త్వద్వదనం సుధామయమితి వ్యాహృత్య గీత స్తుతి**
**వ్యాజాదుత్కట చుంబితః స్మిత మనోహారీ హరిః పాతు వః ॥13॥**

ప్రతిపదార్థం రాస ఉల్లాస భరేణ = రాసక్రీడ యొక్క మితిమీరిన ఆనందోత్సాహముతో; విభ్రమ భృతామ్ = శృంగార విలాసాలను అభినయిస్తున్న; ఆభీర వామ భ్రువామ్ = గోపకాంతల (గోపికల); అభ్యర్ణమ్ = సమీపమునకు (శ్రీకృష్ణుడి దగ్గరకు); ప్రేమ అంధయా = ప్రేమాతిశయము చేత పరవశించిన (ప్రేమతో మైమరచిన); రాధయా = రాధాదేవి చేత; ఉరః = (శ్రీకృష్ణుని) వక్షఃస్థలాన్ని; నిర్భరమ్ పరిరభ్య = గట్టిగా / హృదయానికి హత్తుకునేలా ఆలింగనం చేసుకొని; త్వత్ వదనమ్ = నీ (శ్రీకృష్ణుని) ముఖము;



సాధు = ఎంతైనా సుందరమైనది!; సుధామయమ్ ఇతి = అమృతమయమైనది! అని; గీత స్తుతి వ్యాజాత్ = (ఆయన) గానాన్ని మెచ్చుకుంటున్నారనే నెపంతో (వ్యాజముతో); వ్యాహృత్య = పలికి; ఉత్కట చుంబితః = గాఢముగా ముద్దుపెట్టుకోబడినవాడును; స్మిత మనోహారీ = చిరునవ్వుతో (మందహాసంతో) హృదయాలను దోచుకునేవాడునైన; హరిః = శ్రీకృష్ణుడు; వః = మిమ్ములను (భక్తులను / శ్రోతలను); పాతు = రక్షించుగాక! / కాపాడుగాక!

**విశేషాలు** - మంగళాశాసనం (ఫలశ్రుతి): శ్లోకం ముగింపులో "హరిః పాతు వః" (శ్రీహరి మిమ్ము రక్షించుగాక) అని చెప్పడం ద్వారా కవి మొదటి సర్గను అభీష్టసిద్ధినిచ్చే మంగళ ప్రార్థనతో ముగించారు.

**వ్యాజ స్తుతి / చమత్కారం:** రాధాదేవి నేరుగా ముద్దుపెట్టుకోకుండా "నీ పాట చాలా బాగుంది, నీ ముఖం అమృతమయం" అని పొగుడుతున్నట్లు నటిస్తూ (గీత స్తుతి వ్యాజాత్) ముద్దుపెట్టుకోవడం నాయిక యొక్క శృంగార చతురతను, అమాయక ప్రణయాతిశయాన్ని ప్రతిబింబిస్తుంది.

**ప్రథమ సర్గ సమాప్తి:** ఈ 13వ శ్లోకంతో 'సమోద దామోదరః' (ఆనందభరితుడైన శ్రీకృష్ణుడు) అనే ప్రథమ సర్గము సంపూర్ణమైనది.

**ఛందస్సు:** ఇది శార్దూలవిక్రీడిత వృత్తంలో రచింపబడిన మనోహరమైన శ్లోకం.

**తాత్పర్యం** - రాసక్రీడ యొక్క అమిత ఆనందోత్సాహంతో గోపికలందరూ శృంగార విలాసాలు ప్రదర్శిస్తూ విహరిస్తున్నారు. ఆ సమయంలో ప్రేమాతిశయంతో మైమరిచిన రాధాదేవి శ్రీకృష్ణుడి సమీపానికి వచ్చింది. ఆయన వక్షఃస్థలాన్ని తన హృదయానికి హత్తుకుని గట్టిగా ఆలింగనం చేసుకుంది. "కృష్ణా! నీ ముఖము ఎంత సుందరమైనది! నీ గానం అమృతం వలె ఎంతో మధురంగా ఉంది!" అని ఆయన పాటను ప్రశంసిస్తున్నట్లు వ్యాజం (నెపం) చేస్తూ, ఆయనను గాఢంగా ముద్దుపెట్టుకుంది. అలా రాధాదేవి ప్రియమైన వ్యాజ ముద్దుకు అలరి, మందహాసంతో మనస్సులను దోచుకునే ఆ శ్రీకృష్ణుడు మిమ్మల్ని (శ్రోతలను) ఎల్లవేళలా కాపాడుగాక!

**ప్రత్యేకతలు:**

- ఈ ముగ్ధలు తక్కువవారు కారు. కేళిపరే (ఆటలలో గొప్పతనం కలవారు) అంటున్నాడు జయదేవుడు. ఒక్కో చరణంలో ఒక్కో ఆట ఆడారు. స్వామిని ఆటాడించారు.
- మొదటి చరణంలో వాళ్ళు ఆడిన ఆటతో స్వామికి చిరునవ్వు కలిగింది. రత్నకుండలాలు కదిలాయి. ఆదేమి ఆటో... కళ్ళు మూసుకొని కృష్ణ భగవానుని తలుచుకొంటే జవాబు లభిస్తుంది.
- రెండో చరణంలో ఆట - స్వామికి దగ్గరగా చేరి గొంతులో గొంతు కలపటం.
- మూడో చరణంలో ఆట - కళ్లు తిప్పటం. స్వామి కూడా ఆ ఆటాడుతూ నృత్యం చేస్తున్నాడు. కళ్ళు తిప్పటం అనే చర్య అద్భుతమైన వర్ణన. లక్ష పదాలు చెప్పలేని అర్థాన్ని విలాసంగా తిప్పుతున్న కళ్లు చెబుతాయి రసాన్ని ఊహించుకొన్నవారికి ఊహించుకొన్నంత జయదేవ!
- నాలుగవ చరణంలో ఆట - పెదవులు తాము మాట్లాడకుండా, మన్మథుడిని ఇద్దరి మధ్య మాట్లాడించే ఆట.
- అయిదవ చరణంలో ఆట - దాగుడు మూతలాట. దాగిన రహస్యాలపై పరిశోధన చేసే ఆట.
- ఆరవ చరణంలోని ఆట - అనుకరణ (మిమిక్రీ) ఆట. మిగతా ఆటలలో 'కృష్ణమూర్తి' ప్రకాశించాడు. విహరించాడు ఎక్కడా ఎవరిని పొగడలేదు. ఈ అనుకరణ ఆట ఆడే ముగ్ధను మాత్రం పొగిడాడు. అంత గొప్పగా ఆడింది ఈ ముగ్ధ.
- ఇక ఏడవ చరణంలోని ఆటలు - మన్మథుడి జయపతాకల రెపరెపలు. ఆరు చరణాల దాక, అయ్య వారిని ముగ్ధలు ఆడించారు.
- ఏడవ చరణంలో ఆటలు నేర్పిన ముగ్ధలనే గురువులకు కిట్టయ్య అనే శిష్యుడు తాను నేర్చిన అన్ని ఆటల ప్రదర్శన చేసి గురు ఋణం తీర్చుకొన్నాడు.
- అద్భుత క్రీడల రహస్యాలు తెలిపిన జయదేవ కవికి వందనములు.

**ఇతి శ్రీ జయదేవకృతౌ గీతగోవిందే ।**
**సామోదదామోదరో నామ ప్రథమస్సర్గః ॥**

సామోద దామోదరన్: రోలుకు తనను కట్టివేసిన తల్లికి ఆనందాన్నిచ్చేవాడు.

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## భవిష్యోత్తర పురాణాంతర్గతం

గత సంచిక తరువాయి

### శ్రీనివాసుడు పుట్టలో ప్రవేశించుట

శ్రీనివాసుడు ఈ విధంగా వెతుకుతుండగా స్వామి పుష్కరిణికి దక్షిణ తీరంలో నిర్మలమైన, దివ్యమైన పుట్ట కనబడింది. జగత్ప్రభువైన భగవానుడు చింతచెట్టుక్రింద ఉన్న ఆ పుట్టను చూసి సంతోషించి ఇదే తనకు మంచి చోటని భావించి దానిలో ప్రవేశించాడు. భగవంతుడు ఆ పుట్టలో పదివేల సంవత్సరాలున్నాడు. ద్వాపరయుగం దాటి ఇరవై ఎనిమిదవ కలియుగంలో ఒక సంవత్సరం గడువగా నృపశ్రేష్ఠుడైన చోళరాజు నాగకన్యకు జన్మించి భూమిని పరిపాలిస్తున్నాడు.

అతని పరిపాలనలో రాజ్యమంతా సుభిక్షంగా ఉంది. ఆవులు పాలనధికంగా యిస్తున్నాయి. కుమారులు తల్లిదండ్రుల యందు గౌరవంతో ఉన్నారు. సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి. పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. స్త్రీలందరూ పతివ్రతలుగా ఉన్నారు. పురుషులు ఏకపత్నీవ్రతులై ఉన్నారు. రాజు ఈ విధంగా రాజ్యపరిపాలన చేస్తుండగా ప్రజలు ఆనందంతో ఉన్నారు.

### బ్రహ్మాది దేవతల రాక

అంతట సాక్షాత్తు బ్రహ్మదేవుడు ధేనురూపాన్ని పొందాడు. లక్ష్మీదేవి ఆ ఆవువెంట గోపాలిక వేషం ధరించింది. శివుడు దూడరూపం పొందాడు. లక్ష్మీదేవి గొల్లభామ రూపంలో ఆ ఆవు దూడలను వెంటబెట్టుకొని తన భర్త మార్గాన్ని అన్వేషిస్తు చోళరాజు వద్దకు వెళ్ళింది.

మహాలక్ష్మి ఆవుదూడను వెంటబెట్టుకొని చోళరాజు గృహానికి వెళ్ళి వాటిని రాజుకు ధనానికి విక్రయించి ఆమె స్వస్థలానికి వెళ్ళింది. చోళరాజు ప్రీతితో ఆవుదూడను స్వీకరించి చాలా సంతోషించాడు. ఎక్కువ పాలిచ్చే ఆ గోవును ఆయన తన పుత్రుని పాలకై నియోగించాడు.

ఆ తరువాత ఆ ధేనువు రాజుగారి వేలకొలది ఆవులతోపాటు వేంకటాచలానికి వెళ్ళి ప్రతిరోజు లక్ష్మీపతిని వెదుకుతూ ఆ కొండంతా తిరుగుతున్నది. అక్కడక్కడా నేలను వాసన చూస్తూ ఆ ధేనురూపంలో ఉన్న బ్రహ్మదేవుడు ఆ కొండపై శ్రీహరిని అన్వేషిస్తూ ఉన్నాడు. ఈ విధంగా చాలాకాలం గడువగా చివరకు స్వామి పుష్కరిణీ తీరంలో ఉన్న పుట్టలో శ్రీహరి ఉన్నాడని తెలుసుకుని బ్రహ్మదేవుడు మనసులో సంతోషించాడు.

బ్రహ్మ ఆ పుట్టనంతా పాలతో తడిపాడు. అప్పటి నుండి ప్రతిరోజు రాజుగారి ఆవుల మందతోపాటు కొండపైకి వెళ్ళి ధేనురూపంలో ఉన్న పితామహుడైన బ్రహ్మదేవుడు ఆ పుట్టవద్దకు వెళ్ళి జగన్నాథుని ప్రీతికొరకు ఆ పుట్టను భక్తితో పాలతో తడుపుతున్నాడు. తిరిగి ఇంటికివచ్చిన తరువాత ఆ ఆవు పాలివ్వడం లేదు.

ఇలా కొంతకాలం గడువగా చోళరాజు భార్య స్వయంగా గోపాలకుని పిలిచి ఇలా అన్నది. ఓ గోపాలకా! దుర్బుద్ధీ! ఆవుపాలనేం జేస్తున్నావురా? నీవు తాగుతున్నావా లేక దూడ తాగుతున్నదా? నాకు వెంటనే బదులు చెప్పు' అని అడుగగా ఆ గోపాలకుడు భయంతో వణకుతూ గద్గదస్వరంతో నెమ్మదిగా రాజుగారి భార్యతో ఇలా అన్నాడు. 'అమ్మా! నాకేమీ తెలియదు. నేను పాలు తాగడం లేదు. దూడ తాగుతున్నదా లేక ఆవే స్వయంగా తాగుతున్నదో నేనెరుగను. నేను నిజం చెబుతున్నాను. మీరే విచారించండి' అన్నాడు.

గోపాలకుని మాటలు విని రాజుగారి భార్య కోపంతో గుడ్లు నురిమి తోలుతో చేసిన తాళ్ళతో అతనిని కొట్టింది. ఆ మరునాడు ఆ గోపాలకుడు ఆవుమెడకు కాలికి కట్టిన తాడును వదలి దానివెంట బయలుదేరాడు. ఆ ధేనువు పుట్ట దగ్గరికి వెళ్ళి శ్రీహరి నివసిస్తున్న దివ్యమైన ఆ పుట్టను తన పొదుగునుండి కారుతున్న పాలధారలతో తడిపింది. దాన్ని చూచిన గోపాలకుడు కోపంతో గొడ్డలినెత్తి దాన్ని చంపుటకై ఉద్యమించాడు.

వెంటనే ఆ పుట్టలో నున్నటువంటి శ్రీనివాసుడు భక్తవాత్సల్యాన్ని ప్రదర్శిస్తూ 'తమను తాము రక్షించుకోవడానికి తమ భక్తులను హింసిస్తున్నప్పటికీ చూస్తూ ఊరకునేవారు చంద్రుడు, నక్షత్రాలున్నంతవరకు నరకాన్ననుభవిస్తారు కదా!' అనుకొన్నాడు. 'నాకోసం పాలిస్తున్న ఈ గోవును ఈ దుర్మార్గుడు గొడ్డలితో చంపబోతున్నాడు గదా!' అని తలంచి నిరామయుడైన శ్రీనివాసుడు, రమాకాంతుడు 'తులసీదళంతో నన్ను భక్తితో పూజిస్తేనే అతనిని నేను రక్షిస్తాను' అని నేను ప్రతిజ్ఞ చేశాను.

**తులసీ దళమాత్రేణ మామకేనైవ యః పుమాన్ ।**
**పూజయేద్భక్తిభావేన తం రక్షామీతి మత్వ్రణః ॥**

**- భ.పు. అ. 3, శ్లోకం, 39**

'ఈ గోవు నన్ను ప్రతిరోజు పాలధారతో అభిషేకిస్తున్నది' అని గోవిందుడు విచారించి ఆ గోవును రక్షించబోయి ఆ గొడ్డలి దెబ్బకు అడ్డు తగిలాడు. ఆ పదునైన గొడ్డలి దెబ్బకు జగత్పతి అయిన శ్రీనివాసుని తల పగిలి ఏడు తాడిచెట్లు ఎత్తున రక్తం ఎగిసిపడింది. ఆ భయంకర దృశ్యాన్ని చూసి గోపాలుడు మరణించాడు. అతడు చనిపోగా ఆ ధేనువు కొండచరియ దిగి రాజువద్దకు వెళ్ళి తన దూడ చనిపోయినట్లుగా దుఃఖించింది. నేలపై పడి దొర్లింది.

రాజమందిరంలో రాజుగారు తన ఎదుట ఇలా నేలపై పొరలుతూ శోకిస్తున్న గోవును చూచి చారునితో ఇలా అన్నాడు - 'ఓయీ! ఈ ఆవు ఇలా ఎందుకు ఏడుస్తూ నేలపై పడి దొర్లుతున్నది? ఆలమందను విడిచి ఎందుకు వచ్చింది? నీవు ఈ ఆవుతోపాటు వెళ్ళి దీనిని ఆలమందలో కలుపు' అని ఆదేశించాడు. రాజాజ్ఞను విని చారుడు ఆ ఆవు వెంట బయలుదేరి వెళ్ళాడు.

అతడు ఆ ఆవుతోపాటు వేంకటాచలానికి వెళ్ళాడు. అక్కడ పుట్టవద్ద చనిపోయిపడి ఉన్న గోపాలుని చూశాడు. అలాగే పుట్టలో నుండి పైకి వచ్చిన భయంకరమైన రక్తప్రవాహాన్ని చూసి ఆ చారుడు పరుగు పరుగున రాజమందిరానికి వెళ్ళాడు. అతడు రాజుగారికి నమస్కరించి గోపాలుని వృత్తాంతమంతా చెప్పాడు. ఆ గోపాలుడు గొడ్డలితో కొట్టుట వలన పుట్టద్వారం (కన్నం) అంతా రక్తసిక్తమై ఉన్న విషయం కూడా చెప్పాడు.

రాజు అది విని చాలా ఆశ్చర్యపడి పల్లకి ఎక్కి వెంటనే వేంకటాచలానికి వెళ్ళాడు. ఆయన పుట్ట దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు. ''ఈ ఘోరమైన పని చేసిన వాడెవరయ్యా! ఈ వేంకటాచలంలో ఈ పని చేసిన పాపాత్ముడెవరు? గోపాలుని చంపినదెవరు? ఈ పుట్ట రక్తసిక్తమై ఉండటానికేమి కారణం? ఈ గోవు ఇలా ఎందుకు దుఃఖిస్తున్నది? నోరులేని ఈ ఆవు ద్వారా ఈ విషయం ఎలా తెలుస్తుంది?''

చోళరాజు ఈ విధంగా పలుకగా పుట్టలో ఉన్న శ్రీనివాసుడు అదంతా విన్నాడు. వెంటనే ఆ జగత్ప్రభువు పుట్టను ఛేదించుకొని బయటకు వచ్చాడు. మహాపరాక్రమశాలియైన భగవానుడు ఆ శేషశైల శిఖరంపై స్వామి తీర్థానికి దక్షిణంవైపున ఉన్న పుట్టనుంచి శంఖచక్రాలు ధరించి బయటకు వేంచేశాడు. ఆయన కన్నులు కోపంతో ఎర్రబారినాయి. కన్నులనిండా నీరు నిండింది. కళ్ళవెంట వెచ్చని బాష్పాలు (కన్నీళ్ళు) రాలుతున్నాయి. గొంతు గద్గదమైంది. ముఖం కోపంతో ముడుచుకుపోయింది. అప్పుడాయన చోళరాజును ఇలా అతి కఠినంగా మాట్లాడాడు -

## శ్రీనివాసుడు చోళరాజును శపించుట

''ఓరీ దుర్మార్గుడా! నీవు పాపాత్ముడవు. నీకు రాజ్యగర్వంతో మదమెక్కింది. నేను అనాథను, భక్తులు లేనివాడిని, దరిద్రుడను, అడవిలో తిరుగుతున్నవాడిని, తల్లిదండ్రులు లేనివాడిని. భార్య, బంధువులు లేనివాడిని. మంచి సోదరులు లేనివాడిని, అటువంటి నన్ను ఆ గోపాలుడు నిర్దయుడై దుర్మార్గంగా పదునైన గొడ్డలితో కొట్టాడు. రాజా! ఆ దెబ్బవల్ల

నాకు చాలా కష్టం కలిగింది. ఆ బాధతో దుఃఖం వచ్చింది. ఆ గోపాలుని గొడ్డలి దెబ్బవల్ల నేను చాలా బాధపడ్డాను. అది చిన్న దెబ్బ కాదు. ఓ దుర్మతీ! దయలేని ఆ గోపాలుడు నా శిరస్సును పగలగొట్టాడు. ఇంట్లో యజమాని ఏమి జరుగుతున్నదో విచారించకపోతే అతని భార్యాపుత్రాదులు చేసే చెడ్డపనుల వలన అతనికి అనిష్టం కలుగుతుంది. వారి పాపానికి అతడే బాధ్యుడౌతాడు.

**యజమానో గృహే యస్తు న విచారపరోభవేత్ ।**

**స్త్రీ పుత్రాద్యైః కృతం కర్మ తస్యానిష్టకరం విదుః ॥**

**- భ. పు. అ.3, శ్లో. 58, 59**

అని చెప్పి భగవానుడు చోళరాజును ఇలా శపించాడు -

'ఓరీ దుర్బుద్ధీ! నాకు దుఃఖం కలిగించిన పనికి నీవే కారకుడవు కాబట్టి నీవు పిశాచమగుదువుగాక!

**'పిశాచో భవ దుర్బుద్ధౌ! మద్దుఃఖాధాన కర్మణా'**

దేవదేవుడీవిధంగా శపించగా విని ఆ రాజు మూర్ఛపోయాడు. కొంచెం సేపటికి తెప్పరిల్లి లేచి జగత్ప్రభువైన శ్రీనివాసునితో ఇలా అన్నాడు -

'ఓ దేవదేవా! నిరపరాధినైన నన్నెందుకిలా శపించావు? ఓ జగన్నాథా! అనాలోచితంగా నన్ను శపించావేమిటి? నేను నీకేమి అపకారం చేశాను? ఓ లక్ష్మీపతీ! గోపాలుడు నీకు దుఃఖం కలిగించిన విషయం నాకు తెలియదు. ఓ జగత్పతీ! నాకిటువంటి ఘోరమైన శాపాన్నిచ్చావు. నేను ఈ శాపంనుండి విముక్తుడనెలా అవుతాను? దయచేసి నాకు శాపవిమోచనాన్ని తెలుపండి అని ప్రార్థించాడు. అప్పుడు శ్రీనివాసుడు మిక్కిలి దుఃఖిస్తూ శాపంతో మూర్ఛపోయిన రాజుతో నెమ్మదిగా ఇలా అన్నాడు -

''రాజా! నేను పాపాత్ముణ్ణి. దుష్టుడను. యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం లేనివాణ్ణి. అజ్ఞానంవల్ల, మిక్కిలి దుఃఖంవల్ల నేను నిన్ననవసరంగా శపించాను. అయినప్పటికీ నన్ను దేవతలు, భగవంతునిగా, పురాణ పురుషునిగా ఆరాధిస్తారు. నా భక్తులు నన్ను ధ్యానిస్తారు. కాబట్టి నా మాట అసత్యం కాదు, నా శాపం అసత్యం కాజాలదని వేదవేత్తలకు తెలుసు. నేను భక్తవాత్సల్యదోషం వలన దుఃఖిస్తాను. కలియుగాంతం వరకు నీవు కూడా దుఃఖిస్తావు. సత్య సంకల్పదోషంవల్ల మనిద్దరికి దుఃఖం తప్పలేదు.

కొంతకాలం తరువాత ఆకాశరాజనే పేరుతో ఒక మహారాజు పుడతాడు. ఆయన నాకు 'పద్మావతి' అనే శుభప్రదమైన కన్యను ఇచ్చి వివాహం చేస్తాడు. కన్యాదాన సమయంలో వరదక్షిణగా రత్నవజ్రఖచితమైన వందల బరువుగల కిరీటాన్ని సమర్పిస్తాడు. శుక్రవారం సాయంత్రం నేనాకిరీటాన్ని ధరిస్తాను. ఆ కిరీటాన్ని ధరించినప్పుడు నా కళ్ళలో నీరు నిండుతుంది. ఆ ఆరుఘడియల సమయం మాత్రం నీకు సుఖం కలుగుతుంది'' అని రాజుకు తనకు సుఖమయమైన కాలపరిమితిని ఏర్పరచి శ్రీనివాసుడు తన అవతార ప్రయోజనాన్ని, కలియుగంలో తన అవతారగాథను, పద్మావతీ పరిణయాన్ని గురించి రాజుకు చెప్పాడు.

ఆ తరువాత శ్రీనివాసుడు అక్కడే ఉంటున్నాడు. జగత్ప్రభువు తనకు కలిగిన గాయాన్ని మాన్పుటకై వైద్యశాస్త్రవిశారదుడు, దేవేంద్రాదులకు కూడా గురువైన బృహస్పతిని స్మరించాడు. వెంటనే బృహస్పతి అరుదెంచాడు. తన గాయానికి తగిన ఔషధాన్ని వెంటనే చెప్పమని శ్రీనివాసుడు బృహస్పతినాజ్ఞాపించాడు. అప్పుడు ప్రాణులలో, జీవులలో శ్రేష్ఠుడైన బృహస్పతి 'దేవా! మేదిచెట్టు పాలతో జిల్లేడు పత్తిని కలిపి ఆ గాయంపై ఉంచినచో ఆ గాయం మానగలదు' అని చెప్పాడు. శ్రీనివాసుడు బృహస్పతి చెప్పినట్లే చేశాడు. గాయం మానింది.

ఆ తరువాత శ్రీనివాసుడు మరల ఎవరికీ కనబడకుండా పుట్టలో ప్రవేశించాడు. ఆ పుట్టనే కౌసల్యాదేవిగాను, ఆ చింతచెట్టునే దశరథునిగాను, ఆ పర్వతాన్నే తమ్మునిగాను (లక్ష్మణునిగాను), ఆ పర్వతప్రాంతాన్నే అయోధ్యగాను, భావించి, రామచంద్రునిగా శ్రీనివాసుడు క్రీడించాడు. అలాగే ఆ వేంకటాచలంలోని పుట్టను దేవకీదేవి గాను, ఆ చింతచెట్టును వసుదేవునిగాను, శేషాద్రిని బలరామునిగాను, పర్వత ప్రదేశాన్ని మధురాపట్టణంగాను భావించాడు. అక్కడి స్వామి పుష్కరిణి యమునానదిగా భాసిల్లింది. మృగాలన్నీ యాదవులుగాను, పక్షులన్నీ గోపికలుగాను విలసిల్లినాయి. ఈ విధంగా శ్రీనివాసుడు వేంకటాచలంలో శ్రీకృష్ణునిగా క్రీడించాడు.

ఈ శేషాద్రి సాక్షాత్తు వేదస్వరూపమై విలసిల్లుతున్నది. శ్రీనివాసుడు ఆ పర్వతంపైనున్న పుట్టలో దాక్కొని, ఆ పర్వతాన్ని వైకుంఠం కంటె అధికంగా భావించాడు.

**ఏవం వేదమయః సాక్షాత్ గిరీంద్రః పన్నగాచలః ।**

**ఛన్న వల్మీకదేహోఽ్యో వైకుంఠాదధికో హ్యభూత్ ॥**

**- భ.పు. అ.4, శ్లో. 22**

సువర్ణముఖరీ నదియే విరజానది. వేంకటాలమే వైకుంఠం. శ్రీనివాసుడే వాసుదేవుడు. ఆ పర్వతంపైనున్న పక్షిసమూహాలన్నీ ముక్తులైన బ్రహ్మలు. మృగాలన్నీ ముక్తులైన రుద్రులు. వానరాలన్నీ సనత్కుమారాది యోగిపుంగవులు. మానవజన్మను పొంది వేంకటాచలానికి వెళ్ళగోరే ధర్మాత్ముడు అన్నికర్మలూ అనుష్ఠించినట్లే. దేవతలందరిచేత నమస్కరించబడే, పూజించబడే లక్ష్మీపతి అతనియందు మిక్కిలి ప్రీతి కలిగి ఉంటాడు. శ్రేష్ఠమైన, ఉత్తమోత్తమమైన

ఈ వేంకటాద్రి మాహాత్మ్యాన్ని బ్రహ్మ రుద్రేంద్రాదులు కూడా ఎరుగరు. ఇక అజ్ఞానులు, అల్పశక్తిమంతులు అయిన మానవుల సంగతి చెప్పేదేముంది? వారు అసలు తెలుసుకోలేరు కదా! ఆ క్షేత్రం అంత అద్భుతమైనది కదా!

## పద్మావతీ వివాహ కారణం

శౌనకాది మహామునులు సూతమహర్షిని ఇలా ప్రశ్నించారు. మహాత్మా! సర్వశాస్త్రవిశారదా! పాపాన్ని పోగొట్టే శ్రీ వేంకటేశ్వరుని మాహాత్మ్యాన్ని, అవతార వైభవాన్ని, చోళరాజుతో ఏర్పాటు చేసుకున్న నియమాన్ని, వైకుంఠం నుండి శ్రీనివాసుని రాకను, లౌకిక పారలౌకికమైన చరిత్రనంతా విన్నాము. నీవు దయాసముద్రుడవు. మాయందు కరుణ కలవాడవు. శిష్యులయందు మిక్కిలి ప్రీతి కలవాడవు.

ఓ పుణ్యాత్మా! మాకు శ్రీనివాసుని కల్యాణగాథను వివరించి చెప్పు. ఆ ఆకాశరాజెవరు? ఆయనకు పూర్వం కుమార్తె ఎలా కలిగింది? యోగులకు కూడా మనస్సుతో చింతించుటకు వీలుకానివాడు, సత్పురుషులకు దిక్కైన శ్రీనివాసుడు ఆకాశరాజు అల్లుడెలా అయ్యాడు శుభప్రదమైన శ్రీనివాసుని వివాహవైభవాన్ని సాంగంగా, జరిగింది జరిగినట్లు మాకు తెలియజేయండి.

వేంకటేశ్వరుని మహిమ అనే పాలసముద్రంలో నిత్యం స్నానం చేసే (అనగా నిత్యం శ్రీనివాసుని మహిమను తలచే) మానవుడు ధన్యుడు. అతని పుణ్యం పెంపొందుతుంది అని శౌనకాది మునులు అడుగగా విని సూతమహర్షి తన శిష్యులందరినీ పరికించి చూచి మిక్కిలి భక్తితో వంగి, 'మీరు చాలా మంచి విషయం అడిగారు' అని వారందరిని దయతో ప్రీతితో అభినందిస్తూ ఇలా చెప్పనారంభించాడు.

ఓ మునులారా! మీరందరూ భక్తియుక్తులై వేంకటనాథుని శుభప్రదమైన పరిణయగాథను వినండి. ఒకానొకనాడు వేంకటేశ్వరుడు తన గాయాన్ని మాన్పుకోవడానికై ఓషధులను స్వయంగా వెతుకుతు అరుణోదయ సమయంలో వేంకటాచలంపై సంచరించడానికి బయలుదేరాడు. ఆ సమయంలో శ్వేతవరాహరూపంలో ఉన్న నారాయణుడు శ్యామాకధాన్యాన్ని దొంగిలిస్తున్న వృషభాసురుని జయించి అటువైపు వచ్చాడు. ఆయన వేంకటేశ్వరుని చూచాడు. ఇంతలో కొన్ని అడవి పందులు 'నీవెవరని' అరుస్తూ అక్కడికి వచ్చినాయి. వాటిని చూసి జగత్ప్రభువైన శ్రీనివాసుడు పుట్టలో దాక్కొన్నాడు.

వరాహస్వామి పుట్టలోనున్న శ్రీనివాసుని చూచి ఆయన వైకుంఠం నుండి వచ్చిన లక్ష్మీపతిగా భావించి ధైర్యంతో బుద్ధిమంతుడైన వరాహస్వామి శ్రీనివాసునితో



మాట్లాడాడు. శ్రీనివాసుడు కూడా శ్వేతవరాహస్వామిని ఆసక్తిగా పరికించి చూసి ఆయనను విష్ణువు అవతారంగా తెలుసుకొని పుట్టలోనుండి బయటికి వచ్చాడు. వారిరువురు ఆనందబాష్పాలు రాలుస్తూ ఒకరినొకరు చూసుకొన్నారు.

సాక్షాత్తు శ్రీమహావిష్ణువే వరాహ శ్రీనివాసుల రూపంలో విరాజిల్లుతున్నాడు. లోకమర్యాదననుసరించి వారిరువురు పరస్పరం మాట్లాడుకున్నారు. వారిద్దరి ఆ అద్భుతకృత్యాన్ని చూచి బ్రహ్మాది దేవతలు వరాహశ్రీనివాసులపైన పుష్పవర్షాన్ని కురిపించారు. శ్రీమన్నారాయణుడు యుగాన్నిబట్టి దేశకాలాలనుబట్టి, వయస్సునుబట్టి తన అవతారాన్ని ప్రవర్తింపజేస్తూ సామాన్య జీవునివలె క్రీడిస్తాడు అని అనుకుంటూ ఆ దేవతలంతా ఆ జగత్ప్రభువు యొక్క విచిత్ర మాయాచేష్టలను, అద్భుత కృత్యాలను స్తుతించారు. అనంత పరాక్రముడైన శ్రీహరిని, ఆ శేషాద్రిని స్తుతిస్తూ పరస్పరం సంభాషిస్తున్న నారాయణ స్వరూపులైన వరాహ శ్రీనివాసులిరువురిని కుతూహలంతో దర్శిస్తూ స్తుతిస్తూ వారంతా తమ తమ నెలవులకు వెళ్ళారు.

## వరాహస్వామి శ్రీనివాసుని అనుమతించుట

దేవతాసమూహాలన్నీ వెళ్ళిన తరువాత వరాహస్వామి శ్రీనివాసునితో ఇలా అన్నాడు - 'శ్రీనివాసా! నీవు వైకుంఠ లోకాన్ని వీడి భూలోకానికి ఎందుకు వచ్చావు? ప్రపంచానికి

ఆనందకారకుడవైన మహాత్మా! ఆ విషయాన్ని చెప్పు అని అడుగగా శ్రీనివాసుడు వరాహస్వామితో ఇలా చెప్పాడు-

భృగుమహర్షి పాదతాడనం వలన లక్ష్మీదేవి కొల్హాపురానికి వెళ్ళింది. నేను దుఃఖంతో పరితపిస్తూ ఉత్తమమైన వైకుంఠాన్ని వీడి ఇక్కడకు వచ్చాను. ధరాకాంతా నీకు దక్షిణ దిశలో ఉన్న పుట్టలో నివసిస్తున్న నన్ను గోపాలుడు పదునైన గొడ్డలితో కొట్టాడు. ఆ దెబ్బవల్ల కలిగిన గాయం నన్ను బాధిస్తున్నది. వరాహదేవా! నేను దానికి తగిన ఓషధికొరకు నిరంతరం తిరుగుతున్నాను. అదృష్టవశాత్తు భూదేవిని ఉద్ధరించిన నిన్ను ఈ రోజు దర్శించాను. ఇక్కడే నివసించాలని నా సంకల్పం. కలియుగాంతం వరకు నాకు స్థలాన్ని ఇమ్ము' అని అడిగాడు.

**స్థలం దేహ్యవనీకాంతా! యావత్కలియుగం భవేత్ ।**

శ్రీనివాసుడు ఇలా అడుగగా వరాహస్వామి 'మూల్యము చెల్లించి స్థలం తీసుకోమన్నాడు. అది విని శ్రీనివాసుడు మధురవచనాలతో 'ఓ భూకాంతా మాధవా! భక్తులు మొదట నిన్నే దర్శిస్తారు. నిన్నే ముందు పాలతో అభిషేకిస్తారు. ముందుగా నీకే నైవేద్యం సమర్పిస్తారు. ఓ కరుణానిధీ! దీనినే నీకు గొప్ప ధనంగా ఇస్తున్నాను. నేనిచ్చే ఈ శ్రేష్ఠమైన ద్రవ్యాన్ని అంగీకరించు. తండ్రీ! నాయందు దయచూపు' అని వరాహస్వామిని ప్రార్థించాడు.

**ప్రథమం దర్శనం చ స్యాత్ నైవేద్యం క్షీరసేచనమ్ ।**
**ఇదమేవ పరం ద్రవ్యం దదామి కరుణానిధే ॥**

**- భ. పు. అ. 5, శ్లో. 27**

శ్రీనివాసుడు ఇలా అడుగగా వరాహస్వామి స్థలాన్ని అడిగిన శ్రీనివాసునికి నూరడుగుల స్థలాన్నిచ్చాడు. వారిరువురు ఒకే శ్రీహరి స్వరూపులైనప్పటికీ భక్తిలేనివారిని మోహింపజేయటానికి, భక్తులకు భక్తిని సిద్ధింపజేయటానికి దేవదేవులైన వరాహ శ్రీనివాసులు పరస్పరం వినోదంతో ఇలా క్రీడిస్తూ ఉంటారు. అప్పటినుండి వరాహస్వామి శ్రీనివాసునికి భోజనానికి వండిపెట్టుటకు, ఆయన్ను సేవించుటకు వకుళమాలికను నియోగించాడు. ఆమెద్వారా శ్రీనివాసునికి శ్యామాకాన్నాన్ని తేనెను ప్రతిరోజూ పంపిస్తూండేవాడు. ఆమె నిరంతరం భక్తితో శ్రీనివాసుని సన్నిధిలో ఉంటూ నిరామయుడు, గోవిందుడు అయిన శ్రీనివాసునికి అన్నపానాదులు, ఓషధులు సమకూరుస్తూ, పాదాలొత్తుతూ ఆయన్ను సేవిస్తూ ఆరాధిస్తున్నది.

సూతమహర్షి ఇలా చెప్పగా శౌనకాది మునీంద్రులు 'మహాత్మా! శ్రీనివాసుడు వైకుంఠం నుండి భూలోకానికి వేంచేసిన ఉత్తమ చరిత్రను నీవలన విన్నాము. కాని వరాహస్వామిని మొదటగా దర్శించుటవలన కలిగే ఫలితాన్ని గురించి వినలేదు. శుభప్రదమైన, మహత్తరమైన శ్రీనివాసుని కల్యాణం గురించి మరల ఆయన వేంకట పర్వతంపై నివసించుట గురించి మేము వినలేదు. ఆయనకు వకుళమాలిక సేవలు చేస్తున్నదని చెప్పారు. ఆమె పూర్వ వృత్తాంతం ఏమిటి? ఆమె ఎవరు? ఈ వివరాలన్నీ మాకు తెలియజేయండి' అని అడిగారు. అప్పుడు సూతమహర్షి ఇలా చెప్పాడు-

## వకుళమాలిక పూర్వ జన్మవృత్తాంతం

వకుళమాలిక పూర్వజన్మలో కృష్ణుని తల్లి యశోద. ఆమె తన కుమారుడైన, అనంతరూపుడైన శ్రీకృష్ణుని ఆనందదాయకమైన కల్యాణాన్ని దర్శించలేదు. అందువల్ల ఆమె శ్రీకృష్ణుని ఇలా అడిగింది - 'కృష్ణా! నీ కల్యాణాన్ని కనులారా చూడాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతున్నది. యశోదానందవర్ధనా! రమానాథా! నీవు నాకు మహాపుణ్యప్రదమైన, పవిత్రమైన నీ వివాహాది చరిత్రను దర్శింపచేయి' అని అడుగగా శ్రీకృష్ణుడు ఆమెతో మధురవాక్కులతో ఇలా అన్నాడు -

'తల్లీ! కొంతకాలం తరువాత మరుజన్మలో శ్రీ పర్వతంలో నీ కోరికను తీరుస్తాను.

**జన్మన్యనంతరే దేవి! తావకీనం మనోరథమ్ ।**
**శ్రీశైలే పూరయిష్యామి కించిత్కాలాదనంతరమ్ ॥**

**- భ. పు. అ.5, శ్లో. 40**

శ్రీకృష్ణుడీవిధంగా యశోదాదేవికి వరమివ్వగా నందుని భార్య అయిన ఆమె మరల జన్మించుటకై శరీరాన్ని వదలింది. ఆమె ప్రీతికొరకు వాసుదేవుడు ఇరవై ఎనిమిదవ కలియుగంలో ఆవిర్భవించాడు. యశోదకు సంతోషం కలిగించే గుణములచేతను, కర్మలచేతను క్రీడిస్తూ ఉన్నాడు. ఆయన దోషరహితుడు, జగన్నియామకుడు, జగత్ప్రభావుడు అయి కూడా రాక్షసులను వంచించుటకు, దేవతలకు ముక్తినిచ్చుటకు, తన భక్తులకు హితమును చేకూర్చుటకు, విశేషించి వైరాగ్య సంపన్నులకు ముక్తిని ప్రసాదించుటకు భగవానుడు ప్రాకృతమైన మానవరూపం ధరించి క్రీడిస్తున్నాడు.

ఈ కారణం వలన యశోదయే వకుళమాతగా జన్మించింది. వేంకటాద్రి వాసుడైన శ్రీనివాసుని కల్యాణాన్ని ఆమెయే జరిపిస్తుంది. శ్రీహరి సంప్రీతుడైతే లభ్యం కానిదేమున్నది? జ్ఞానం, విజ్ఞానం, సంపదలు అన్నీ లభిస్తాయి. ఒకడు దేవుని పూజిస్తాడు. మరొకడు దేవునిచే పూజింపబడతాడు. శ్రీరాముడు హనుమంతునిచే పూజించబడినప్పటికీ ఆయన కృష్ణావతారంలో అర్జునుని పూజించాడు. లోకంలోని జనులను పవిత్రం చేసే విచిత్రమైన శ్రీహరి లీలలను ఎవరు వర్ణించగలరు?

ఋషిశ్రేష్ఠులకైనా నిత్యశుద్ధుడైన శ్రీ మహావిష్ణువును సేవిస్తే పుణ్యం లభిస్తుంది. ఆయన్ని ఆరాధించకపోతే పాపం



వస్తుంది. కావున సత్త్వగుణ సంపన్నులైన ఋషీశ్వరులందరు శ్రీహరిని పూజించాలి. ఆయన పితరులకు, రాజులకు, విప్రులకు, మానవులకు, రాక్షసులకు, మూఢులకు కూడ పూజ్యుడు. కలియుగంలో కల్మష మనస్కులై పాపాలు చేసే మానవులను రక్షించుటకై లక్ష్మీపతి మానవునివలె నటిస్తూ క్రీడిస్తున్నాడు. రాక్షసులను మోహింపజేయడానికి, దేవతలను సంతోషపెట్టుటకు జగత్తును పరిపాలించే ఆ గోపబాలుడు పిల్లల్లో పిల్లవాడై క్రీడిస్తాడు.

శ్రీనివాసుడు జగత్తును మోహింపజేసే సౌందర్యం కలవాడు. ఆయన లీలగా మానవరూపాన్ని ధరించాడు. దేవతలు కాని, విశ్వకర్మ కాని ఈ రూపాన్ని నిర్మించలేదు. ఆయన తన సంకల్పంచేత స్వేచ్ఛగా, తనకు కావలసిన రూపాలను ధరిస్తూ, క్రీడిస్తూ విరాజిల్లుతున్నాడు.

**జగన్మోహన సౌందర్యలీలామానుష విగ్రహః ।**
**నైతద్రూపం కృతం దేవైః నకృతం విశ్వకర్మణా ॥**
**స్వేచ్ఛయా క్రీడతే తత్ర స్వేచ్ఛారూప విరాజితః ।**

**- భ. పు. అ.5, శ్లో. 52, 53**

ఆదివరాహ క్షేత్ర మహిమ చాలా దివ్యమైనది. వేంకటాచలంలోని తీర్థ వైభవం చాలా గొప్పది. అక్కడ సాక్షాత్తు రమాపతియే అవతరించాడు. అది ఎంత పుణ్యవిశేషమో కదా! అనేక జన్మలలో సంపాదించిన పుణ్యఫలంగా అటువంటి పుణ్యక్షేత్ర దర్శనం లభిస్తుంది. అందులోను శ్రీ వేంకటాచలాన్ని దర్శించడం ముక్తిదాయకం. ఆ దివ్యక్షేత్ర సందర్శనం దేవతా సమూహాలకే దుర్లభమంటే ఇక మానవుల సంగతి చెప్పేదేముంది?

## శ్రీనివాసుడు వేటకు బయలుదేరుట

శ్రీనివాసుడు ఒకనాడు గుఱ్ఱం కావాలని సంకల్పించాడు. వెంటనే గుఱ్ఱం ప్రత్యక్షమైంది. వాయుదేవుడే గుఱ్ఱంగా మారాడు. తత్త్వాభిమానిని అయిన లక్ష్మీదేవి స్వయంగా కళ్ళెంగా మారి వచ్చింది. శ్రీనివాసుడు ఆ గుఱ్ఱాన్ని పూజించి సర్వాభరణాలు అలంకరించుకొని దానిపై నెక్కాడు. ఆయన పదిహేనుమూరల తెల్లని వస్త్రాన్ని ధరించాడు. దానిపైన బంగారు మొలనూలును బిగించాడు. ఐదుమూరల తెల్లని ఉత్తరీయాన్ని ధరించాడు.

అద్దం చూసుకొని తెల్లని తిరుమణిని ముఖాన పెట్టుకున్నాడు. మధ్యలో కుంకుమతో అందంగా తిలకం దిద్దుకున్నాడు. వక్కలు, తాంబూలం, సుగంధ ద్రవ్యాలు పెట్టే భరిణను, పచ్చకర్పూరంతో పరిమళించే వక్కలను, జాజికాయలను, జాపత్రితో కలిసిన లవంగాలను రత్నపేటికలో పెట్టాడు. స్వచ్ఛమైన తెల్లని సున్నాన్ని, కుంకుమపువ్వు భరిణను తీసుకున్నాడు. బంగారు వస్త్రాన్ని మొలకు కట్టాడు. స్వర్ణయజ్ఞోపవీతాన్ని ధరించాడు. మెడలో ఆభరణాలు ధరించాడు. బంగారు కంకణాలు రత్నఖచితాలైన భుజకీర్తులు ధరించాడు.

**(సశేషం)**

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



**గత సంచిక తరువాయి**

## శ్రీ భగవద్రామానుజాచార్యులు

1017 వ సంవత్సరంలో తమిళనాడులోని శ్రీ పెరంబుదూరులో జన్మించిన శ్రీ రామానుజులు, తన 120 ఏళ్ళ సుదీర్ఘ జీవిత కాలంలో మూడు సార్లు తిరుమల యాత్ర చేసారు. శ్రీవేంకటాచల క్షేత్రాన్ని సాక్షాత్తు శ్రీనివాసుని ప్రతిరూపంగా భావించి ఆ దివ్యక్షేత్ర మహాత్మ్యాన్ని పలువిధాలుగా లోకానికి తెలియచెప్పారు.

## ఐతిహ్యం

పురాణాల ననుసరించి త్రేతాయుగంలో లక్ష్మణునిగా, ద్వాపరయుగంలో బలరామునిగా అవతరించిన ఆదిశేషుడు కలియుగంలో రామానుజుల రూపు దాల్చాడు. రామ+అనుజుడు అంటే, శ్రీరామునికి తమ్ముడని అర్థం. ఆ విధంగా రామానుజులు సార్థక నామధేయుడయ్యాడు.

తిరుమల క్షేత్రానికి, రామానుజుల జీవితానికి విడదీయరాని అనుబంధం ఉంది.

## తిరుమల క్షేత్ర సందర్శనం- నాందీ ప్రస్తావన

రామానుజాచార్యులు తిరుమలను సందర్శించడానికి అనేక కారణాలున్నాయి.

- తన మేనమామ, గురువు అయిన తిరుమలనంబి ద్వారా మరియు శిష్యుడైన అనంతాళ్వార్ ద్వారా; అప్పటికే సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన తిరుమల లోని శ్రీవారి ఆలయంలో అర్చన, ఉత్సవ, కైంకర్యాది కార్యాలు వైఖానస ఆగమ శాస్త్రానుసారం జరగడంలేదన్న విషయాన్ని తెలుసుకున్న రామానుజాచార్యులు అక్కడి పరిస్థితులను చక్కదిద్దాలనుకున్నారు.
- రామానుజ ప్రచలిత, విశిష్టాద్వైతానికి ఆధారగ్రంథమైన దివ్యప్రబంధంలో, శ్రీవేంకటేశ్వరునకు సంబంధించిన పాశురాలు చదివి ఉత్తేజితుడయ్యాడు.
- అంతకు మునుపే, తనకు ఆప్తుడైన తిరుమల నంబి తిరుమలలో స్థిరనివాసం ఏర్పరచుకుని కైంకర్యాదులు నిర్వహిస్తున్నారు.
- శ్రీరంగం లాంటి వైష్ణవాలయాల్లో పూజా కార్యక్రమాలు జరగటానికి నియమావళిని ఏర్పాటు చేసిన రామానుజులు, తిరుమలలో కూడా అలాంటి వ్యవస్థను నిర్వహించదలచారు.
- వైష్ణవులయినవారు తమ జీవితకాలంలో ఒక్కసారైనా వేంకటాచల క్షేత్రాన్ని వీక్షించి తరించాలని కోరుకుంటారు. వీటన్నింటి వల్ల, శ్రీ రామానుజుల వారు తిరుమల క్షేత్రాన్ని దర్శించాలని దృఢంగా సంకల్పించారు.

## గోవిందరాజస్వామి ఆలయ నిర్మాణం

తిరుమల యాత్రలో మొదటి మజిలీగా తిరుపతి చేరుకున్న




రామానుజులు, భగవత్కార్యాన్ని అక్కడే ప్రారంభించారు. దక్షిణాదిన శైవమత ప్రాబల్యం అధికంగా ఉన్న రోజుల్లో కుళోత్తుంగ చోళుడనే శైవారాధ పాలకుడు విష్ణుద్వేషిగా మారి, కావేరీ తీరంలో, చిత్రకూట ఆలయమందున్న గోవిందరాజస్వామి విగ్రహాన్ని సముద్రంలో పారవేశాడు. ''క్రిమికంఠుడని'' కూడా పిలువబడే ఆ చోళరాజు, ఆ సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాన్ని శైవ క్షేత్రంగా మార్చాడు. నాటి చిత్రకూటమే తమిళనాడు లోని ఇప్పటి ''చిదంబరం''. విశేషమైన పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన ఆ విగ్రహం సముద్రం పాలు కావడంతో, పాలకుని విష్ణుద్వేషానికి కలత చెందిన కొందరు వైష్ణవులు, ఆ ఆలయం లోని ఉత్సవ విగ్రహాలను తీసుకువెళ్ళి తిరుపతి క్షేత్రంలో భద్రపరచారు. ఈ వృత్తాంతాన్ని తెలుసుకుని విషణ్ణుడైన రామానుజులు సముద్రం పాలైన గోవిందరాజస్వామి మూలవిరాట్టు ప్రతిరూపాన్ని తిరుపతిలో ప్రతిష్ఠింపచేసి, తన శిష్యుడైన యాదవరాజుతో అద్భుతమైన శిల్పకళ ఉట్టిపడేలా సమున్నతమైన ప్రాకారాలు, ఆకాశాన్ని చుంబించే గోపురాలతో, సువిశాలమైన గోవిందరాజస్వామి ఆలయాన్ని నిర్మింపచేశాడు. తిరుపతి పట్టణం నడిబొడ్డున, రైల్వేస్టేషన్ సమీపంలో ఇప్పుడు మనం చూస్తున్న గోవిందరాజస్వామి ఆలయం అదే. దానికి కొంత దూరంలో ఆలయ నిర్మాణం కాకమునుపే ఉన్న ఓ విశాలమైన పుష్కరిణిని కూడా నేడు చూడవచ్చు. తిరుమల యాత్రికులు ముందుగా గోవిందరాజస్వామిని దర్శించుకునే సాంప్రదాయం నేటికీ ఉంది.

తిరుపతి పట్టణంలో ఈనాడు ''మంచినీటి కుంట''గా పిలువబడే ''నరసింహక్షేత్రం'' ఒడ్డున, ఆలనా – పాలనా లేకుండా ఈనాడు కూడా పడి వున్న శయనముద్ర లోని గోవిందరాజస్వామి విగ్రహం, ఆనాడు సముద్రంలో పారవేయబడిన విగ్రహమేనని చరిత్రకారుల అభిప్రాయం. ఆ మూర్తిని చిత్రకూటం నుండి రవాణా చేస్తున్నప్పుడు కొద్దిగా దెబ్బతిని ఆరాధనకు అనర్హమవడం వల్ల దానిని ఈ ప్రదేశానికి తరలించినట్లు చెబుతారు. ఈసారి తిరుపతి యాత్రలో, చూడచక్కగా జీవకళతో ఒప్పారుతూ ఉండే, చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఆ విగ్రహాన్ని తప్పక దర్శించండి.

## పాదాల మండపం

తిరుమల క్షేత్రాన్ని దర్శించుకోవటానికి పూర్వం కొంతకాలం తిరుపతిలో నివాసం ఉండిన రామానుజులు, తన గురువుగారైన తిరుమలనంబి ద్వారా శ్రీమద్రామాయణం లోని ఆధ్యాత్మిక విశేషాలను తెలుసుకోదలిచారు. రామానుజుల కోర్కె మేరకు, తిరుమల క్షేత్రంలో నివాసముండే తిరుమలనంబి ప్రతిరోజూ ఉదయం శ్రీవారి కైంకర్యాలు ముగించుకుని, అలిపిరి నడక మార్గానికి ప్రారంభంలో ఉన్న తన తింత్రిణీ వృక్షం (చింతచెట్టు) వద్దకు వచ్చేవారు. అదే సమయానికి గోవిందరాజస్వామిని సేవించుకొని రామానుజుల వారు ఆ ప్రదేశానికి చేరుకుని, తిరుమలనంబి ద్వారా రామాయణ



కావ్య రహస్యాలు తెలుసుకునేవారు. సాయం సమయానికి తిరుమలనంబి తిరుమలక్షేత్రం తిరిగి చేరుకునేవారు. ఆ విధంగా ఒక్క సంవత్సర కాలంలో 18 పర్యాయాలు, 18 రకాలుగా, రామాయణ రహస్యాలను చర్వితచరణం కాకుండా తిరుమలనంబి రామానుజులకు విశదీకరించారు. రామాయణ పారాయణం ఇలా కొనసాగుతున్న తరుణంలో, ఒకసారి తిరుమలనంబి తాను ఉభయ సంధ్యలలో మాత్రమే శ్రీవారిని దర్శించుకోగలుగుతున్నానని, అలిపిరిలో ఉండిపోవడం వల్ల మధ్యాహ్న సమయంలో శ్రీవారి దర్శన భాగ్యం కలగడం లేదని వాపోయారు. భక్తుని యొక్క ఆర్తిని అర్థం చేసుకున్న శ్రీనివాసుడు, రామాయణ ఉపదేశం జరుగుతున్న ప్రదేశం లోనే ఉండడంతో, రామానుజులు స్వామివారి రెండవ చేతికి కూడా నాగాభరణం చేయించారు. ఇప్పుడు స్వామివారు ఇరు హస్తాలకు నాగాభరణ భూషితుడై దర్శనమిస్తారు.

స్వామివారి మూలవిరాట్టు ఎప్పుడూ పట్టుపీతాంబరాలతో, వజ్ర వైఢూర్య ఖచిత స్వర్ణాభరణాలతో, పూలమాలలతో అలంకరింపబడి ఉండటం వల్ల స్వామివారి వక్షస్థల లక్ష్మిని కేవలం శుక్రవారం అభిషేక సమయంలో మాత్రమే దర్శించుకోగల్గుతాం. మిగిలిన సమయాల్లో కేవలం స్వామి దర్శనంతోనే సంతృప్తి పడాల్సి రావడం భక్తులకు తీరని లోటుగా భావించిన రామానుజులు, ఒక బంగారు అలమేల్మంగ ప్రతిమను తయారు చేయించి స్వామివారికి కుడివైపున అలంకరింపచేశారు. తరువాతి కాలంలో భూదేవికి ప్రతిరూపంగా మరో బంగారు ప్రతిమ శ్రీవారి మెడలో సమర్పింపబడింది. అప్పటినుండి రెండు బంగారు ప్రతిమలు శ్రీవారి ఉదర భాగంలో అలంకరింపబడి దర్శనమిస్తున్నాయి.

అప్పటి పాలకులను ప్రేరేపించి శిథిలావస్థలో ఉన్న ఆనందనిలయ విమానాన్ని, గర్భాలయ కుడ్యాలను జీర్ణోద్ధారణ గావించారు. నిత్యకైంకర్యాలు, నైవేద్య సమర్పణలు నిరాటంకంగా కొనసాగటం కోసం అప్పటి పాలకులు, భక్తుల నుండి భూములను దేవదేయాలుగా (''దేవదత్తం'' అంటే దేవుడు మనకు ప్రసాదించేది. ''దేవదేయం'' అంటే, భక్తులు దేవునికి సమర్పించుకునేది) సమీకరించి, ఆ వివరాలను శిలాశాసనబద్ధం గావించి, వాటిద్వారా వచ్చే ఆదాయంతో శాశ్వత ఏర్పాట్లు చేశారు. వెయ్యేళ్ళ క్రితం భక్తులు శ్రీవారికి సమర్పించుకున్న అనేక భూములు ఇంకా అన్యాక్రాంతం కాకుండా ఉండటానికి, దూరదృష్టితో రామానుజులవారు, ఆనాడే చేపట్టిన ఈ చర్యలన్నీ ఎంతో దోహదపడ్డాయి. నేటికీ తిరుపతి పరిసర ప్రాంతాలలో వేలాది ఎకరాల ''మఠం'' భూములు తితిదే ఆధ్వర్యంలోనే ఉన్నాయి. ''మఠం'' అంటే ''మహంతు మఠం'' అన్నమాట. మహంతులంటే శ్రీవారి మహాభక్తుడు ''హాథీరాం బాబా'' వంశస్థులు. ఈ భక్తాగ్రేసరుని గురించి ముమ్ముందు తెలుసుకుందాం.

అంతకుపూర్వం స్వామివారికి సన్నటి రేఖలతో కూడుకున్న తిరునామాలుండేవి. వాటి స్థానంలో కస్తూరి, పచ్చకర్పూరం దట్టంగా అద్ది, ఇప్పుడు మనం చూసే వెడల్పాటి ఊర్ధ్వపుండ్రం ఎల్లవేళలా శ్రీవారి నుదుట అలంకరించి ఉండే ఏర్పాటు చేసింది రామానుజుల వారే. శ్రీవారి నిజనేత్ర దర్శనానికి వీలుగా, శుక్రవార అభిషేక సమయంలో మాత్రం నామాలను చిన్నగా ఉంచే సాంప్రదాయాన్ని కూడా రామానుజులవారే ప్రవేశపెట్టారు.

విమాన ప్రదక్షిణ మార్గంలో ఈశాన్య దిక్కున యోగనరసింహస్వామి విగ్రహప్రతిష్ఠ చేయించి, నిత్యపూజా నివేదన కట్టడి చేశారు. వ్యాఖ్యాన ముద్రలో ఉన్న తన శిలావిగ్రహాన్ని స్వయంగా ఆలింగనం చేసుకొని, దానిని అనంతాళ్వార్ కు బహూకరించారు. ఈ విగ్రహం విమాన ప్రాకారంలోనే ఉన్న భాష్యకార్ల సన్నిధిలో ప్రతిష్ఠించబడింది. ఈ మందిరంలో ఉన్న రామానుజుల వారి పాదుకలు కల్గిన ''శఠారి''కి తన పేరు పెట్టుకొని రామానుజుల పట్ల తనకున్న అపారమైన భక్తిని చాటుకున్నాడు ధన్యజీవి ''అనంతాళ్వార్''.

## ఇతర సాంప్రదాయాలు

నమ్మాళ్వార్ విరచిత పాశురాల ద్వారా స్వామివారు పుష్పప్రియుడని తెలుసుకుని, తన శిష్యుడైన అనంతాళ్వార్ ని ప్రేరేపించి తిరుమలలో పుష్పకైంకర్యం కొనసాగింపు చేశారు. పుష్పమండపంగా పేరు గాంచిన తిరుమల క్షేత్రంలో పుష్పాలన్నీ స్వామివారికి మాత్రమే చెందాలనే మహత్తర లక్ష్యంతో, కొండపై ఎవ్వరూ పువ్వులు ధరించరాదని, పూజానంతరం కూడా ఆ నిర్మాల్యాన్ని ఎవరికీ ప్రసాదించకుండా, పూలబావిలో నిక్షిప్తమై ఉన్న భూదేవికి సమర్పించాలనే కట్టడి చేశారు. శ్రీవారి మరో భక్తుడు తిరుమలనంబిని శ్రీనివాసుడు ''తాతా'' అని పిలిచిన రోజుకు గుర్తుగా, ప్రతి సంవత్సరం జరిగే ''తన్నీరుముదు'' ఉత్సవానికి కూడా రామానుజుల వారే శ్రీకారం చుట్టారు. ధనుర్మాసంలో సుప్రభాతానికి బదులుగా ''తిరుప్పావై'' పఠనాన్ని, తోమాలసేవలో ''దివ్యప్రబంధ'' పారాయణాన్ని, ఇతర ఉత్సవ సమయాల్లో ''శాత్తుమురై'' గానాన్ని సైతం రామానుజులవారే ప్రవేశపెట్టారు.

అంతకుపూర్వం, బ్రహ్మోత్సవాలు తిరుమలలో జరిగేవి కావు. మొదటిరోజు ధ్వజారోహణ మాత్రం తిరుమలలో జరిపి, మిగతా ఉత్సవాలన్నీ తిరుచానూరులో జరిపించేవారు. కీకారణ్యంతో కూడుకున్న తిరుమలలో ఆ ఉత్సవాలకు కావలసిన సాధన-సంపత్తులు, వసతులు లేకపోవడమే దీనికి కారణం. స్వామివారికి చెందిన ఉత్సవాలన్నీ తిరుమలలోనే జరగాలనే లక్ష్యంతో తిరుమల మాడవీధులను విశాలంగా తీర్చిదిద్ది, అర్చకులకు, జియ్యంగార్లకు ఆలయ సమీపంలోనే నివాస గృహాలు ఏర్పరచి, అప్పటినుండి తిరుమలలోనే బ్రహ్మోత్సవాలన్నీ జరిగేలా ఏర్పాట్లు చేశారు. తిరుమల క్షేత్రం అంతా పూదోటలు ఏర్పాటు చేసి స్వామివారి నిత్య కైంకర్యాలకు పూలను విరివిగా ఉపయోగించే సాంప్రదాయాన్ని అమల్లోకి తెచ్చారు. ఆలయ నిర్వహణ, కైంకర్యాదులు సజావుగా సాగడం కోసం రామానుజులవారు ప్రవేశపెట్టిన ఏకాంగి వ్యవస్థ గురించి, తదనంతర కాలంలో అదే జియ్యంగార్ల వ్యవస్థగా మార్పు చెందటం గురించి ఇంతకుముందే తెలుసుకున్నాం.

## రామానుజుల పేరిట ఉత్సవాలు

శ్రీనివాసునికి, ఆనందనిలయానికి, తిరుమల క్షేత్రానికి రామానుజుల వారందించిన అనిర్వచనీయమైన సేవలకు గుర్తుగా, ఈనాటికీ ఆనందనిలయంలో రామానుజుల వారి పేరున కొన్ని ఉత్సవాలు జరుగుతాయి. రామానుజుల జన్మ నక్షత్రమైన ''ఆర్ద్రా నక్షత్రం'' నాడు జరిగే మాసోత్సవం గురించి ఇంతకుముందే తెలుసుకున్నాం. వైశాఖ మాసంలో శ్రీరామానుజ జయంతి సందర్భంగా జరిగే పది రోజుల ఉత్సవాల యందు, భాష్యకార్ల సన్నిధిలో ప్రత్యేక ఆరాధనలు జరుగుతాయి. స్వామివారి శేషహారతి, తీర్థ-చందనాలు రామానుజుల వారికి ప్రసాదిస్తారు.

## సంస్కరణలు

అప్పట్లో కొందరికి మాత్రమే పరిమితమై ఉన్న వైష్ణవమతాన్ని అందరికీ ఆమోదయోగ్యం చేస్తూ, సమాజంలోని అత్యున్నత స్థాయి నుండి అట్టడుగున ఉన్న వారందరికీ వైష్ణవ మతాన్ని స్వీకరించే అర్హత కల్పించారు. హైందవ సంస్కృతికి గుళ్ళూ గోపురాలూ ఆయువు పట్లని విశ్వసించిన శ్రీరామానుజులు, దేశం నలుమూలలా సంచరించి ఎన్నో వైష్ణవాలయాలను పునరుద్ధరించి వాటిలో నిత్య కైంకర్యాలకు శాశ్వత ఏర్పాట్లు చేశారు. అప్పటివరకు అస్తవ్యస్తంగా ఉన్న అర్చారీతులన్నింటినీ తీర్చి దిద్ది సక్రమమైన ఆలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అటువంటి క్షేత్రాల్లో శ్రీవేంకటాచల క్షేత్రం ప్రధానమైనది.

మధ్వాచార్యులు ద్వైతమతానికి, ఆదిశంకరులు అద్వైతమతానికి కృషి చేసినట్లే, విశిష్టాద్వైత వ్యాప్తికి ఎంతగానో కృషి చేసిన రామానుజాచార్యులు, అనేకానేక ఆధ్యాత్మిక గ్రంథాలను కూడా రచించారు. వాటిలో శ్రీభాష్యం, గీతాభాష్యం, వేదాంతదీపం, వేదాంతసారం, శ్రీరంగగద్యం, శరణాగతిగద్యం, వైకుంఠగద్యం ముఖ్యమైనవి.

కలియుగ సంవత్సరం 4118, పింగళవర్షం, చైత్రమాసం, ఆర్ద్రా నక్షత్రం, శుక్లపంచమి తిథి నాడు (ఏప్రిల్ 13, 1017 సం.), తమిళనాడు లోని భూతపురంలో (నేటి శ్రీ పెరంబుదూరు), ఆసూరి కేశవాచార్యులు, కాంతిమతి పుణ్యదంపతులకు జన్మించిన శ్రీమద్రామానుజులు 120 వసంతాలు జీవించి, 1237 సంవత్సరంలో శ్రీరంగం నందు తుదిశ్వాస విడిచారు.

(ఈ లెక్క ప్రకారం క్రీ.పూ 3101 సంవత్సరంలో కలియుగం ప్రారంభమైనట్లు).

అన్నమయ్య, రామానుజులను ''పలికేదైవం''గా కీర్తించాడు.

**గతులన్ని ఖిలమైన కలియుగమందును**
**గతి యితడే చూపె ఘన గురు దైవము**
**వెలయించె నీతడె కా వేదపురహస్యము**
**చలిమి నీతడే చూపె శరణాగతి**
**నిలిపె నా డీతడె కా నిజముద్రాధారణము**
**మలసి రామానుజులే మాటలాడే దైవము**

**(ఇంకా ఉంది)**

# అనంత పద్మనాభస్వామి వ్రతం

– కౌతా నిర్మల

భాద్రపద శుక్లపక్ష చతుర్దశి నాడు అనంతపద్మనాభ వ్రతాన్ని చేస్తారు. ఈ వ్రత ప్రస్తావన బ్రహ్మ, స్కంద, భవిష్యోత్తర పురాణాలలో ఉంది. ఈ వ్రతాన్ని చేసినవారికి కష్టాలు తొలగిపోతాయి. సుఖజీవితాన్ని గడుపుతారు. సంతానం కలుగుతుంది. పుత్ర పౌత్రాభివృద్ధి జరుగుతుంది. ఈ వ్రతాన్ని 14 సంవత్సరాలు చేయాలి. ఈ వ్రతానికి 14 సంఖ్య నిర్దేశింపబడింది. 14 రకాలైన పుష్పాలను, 14 రకాల పత్రాలను ఈ పూజకు ఉపయోగించాలి. 14 రకాల నైవేద్యాలను స్వామికి సమర్పించాలి. ఈ వ్రతానికి ఉపయోగించే పూజా సామగ్రి 14 సంఖ్యతోనే ఉండాలి. పట్టుదారంతో తోరం తయారు చేసి, ఆ తోరాన్ని కుంకుమతో తడిపి, దానికి 14 ముడులు వేయాలి. ఆ తోరంలోని ఒక్కొక్క ముడి ఒక్కొక్క దేవతకు సంకేతమని తెలియచేయబడింది. ఆ తోరానికి పూజ జరపటం వల్ల 14 మంది దేవతలు సంతృప్తి చెంది ఆ వ్రతం చేసిన భక్తులకు సుఖ సంతోషాలను, సిరి సంపదలను, శక్తిని ప్రసాదిస్తారని చెప్పబడింది. వ్రతం ప్రారంభానికి ముందు ఆ తోరాన్ని ధరించాలి. కొత్త తోరానికి పూజ చేసి, దాన్ని ధరించిన తరువాత పాత తోరాన్ని తీసేయాలి. స్వామివారిని షోడశోపచారాలతో, భక్తి శ్రద్ధలతో పూజించాలి.

ఈ వ్రతాన్ని గురించి శ్రీకృష్ణుడు ధర్మరాజుకు తెలియచేసినట్లుగా భవిష్య పురాణంలో తెలియచేయబడింది. పూర్వం పాండవులు జూదంలో అపజయం పొంది, వనవాసం చేస్తూ ఎన్నో కష్టాలను అనుభవింపసాగారు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు వారి వద్దకు వచ్చినప్పుడు పాండవాగ్రజుడైన ధర్మరాజు, ''శ్రీకృష్ణా! మేము అనుభవిస్తున్న కష్టాలు నీకు తెలియనివి కావు. మా కష్టాలు తొలగిపోయి, మేము మనశ్శాంతితో జీవించటానికి ఏదైనా మార్గాన్ని మాకు ఉపదేశించు దేవా'' అని ప్రార్థించాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు ''యుధిష్ఠిరా! మీ కష్టాలు తీరాలంటే అనంత పద్మనాభ వ్రతాన్ని ఆచరించండి. మీకు మేలు కలిగి, బాధలకు ఉపశమనం కలుగుతుంది. సుఖంగా, మనశ్శాంతితో జీవిస్తారు'' అని చెప్పాడు.

వెంటనే ధర్మరాజు ''కృష్ణా! అనంతుడంటే ఎవరు?'' అని ప్రశ్నించాడు.

''ధర్మరాజా! అనంతుడంటే వేరెవరో కాదు, నేనే. నా



యందు పదులనాలుగురు ఇంద్రులు, అష్ట వసువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, సప్త మహర్షులు, చతుర్దశ భువనాలు ఉన్నాయి. విశ్వమంతా నేనే. కాలస్వరూపుడను నేను. మీరు అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని ఆచరించి, శుభఫలితాన్ని పొందండి''.

ధర్మరాజు శ్రీకృష్ణుని ఇలా అడిగాడు. ''ఈ వ్రతాన్ని ఇంతకు మునుపు ఎవరైనా చేసారా? ఏ విధంగా చేయాలి? ఈ వ్రతాన్ని చేసినవారు ఎటువంటి ఫలితాన్ని పొందుతారు? నాకు వివరంగా తెలియచేయి కృష్ణా!''

శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు. ''పాండవాగ్రజా! పూర్వం కృతయుగంలో వేదాలు అభ్యసించిన పండితుడైన సుమంతుడు, అతని భార్య దీక్షాదేవి నివసించేవారు.

వారికి సుశీల అనే పుత్రిక ఉంది. సుశీల జన్మించిన కొంత కాలమునకు దీక్షాదేవి మరణించింది. సుమంతుడు కర్కశ అనే ఆమెను పునర్వివాహం చేసుకున్నాడు. సవతి తల్లి సుశీలను అనేక బాధలు పెట్టసాగింది. వాటిని మౌనంగా సహిస్తూ, సుశీల శ్రీహరిని ధ్యానించసాగింది. ఒకరోజు కౌండిన్య మహర్షి వారింటికి వచ్చాడు. సుశీల వినయ విధేయతలు, భక్తి, సుగుణాలు చూసిన మహర్షి సుమంతుని అనుమతితో సుశీలను వివాహం చేసుకున్నాడు.

కౌండిన్య మహర్షి తన పత్నితో కలిసి తిరుగు ప్రయాణమయ్యాడు. మొదటిసారిగా భర్తతో కలిసి వెళుతున్న సుశీలకు ఏదైనా కానుకను ఇచ్చి పంపుదామని సుమంతుడు కర్కశతో చెప్పగా, 'ఇంట్లో ఏమీ లేవు' అని చెప్పింది నిర్దాక్షిణ్యంగా.

ఆ వేదపండితుడు పెళ్ళిలో మిగిలిన సత్తుపిండిని మూటకట్టి కుమార్తెకు ఇచ్చి భర్తతో సాగనంపాడు.

వారు ప్రయాణిస్తుండగా, మార్గమధ్యంలో కౌండిన్య మహర్షి సంధ్యా వందనం చేసి కొంతసమయం విశ్రమించాడు. ఆ సమయంలో నదీ తీరంలో కొందరు స్త్రీలు పూజ చేస్తుండటం చూసిన సుశీల, ''అది ఏమి పూజ?'' అని అడిగింది వారిని.

''అది అనంతపద్మనాభస్వామి వ్రతమని, ఆ వ్రతవిధానాన్ని ఆమెకు వారు తెలియచేశారు. వెంటనే సుశీల అక్కడే వారితో కలిసి శ్రీ అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని ఆచరించి, తన వద్ద ఉన్న సత్తుపిండితో అరిసెలు చేసి, బ్రాహ్మణునికి వాయనాన్ని సమర్పించింది. ఆ వ్రత ఫలితంగా సుశీలకు సకల సంపదలు చేకూరాయి. ఆశ్రమం ధన ధాన్యాలతో కళ కళ లాడసాగింది. ఒకరోజు కౌండిన్య మహర్షి తన భార్య చేతికున్న తోరణాన్ని చూసి, ఆమె మీద మండిపడుతూ, ''చేతికి ఆ తోరమేమిటి? నన్ను లోబరచుకోవటానికా? లేదా ఎదుటివారిని ఆకర్షించుకోవటానికి కట్టుకున్నావా'' అంటూ సుశీల చేతికి ఉన్న తోరాన్ని తెంచి వేసి, అగ్నికి ఆహుతి చేసాడు. సుశీల భర్త చర్యకు బాధపడుతూ, అనంత పద్మనాభ వ్రతాన్ని తోటి స్త్రీలతో కలిసి చేసానని, అది ఆ వ్రత తోరమని చెప్పినా, భార్య మాటలను పట్టించుకోలేదు ఆ మహర్షి.

క్రమక్రమంగా ఆశ్రమంలో దరిద్రం తాండవించసాగింది. ఆ తోరాన్ని నిర్లక్ష్యంగా మంటలో పడవేసినందు వల్లనే, తమ స్థితిలో మార్పు వచ్చిందని భావించి, పశ్చాత్తాపంతో తన తప్పును తెలుసుకున్నాడు కౌండిన్య మహర్షి. అనంత పద్మనాభుని దర్శించాలని బయలుదేరాడు. ఆ మార్గంలో చెట్టునిండా ఫలాలున్న ఒక వృక్షాన్ని చూసాడా మహర్షి. అయితే ఆ చెట్టు మీద ఒక పక్షి కూడా లేకపోవడం గమనించాడాయన.

అంతటా పచ్చికతో ఉన్న భూమిని చూసాడు. ఆ చెంతనే ఉన్న గోవు లాంటి పశువులను కూడా చూసాడు. కాని అవేవీ ఆ పచ్చగడ్డిని మేయటం లేదు. అక్కడే దగ్గరలో ఒక సరస్సు ఉంది. ఆ సరస్సులో నీరు నిండుగా ఉంది. నీటిలోకి దిగకుండా ఉన్న జలపక్షులను, కొంగ, బాతు లాంటి వాటిని చూసాడు. అస్తవ్యస్తంగా తిరుగుతున్న గాడిదను, ఏనుగును చూసి వాటిని అడిగాడు. ''మీకు అనంతపద్మనాభస్వామి తెలుసా? ఆయన ఎక్కడ ఉంటాడు?'' అని. అవి మాకు తెలియదు అని చెప్పాయి.

ఆ స్వామిని అన్వేషిస్తూ, ఆ స్వామి జాడ తెలియక సొమ్మసిల్లి పడిపోయాడా మహర్షి. అప్పుడు స్వామికి ఆ మహర్షి పట్ల కరుణ కలిగి, వృద్ధ బ్రాహ్మణ రూపంలో అతని ఎదుటకు వచ్చి, ఆ మహర్షిని తీసుకుని వెళ్ళి, తన నిజరూప దర్శనాన్ని ఆ మహర్షికి ప్రసాదించాడు. ఆ మహర్షి ఆయనను ఎన్నో విధాలుగా స్తుతించాడు.

తనకు మార్గంలో కనిపించిన వాటిని గురించి, ఆ బ్రాహ్మణుని అడిగాడా మహర్షి. ''ఆ మామిడి వృక్షం పూర్వజన్మలో విద్యలు, వేదాలు అభ్యసించిన విప్రోత్తముడు. విద్యాదానం చేయకపోవడం వల్ల మరుజన్మలో వృక్షమయ్యాడు. గత జన్మలో మహా ధనవంతుడైన మనిషి చేయిచాచి అడిగిన యాచకులకు, అన్నదానం చేయని వానికి ఆవుగా పుట్టే అవకాశం లభించింది. అయితే గత జన్మలోని అతని లోభత్వం కారణంగా పచ్చగడ్డిని కూడా ముట్టకుండా ఆకలితో ఉన్నాడు.

గత జన్మలో మహారాజయినా, ఆయన నిష్ప్రయోజనమైన బంజరు భూమిని బ్రాహ్మణులకు దానం చేయడం వల్ల మరుజన్మలో జలపక్షి అయి, జలం లోకి దిగకుండా, నివాసం లేకుండా ఉన్నాడు. లోభము వల్ల మనిషి గాడిద గాను, మదము, అహంకారం వల్ల ఇతర మానవులు గాడిదగానూ, ఏనుగు గానూ జన్మను పొందారు'' అని వివరించాడు అనంత పద్మనాభుడు ఆ మహర్షికి.

''మహర్షీ! నువ్వు శ్రీ అనంతపద్మనాభస్వామి వ్రతాన్ని 14 సంవత్సరాలు శుచిగా, భక్తి శ్రద్ధలతో చేసి, ఆ తర్వాత ఉద్యాపన చేయి. వ్రత నియమాలను పాటించు. అటు పిమ్మట నీకు నక్షత్ర లోకంలో స్థానం లభిస్తుంది'' అని చెప్పి ఆ స్వామి అదృశ్యమయ్యాడు. కౌండిన్య మహర్షి తన ఆశ్రమానికి వచ్చి జరిగినదంతా సుశీలకు చెప్పాడు. ఆ దంపతులు 14 సార్లు శ్రీ అనంతపద్మనాభస్వామి వ్రతాన్ని ఆచరించి, అనంతరం వ్రత ఉద్యాపన చేసి, మరణానంతరం నక్షత్ర లోకానికి వెళ్ళి, నక్షత్ర మండలంలో స్థానాన్ని సంపాదించుకున్నారు ఆ మహర్షి దంపతులు.

# అంగదుడు

– కొత్తపల్లి ఉదయబాబు

వ్యక్తిగత బాధ కన్నా ధర్మం గొప్పదని ఆచరించి చూపిన నాయకుడు అంగదుడు.

రామాయణం లోని వానర వీరులలో హనుమంతుని తరువాత ఎక్కువగా ప్రస్తావించబడే యువరాజు అంగదుడు. ఇతడు కిష్కింధ రాజైన వాలి కుమారుడు, తారాదేవి పుత్రుడు. వీరత్వం, ధైర్యం, బుద్ధిచాతుర్యం, రాజనీతి, ధర్మనిబద్ధత కలిగిన యువనాయకునిగా ఇతడు ప్రసిద్ధి పొందాడు.

ధర్మనిష్ఠ, వీరత్వం, ఆత్మగౌరవానికి ప్రతీక. భారతీయ ఇతిహాసాలలోని పాత్రలు కేవలం కథలలో కనిపించే వ్యక్తులు మాత్రమే కావు. అవి మానవ జీవితానికి మార్గదర్శకాలు. ప్రతి పాత్రలో ఒక ఆదర్శం, ఒక విలువ, ఒక జీవిత పాఠం దాగి ఉంటాయి. అలాంటి ఆదర్శప్రాయమైన పాత్రలలో రామాయణంలోని అంగదుడు ఒకడు. హనుమంతుడు, జాంబవంతుడు వంటి మహావీరుల మధ్య తన ప్రత్యేకతను చాటుకున్న అంగదుడు యువతకు స్ఫూర్తిదాయకమైన వ్యక్తిత్వానికి ప్రతిరూపం.

వాలి అపార బలశాలి కాగా, తార అసాధారణ జ్ఞానవతి. అందువల్ల అంగదుడిలో తండ్రి వీరత్వం, తల్లి వివేకం రెండూ సమపాళ్ళలో కనిపిస్తాయి.

వాలి మరణంతో అంగదుని జీవితం మలుపు తిరిగింది. వాలి మరియు సుగ్రీవుల మధ్య జరిగిన సంఘర్షణలో శ్రీరాముడు వాలిని సంహరించాడు.

ఆ సమయంలో అంగదుడు ఇంకా యువకుడు. తన తండ్రి మరణం అతడిని తీవ్రంగా కలచివేసింది. సహజంగా రామునిపై కోపం కలిగే పరిస్థితి ఉన్నప్పటికీ, తల్లి తార సూచనలు, ధర్మబోధల కారణంగా అతడు ప్రతీకార మార్గాన్ని ఎంచుకోలేదు. ఇది అంగదుని గొప్పదనాన్ని తెలియచేస్తుంది.

వ్యక్తిగత బాధకన్నా ధర్మం గొప్పది అనే భావనను అతడు ఆచరణలో చూపించాడు.

రామునిచే వాలి చంపబడిన తరువాత కిష్కింధకు సుగ్రీవుడు రాజయ్యాడు. ఆ వెంటనే అంగదునికి యౌవ రాజ్య పట్టము కట్టారు. ఇది సుగ్రీవుని ఉదారతను, అంగదుని ప్రతిభను సూచిస్తుంది.

తన తండ్రికిని, సుగ్రీవునకును శత్రుత్వమున్నా, పినతండ్రి వల్లనే తన తండ్రి చంపబడినా, అంగదుడు పూర్వపు శత్రుత్వాన్ని తలచుకోకుండా తనకు రాజైన సుగ్రీవుని కొలిచి ఉండేవాడు.

రాజ్యాన్ని కోల్పోయిన వాలి కుమారుడైనప్పటికీ అంగదుడు రాజద్రోహం చేయలేదు. సుగ్రీవుడికి విధేయుడిగా వ్యవహరించాడు.

సీతను వెదకుటకై అంగదుడు కొందరు వానరులతో కలిసి దక్షిణమునకు వెళ్ళాడు. ఆ బృందానికి అంగదుడు నాయకుడయ్యాడు. ఆ బృందంలో హనుమంతుడు, జాంబవంతుడు, నీలుడు వంటి మహావీరులు ఉన్నారు. అంతమంది మహనీయుల మధ్య నాయకత్వం వహించగలిగిన స్థాయికి అంగదుడు ఎదిగినట్లు ఈ సంఘటన మనకు తెలియచేస్తుంది.

అక్కడ సంపాతి (జటాయువు అన్నగారు) సీతను రావణుడెత్తుకొని లంకకు తీసుకొని పోయాడని చెప్పిన మీదట అంగదుడు తాను నూరు యోజనములు మాత్రమే దాటగలననియూ, అయితే లంకకు వెళ్ళినా తిరిగి వచ్చు ధైర్యము లేదనియు తన అశక్తిని గూర్చి నిర్భయంగా చెప్పాడు.

సీతను చూడకుండా తిరిగివెళ్తే సుగ్రీవుడు దండిస్తాడని, అంగదుడు ప్రాయోపవేశము చేయబోయాడు. జాంబవంతుడు అంగదుని చేత ఆ పని చేయడం తప్పు అని మందలించి మాన్పించాడు. అపుడు సముద్రమును హనుమంతుడు మాత్రమే దాటి తిరిగి రాగలడు అని అంగదుడే జాంబవంతునికి తెలిపాడు.

సముద్ర తీరంలో నిరాశ చెందిన వానరులను అంగదుడు ప్రోత్సహించాడు.

యుద్ధానికి ముందు శ్రీరాముడు చివరిసారిగా శాంతి ప్రయత్నం చేయాలని నిర్ణయించాడు.

ఆ రాయబారిగా అంగదుడిని లంకకు పంపాడు. లంకలో రాయబారిగా అంగదుని జీవితంలో అత్యంత ప్రసిద్ధ ఘట్టం ఇదే.

ఇది రామునికి అంగదునిపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం.

రావణుని సభలో అంగదుడు నిర్భయంగా నిలబడి ఇలా హెచ్చరించాడు. ''సీతాదేవిని అప్పగించు. లేకపోతే లంక వినాశనాన్ని తప్పించుకోలేవు''.

రావణుడు అతడిని అవమానించడానికి ప్రయత్నించాడు. అప్పుడు అంగదుడు తన పాదాన్ని సభ మధ్యలో ఉంచి ''ఈ పాదాన్ని కదిలించగలిగితే రాముడు ఓడిపోతాడు'' అని సవాలు విసిరాడు. ఎవరూ ఆ పాదాన్ని కదిలించలేకపోయారు.

ఈ సంఘటన అంగదుని అపార బలం, ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని చాటుతుంది.

రామ రావణ యుద్ధంలో అంగదుడు అనేక రాక్షస వీరులను సంహరించాడు. రావణుని కుమారులతో, ప్రముఖ యోధులతో యుద్ధం చేసి తన పరాక్రమాన్ని చాటాడు. అతడు కేవలం యువరాజు మాత్రమే కాదు, అత్యుత్తమ యోధుడని నిరూపించాడు.

రామ పట్టాభిషేకం తర్వాత రామ రావణ యుద్ధం ముగిసిన తర్వాత శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వెళ్ళాడు.

సుగ్రీవుడు, హనుమంతుడు, జాంబవంతుడు, అంగదుడు తదితరులు పట్టాభిషేక మహోత్సవానికి హాజరయ్యారు. ఆ తర్వాత అంగదుడు తిరిగి కిష్కింధకు వెళ్ళి సుగ్రీవుని తరువాత కిష్కింధ రాజ్యాన్ని పాలించాడు.

అంగదుని జీవితాన్ని పరిశీలిస్తే గొప్ప గుణాలు మనకు కనిపిస్తాయి. తండ్రి మరణానంతరం ప్రతీకారం కోరలేదు. ధర్మాన్ని ఎంచుకున్నాడు. యువ వయస్సులోనే మహావీరులకు నాయకత్వం వహించాడు. ఆత్మగౌరవంతో రావణ సభలో తలవంచలేదు. సుగ్రీవునికి, శ్రీరామునికి విశ్వాసపాత్రుడిగా నిలిచాడు. ధైర్యంతో అసాధ్యమైన పరిస్థితుల్లో కూడా వెనుకడుగు వేయలేదు. అంగదుని జీవితపాఠం మనకు చెప్పే సందేశం చాలా గొప్పది.

''జన్మించిన కుటుంబం మన గొప్పతనాన్ని నిర్ణయించదు. మన నిర్ణయాలు, మన ధర్మనిష్ఠ, మన ప్రవర్తనే మన వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి''. తండ్రిని కోల్పోయిన బాధను శక్తిగా మార్చుకున్నాడు. రాజ్యపరమైన విభేదాలను పక్కన పెట్టి ధర్మం పక్షాన నిలిచాడు. శత్రువుల సభలోనూ ఆత్మగౌరవాన్ని కోల్పోలేదు. అందుకే అంగదుడు రామాయణంలో యువతకు ఆదర్శప్రాయమైన నాయకునిగా నిలిచిపోయాడు. ధర్మం, వీరత్వం, నాయకత్వం, ఆత్మగౌరవం అనే నాలుగు మహా గుణాల వల్ల అతడు రామాయణంలో చిరస్మరణీయుడయ్యాడు.

రామాయణంలో అంగదుని అత్యంత ప్రసిద్ధ ఘట్టం రావణుని సభలో జరిగిన రాయబారం. యుద్ధానికి ముందు చివరిసారిగా శాంతి అవకాశాన్ని కల్పించాలనే ఉద్దేశంతో శ్రీరాముడు అంగదుడిని లంకకు పంపాడు. ఇది రాముడికి అంగదునిపై ఉన్న అపారమైన విశ్వాసానికి నిదర్శనం.

రావణుని సభలో అంగదుడు నిర్భయంగా నిలబడి సీతాదేవిని తిరిగి అప్పగించాలని, రామునితో యుద్ధం మానేయమని అంగదుడు హెచ్చరించాడు. కాని రావణుడు అతని మాటలు వినలేదు. రావణుడు అతనిని అవమానించటానికి ప్రయత్నించినప్పటికీ అంగదుడు తన ఆత్మగౌరవాన్ని కోల్పోలేదు. తన పాదాన్ని సభ మధ్యలో ఉంచి దానిని కదిలించమని సవాలు విసిరిన సంఘటన అతని అపార బలం, ఆత్మవిశ్వాసం, ధైర్యానికి చిరస్మరణీయ ఉదాహరణగా నిలిచిపోయింది.

రామ రావణ యుద్ధంలో కూడా అంగదుడు అసాధారణ పరాక్రమాన్ని ప్రదర్శించాడు. అనేకమంది రాక్షస వీరులతో యుద్ధం చేసి తన శౌర్యాన్ని చాటుకున్నాడు. యుద్ధంలో అంగదుడు రావణుని సేనాధిపతి అయిన మహాకాయుని చంపాడు. పటుతర దివ్యశక్తితో పోరాడటానికి రావణుడు హోమము చేస్తున్నాడని రాముడు విని ఆ హోమము పూర్తి కాకుండా భగ్నము చేయడానికి అంగదాదులను పంపాడు.

అంగదుడు రావణుని అంతఃపురమునకు పోయి ఏడుస్తున్న మండోదరిని జుట్టుపట్టుకుని రావణుని యెదుటకు ఈడ్చుకొని వచ్చాడు. రావణుడు హోమము చేయడం మాని తన భార్యను రక్షించడానికి వానరులతో యుద్ధం చేసాడు.

అయితే అతని గొప్పతనం కేవలం యుద్ధ విజయాలలోనే లేదు. తన శక్తిని ధర్మరక్షణ కోసం వినియోగించడంలో ఉంది. బలం ఉన్నవాడు వీరుడు కావచ్చు. కానీ ఆ బలాన్ని సత్యం కోసం ఉపయోగించినవాడే మహావీరుడు అవుతాడు. అంగదుడు అలాంటి మహావీరుడు. అంగదుని జీవితంలో మనకు కనిపించే గొప్ప పాఠం ఏమిటంటే, పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నప్పటికీ ధర్మాన్ని విడిచిపెట్టకూడదనేది. తండ్రిని కోల్పోయాడు. రాజ్యాన్ని కోల్పోయాడు. బాధను అనుభవించాడు. అయినప్పటికీ అసూయ, ద్వేషం, ప్రతీకారం అనే మార్గాలలో నడవలేదు. విధేయత, కర్తవ్యనిష్ఠ, ఆత్మగౌరవం, ధైర్యం అనే నాలుగు స్తంభాలపై తన వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్నాడు.

ఆధ్యాత్మిక దృష్టితో పరిశీలిస్తే అంగదుని జీవితం ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. భగవంతుని కార్యానికి అంకిత భావంతో పని చేసినవాడు ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతాడు. వ్యక్తిగత కష్టాల కన్నా ధర్మం గొప్పదని, అధికారాల కన్నా కర్తవ్యం గొప్పదని, కోపం కన్నా వివేకం గొప్పదని అంగదుడు తన జీవితంలో బోధించాడు.

సుగ్రీవుడు రామునితో అయోధ్యకు వెళ్ళిన పిమ్మట అంగదుడే కిష్కింధకు రాజయ్యెను.

రాముని ఆజ్ఞ వల్లననే అంగదుడు కృష్ణావతార కాలంలో బోయవాడై జన్మించాడు. ఇతడు వేసిన బాణాలే కృష్ణుని పాదమునకు గుచ్చుకుని అతని మరణమునకు కారణమయింది. రామావతారంలో వాలిని నిష్కారణంగా సంహరించిన పాపమే ఈ విధంగా శ్రీకృష్ణుని మరణానికి శాపమైందని జగన్నాథ మాహాత్మ్యము మనకు తెలుపుతున్నది.

* * *

# దుర్గా నవరాత్రి ఉత్సవం

- డాక్టర్ దేవులపల్లి పద్మజ, 9849692414

**దుర్గా దుర్గార్తి శమనీ దుర్గాపద్వి నివారిణీ ।**
**దుర్గమచ్ఛేదినీ దుర్గా సాధనీ దుర్గనాశినీ ॥**

లోకకల్యాణార్థం, మన కుటుంబసౌఖ్యం కోసం, సంకల్ప సిద్ధి కొరకు కానీ మనకున్న అవకాశాలతో ఉత్సాహంగా జగజ్జనని ఆరాధనలు చేస్తూ నియమానుసారం విశేష సేవల ద్వారా అనుగ్రహం పొందే సంప్రదాయం మనది. ఆ దుర్గాదేవి మన నిత్య జీవితంలో దుఃఖం లేకుండా సుఖసంతోషాలతో కుటుంబం అభివృద్ధి దశలో ప్రశాంతంగా సాగిపోవాలని కోరుకుంటూ ఆలయాల్లో దేశం సుభిక్షంగా, పాడిపంటలతో ధనధాన్యాలతో సాగిపోవాలనే సంకల్పంతో నవరాత్రులలో నవ అవతారాలలో మనకి దర్శింప చేస్తారు.

''ప్రథమా శైలపుత్రీచ, ద్వితీయ బ్రహ్మచారిణి, తృతీయ చంద్రఘంటేతి, కూష్మాండేతి చతుర్థకీ, పంచమా స్కంద మాతేతి, షష్ఠా కాత్యాయనేతిచ, సప్తమా కాళరాత్రీచ, అష్టమాచాతి భైరవీ, నవమా సర్వసిద్ధిశ్చాత్ నవదుర్గా ప్రకీర్తితా''.

శ్రీమాతను ఆరాధించే విధానమును శ్రీమార్కండేయ మహర్షికి బ్రహ్మ చెప్పినట్లు మనకు పురాణాలద్వారా తెలుస్తోంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు శరన్నవరాత్రులుగా మనం జరుపుకునే దసరా ఉత్సవాలు శక్తి రూపిణి అయిన దుర్గామాతను వివిధ రూపాలలో ప్రత్యేక పూజలతో పూజిస్తాము.

శక్తి ఆరాధన చేయదలచినవారు ప్రథమంగా గణపతిని పసుపుతో ప్రతిష్ఠించి నిర్విఘ్నంగా నవరాత్రుల దుర్గాపూజలు పూర్తిగావించి అఖండ ఫలితాలను ఆ తల్లి అనుగ్రహంతో పొందాలని సంకల్పం చెప్పుకోవాలి. నవరాత్రి కలశను ప్రతిష్ఠించి, నవధాన్యాలను కూడా ఒక పాత్రలో ప్రక్కనే పెట్టుకోవాలి. నవరాత్రులు శక్తికి ప్రతిరూపం కాబట్టి సక్రమంగా జరిపే పూజలు అద్భుతమైన ఫలితాలను ప్రసాదిస్తుంది. అదే విధంగా ఆచార విరుద్ధంగా సాగించే పూజలతో చెడు ఫలితాలు కూడా చవిచూడవలసి వస్తుంది. కలశం స్థాపన వీలుకాక పోతే మామూలుగా కూడా తల్లిని పూజింపవచ్చును. నైవేద్యం విషయంలో కూడా శక్తి కలిగిన విధంగా చేయవచ్చును. ఈ నవరాత్రి వ్రతము చేయువారు ఏకభుక్తము చేయాలి. ప్రతిదినము ఉదయము మరియు సాయంత్రము అమ్మవారి పూజ విధివిధానాలతో చేయాలి.

## 1.స్వర్ణ కవచాలంకారము

ప్రథమంగా పాడ్యమి నాడు స్వర్ణకవచ అలంకారంతో దుర్గాదేవిగా విధివిధానాలతో, షోడశోపచార పూజలతో పూజిస్తారు. ఆ రోజు చేమంతి పూవులను వినియోగిస్తారు. దుర్గా అష్టోత్తర నామములతో పూజ సల్పి, పులిహోర నైవేద్యంగా సమర్పిస్తారు. దుర్గా కవచ పారాయణ విశేష ఫలితాన్నిస్తుంది.

## 2. బాలాత్రిపుర సుందరి

శరన్నవరాత్రులలో విదియ నాటి అవతారము బాలాత్రిపురసుందరి. పరమేశ్వరుడే తనకు పతి కావాలని కోరుకుంది. త్రిపురుని అర్థాంగి కావటం వలన, అన్ని లోకాలలో ఈ తల్లి సౌందర్యవతి గావున బాలాత్రిపురసుందరిగా ఈ తల్లిని పిలుస్తారు. బాలా త్రిశతి స్తోత్రం అత్యంత ఫలదాయకము. ఈ రోజు అమ్మవారికి పొంగలి నైవేద్యం పెట్టి అర్చిస్తే అభీష్ట సిద్ధి కలుగుతుంది. అమ్మవారిని ఆకుపచ్చ రంగు వస్త్రముతో అలంకరించి, గులాబీలతో అర్చిస్తే శుభప్రదము. శ్రీశైలం దేవస్థానములో అమ్మవారిని బ్రహ్మచారిణి రూపంలో అలంకరిస్తారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారిని బాలాత్రిపురసుందరి అవతారంలో అలంకరిస్తారు.

## 3. గాయత్రిదేవి

దుర్గానవరాత్రులలో మూడవ రోజైన తదియనాడు అమ్మవారిని గాయత్రి అవతారంలో అర్చిస్తాము. సకల మంత్రాలకు మూలశక్తి అయిన గాయత్రీదేవి ముక్త, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో కూడిన అయిదు ముఖాలతో శంఖము. చక్రము, గద మరియు అంకుశం ధరించి దర్శనమిస్తుంది. గాయత్రిదేవిని త్రిశక్తి స్వరూపంగా భావిస్తారు. విజయవాడలో కొలువైయున్న కనకదుర్గ ఈరోజు గాయత్రిమాత అలంకారంలో దర్శనమిస్తుంది. శ్రీశైలంలోని భ్రమరాంబ ఈ రోజు చంద్రఘంట అవతారంలో దర్శనమిస్తుంది. అర్థాకృతిలోని చంద్రరేఖను శిరస్సుపై ధరించే రూపం చంద్రఘంట. ఈరోజు అమ్మవారికి ఎరుపు రంగు వస్త్రము, కనకాంబరాలతో అలంకరించాలి. ఈమెకు పాయసం, అల్లపు గారెలు నివేదన చేయాలి.

## 4. అన్నపూర్ణ

దసరా నవరాత్రులలో నాల్గవరోజైన చవితినాడు అమ్మవారిని అన్నపూర్ణమాతగా ఆరాధిస్తారు. ఈమె ఒక చేతిలో అక్షయ పాత్రతో మరియొక చేతిలో గరిటెతో దర్శనమిస్తుంది కావున ఈమెను అన్నపూర్ణగా పూజిస్తారు. సాక్షాత్తు పరమేశ్వరునికే భిక్షనొసంగిన అన్నపూర్ణ అక్షయములైన శుభాలను అన్నపూర్ణాష్టక పారాయణ శుభదాయకము. ఈమెకు పులిహోర, పెసరపప్పు పాయసం నివేదన చేయాలి. విజయవాడ కనకదుర్గమ్మ అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. శ్రీశైలంలోని భ్రమరాంబ కూష్మాండ రూపంలో దర్శనమిస్తారు. కూరగాయలతో చేసిన కదంబం నివేదన చేయాలి.

## 5. లలితా త్రిపురసుందరి

దసరా నవరాత్రులలో అయిదవ రోజైన పంచమి తిథినాడు అమ్మవారు లలితాత్రిపురసుందరిగా ఆరాధిస్తారు. శ్రీచక్రముపై ఎడమ పాదమును మోపి, చెరకు విల్లు, పుష్ప బాణములు ధరించి బంగారు సింహాసనముపై ఆశీనురాలైవుంటుంది. లలితా కవచపారాయణ, లలితా సహస్రనామ పారాయణ అత్యంత ఫలదాయకము. లలితాదేవికి గులాబీరంగు వస్త్రము ధరింపచేసి, నీలంరంగు పువ్వులతో పూజచేసి పాయసం నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈరోజు లలితా త్రిపురసుందరీగా దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు స్కందమాతగా దర్శనమిస్తుంది. గోధుమ రవ్వతో చేసిన కేసరి, మిరియాల పొంగలి నివేదన చేయాలి. నీలం రంగు వస్త్రములతో అలంకరిస్తారు.

## 6. మహాలక్ష్మి

దుర్గానవరాత్రులలో ఆరవరోజైన షష్టి తిథినాడు అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అర్చిస్తారు. సిరిసంపదలకు, సౌభాగ్యానికి, సుఖసంతోషాలకు, సంతానానికి ప్రతీక. జగత్తు స్థితి కారకుడైన శ్రీమహావిష్ణువునకు తోడుగా మహాలక్ష్మి ఉద్భవించినదని దేవీభాగవతంలో చెప్పబడినది. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు భక్తులకు మహాలక్ష్మీ అవతారంలో దర్శనమిస్తారు. ఈ తల్లిని శ్రీసూక్త పారాయణతో, మహాలక్ష్మి సహస్రనామములతో, మహాలక్ష్మ్యాష్ట స్తోత్రముతో స్తుతించాలి. ఈ తల్లికి తెలుపురంగు చీరను సమర్పించి, కలువపూవులతో, తామరపూవులతో అర్చించాలి. నైవేద్యంగా పూర్ణం బూరెలు సమర్పించాలి. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈమెను పసుపు రంగు వస్త్రాలతో అలంకరించి మాతకు బెల్లం అన్నం, ముద్ద పప్పు నైవేద్యంగా సమర్పించాలి.

## 7. సరస్వతీమాత

దుర్గానవరాత్రులలో ఏడవ రోజైన సప్తమి తిథినాడు అమ్మవారిని సరస్వతి అవతారంలో ఆరాధిస్తారు. దేవతామూర్తులలో చదువుల తల్లిగా సరస్వతీ దేవి కొలువబడుతుంది. త్రిమూర్తులలో ఒకరైన బ్రహ్మ పట్టపురాణి. సృష్టి కార్యం నిర్వహించటానికి బ్రహ్మకు తోడుగా ఈమెను మహాశక్తి సృజించినట్లుగా దేవీభాగవతం తెలియచేస్తోంది. తెల్లని పద్మముపై ఆసీనురాలై వీణ, దండ, కమండలం, అక్షమాల ధరించి అభయముద్రతో దర్శనమిస్తూ భక్తులకు జ్ఞానజ్యోతిని ప్రసాదిస్తుంది. ఈ రోజు మూలా నక్షత్రము గావటం వలన సరస్వతీ అవతారంలో దర్శనమిస్తుంది. విద్యార్థులచేత అక్షరాభ్యాసాలు చేయిస్తారు. ఈ మాతకు తెల్లని లేదా పసుపు రంగు వస్త్రాలు సమర్పించి, బెల్లం అన్నం, ముద్దపప్పు నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు సరస్వతీ అవతారంలో దర్శనమిస్తారు. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు కాళరాత్రి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ తల్లికి ఆకుపచ్చ వర్ణం వస్త్రాలతో అలంకరించి దద్ధోజనం, చక్కెర పొంగలి నైవేద్యంగా సమర్పించాలి.

## 8. మహాదుర్గ

దుర్గానవరాత్రులలో ఎనిమిదవ రోజైన అష్టమినాడు అమ్మను మహాదుర్గగా ఆరాధిస్తారు. పంచ ప్రకృతి రూపాలలో మొదటిది దుర్గా రూపము. సింహవాహనముపై అధిరోహించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తుంది. దుర్గముడనే రాక్షసుని సంహరించి, దుర్గతులను నాశనమొనరించి నందువలన ఈమెను దుర్గాదేవి అని కూడా పిలుస్తారు. ఈరోజు దుర్గాసప్తశతి, చండీ పారాయణ, దుర్గా స్తోత్రము విశేష ఫలదాయకము. ఎరుపు రంగు వస్త్రము, ఎరుపు రంగు పూవులు అమ్మవారికి సమర్పించాలి. అమ్మవారికి పొంగలి, పులిహోర, పులగం నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడలో కనకదుర్గమ్మ ఈరోజు మహాదుర్గగా భక్తులకు దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు మహాగౌరిగా భక్తులను అనుగ్రహిస్తుంది. ఈ తల్లికి గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పించాలి.

## 9. మహిషాసుర మర్ధిని

తొమ్మిదవ రోజైన నవమిని మహర్నవమి అని కూడా వ్యవహరిస్తారు. మహిషాసుర మర్ధిని స్తోత్రమును భక్తి శ్రద్ధలతో దుర్గానవరాత్రులలో నవమి రోజున మహిషాసుర మర్ధిని రూపంలో యున్న అమ్మ అనుగ్రహం కోసం భక్తులు పఠిస్తారు.

మహిషుడు గర్వమునకు, మదమునకు అంధకారమునకు ప్రతీక. ఈ రోజు దుర్గాసప్తశతి పారాయణ, ఖడ్గమాలా స్తోత్ర పారాయణ అత్యంత ఫలదాయకము. ఈ రోజు అమ్మవారికి పానకం, వడపప్పు, గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పించాలి. ఎరుపు రంగు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు మహిషాసుర మర్థిని రూపంలో భక్తులకు దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబను ఈ రోజు సిద్ధిధాత్రి అవతారంలో అలంకరిస్తారు. ఈ రోజు ఛండీ సప్తశతి, ఖడ్గమాల పారాయణ చేయాలి. ఈ తల్లికి కొబ్బరి అన్నం, నిమ్మకాయ పులిహోర నైవేద్యంగా సమర్పించాలి.

## 10. రాజరాజేశ్వరీ దేవి

దుర్గానవరాత్రులలో ఆఖరి అవతారము శ్రీరాజరాజేశ్వరి. పరమేశ్వరుని అంకముపై ప్రకాశముతో వెలుగొందుతూ, పరమేశ్వరుని వామాంకములో ఆసీనురాలై భక్తులకు ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తిని ప్రసాదించే అవతారము శ్రీరాజరాజేశ్వరి. ఈరోజు ఈ తల్లిని లలితా సహస్రనామ పారాయణ చేసి ఆరాధించాలి. చేమంతులతో పూజ చేయాలి. భక్ష్య, భోజ్యములతో మహానివేదన చేయాలి. బంగారు కవచధారణ చేస్తారు లేదా బంగారు వర్ణముగల వస్త్రముతో అలంకరిస్తారు. ఈ రోజున విజయదశమిగా పూజిస్తాము. ఈ రోజు అశ్వపూజ, ఆయుధపూజ, ఉచ్ఛైశ్రవ పూజ, వాహన పూజ నిర్వహిస్తారు. శ్రీరాముడు విజయదశమి రోజున రావణుని సంహరించి విజయం పొందాడు. దశమి రోజు సాయంత్రము నక్షత్ర దర్శన సమయంలో శమీవృక్షము వద్ద అపరాజితాదేవిని స్మరిస్తారు. ''శమీ శమయతే పాపం, శమీ శతృవినాశిని ` అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియ దర్శినీ'' అనే ఈ మంత్రముతో తమ తమ గోత్రనామాలు చెప్పుకుని జమ్మి వృక్షాన్ని పూజ చేసి మూడు ప్రదక్షిణలు చేస్తారు.

దేవీ ఉపాసకులు అంతవరకు తాము చేసిన జప సంఖ్య ననుసరించి తగువిధముగా హోమాలు చేస్తారు. నవరాత్రి వ్రత సమాప్తి గావించిన వారికి సర్వ సిద్ధులు, సర్వాభీష్ట సిద్ధి కలుగుతుంది.

దసరా నవరాత్రులలో వైభవోపేతమైన దుర్గాదేవి పందిళ్ళు మనకి వాడవాడలా శోభాయమానంగా ఆహ్వానం పలుకుతాయి. శ్రీ మాతాదేవ్యైనమః శుభం భూయాత్.

* * *



## ఉచిత కళ్యాణాల కార్యక్రమం సమాప్తం

తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే హరినామక్షేత్రం నిర్మించుటకు తగిన యోగ్యత సాధించుటకై నిర్దేశించిన, స్వామివారు ప్రసాదించిన రెండవ సంకల్పమైన 111 ఉచిత కళ్యాణాల కార్యక్రమము స్వామి శక్తితో తేది 27-09-2026 నాడు ముగిసింది. ఈ కార్యక్రమము తేది 21-07-2021 నాడు మొదలుపెట్టి 5 సం||ల 2 నెలల కాలములో 111 కళ్యాణాలు పూర్తైనందుకు స్వామివారికి ధన్యవాదాలు తెలుపుతున్నాము. మరియు ఈ కళ్యాణాలు నిర్వహించి సహకరించిన ప్రతి భక్తునికి స్వామివారు కృపా కటాక్షాలు ప్రసాదించమని ప్రార్థిస్తున్నాము. నమో వేంకటేశాయ.

### 110 వ కళ్యాణం

ఇది తేది 06-09-2026 ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. జి.హెచ్.ఎం.సి పార్క్ ప్రక్కన, ప్రగతినగర్ కాలనీ, రామంతాపూర్, హైదరాబాద్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ గుంటుక రవీందర్ రెడ్డి, రూపాదేవి దంపతులు నిర్వహించారు.

### 111 వ కళ్యాణం

ఇది తేది 27-09-2026 ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇది వాసవీనగర్ కమ్యూనిటీ హాల్, ఓల్డ్ వాసవీనగర్, కార్ఖానా, సికింద్రాబాద్ లో జరిగింది. దీనిని వాసవీక్లబ్ సికింద్రాబాద్ కపుల్స్ వారు నిర్వహించారు.

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

తెలియని మానసిక ఉద్వేగాలు కలుగవచ్చును. శనికి తైలాభిషేకం చేయుట మంచిది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన, "శరవణభవాయ నమః" జపము చేయవలెను. కోర్టు కేసులు, ప్రమాద భయాలు, పై అధికారుల ఒత్తిడి తగ్గును. దుర్గాదేవి, సరస్వతీ దేవి పూజలు నిరంతరం చేయవలెను.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

సామాన్యంగా ఉంటుంది. ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరించవలెను. అధికారుల వలన ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు. అధిక ఆశతో ధనం నష్టం కలగవచ్చును. ఆర్థిక వెసులుబాటు తక్కువగా ఉంటుంది. నిరంతరం "ఓం నమో నారాయణాయ" నామస్మరణ చేయవలెను.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులకు ఈ మాసం కొంత ఇబ్బందికరముగా ఉండును. దుర్గాదేవిని శరణు కోరుతూ, సాయంత్ర సమయమున అమ్మవారికి అష్టోత్తర సహస్రనామార్చనను కుంకుమతో శ్రీచక్రమునకు చేయవలెను.ప్రతి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించవలెను. సంతానానికి అనారోగ్య సూచనలు ఉన్నాయి. దసరా వరకు అమ్మవారి రక్ష ప్రధానము.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశివారికి సామాన్య ఫలితములు. ధన సంబంధ ఇబ్బందులు ఉన్నా క్రమంగా సర్దుకుంటాయి. విక్రమార్కునిలా నిబ్బరంగా పట్టు విడవకుండా ముందుకు సాగాలి. ఇష్టదైవ ఆరాధనతో పాటు నవగ్రహ శ్లోకాలు, ప్రదక్షిణలు, దానాలు చేయుట శ్రేయస్కరం.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

సామాన్యంగా అనుకూలమైన మాసం. వాహన ప్రయాణాలలో జాగ్రత్తలు అవసరం. అవసరాలకు ధనం సమకూరుతుంది. విందు-వినోదాలు, కాలక్షేపాలు ఉంటాయి. అమ్మవారి ఆరాధన సమస్యలకు పరిష్కారం చూపుతుంది.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ-పురుషులకు అత్యంత అనుకూలంగా ఉంటుంది. సాక్షాత్తు అమ్మ కాళికాదేవి అనుగ్రహం పొందగలరు. నూతన శక్తితో ఆటంకములు తొలగి అభివృద్ధి మార్గంలో ముందుకు సాగుతారు. శుభకార్యములు, దసరా పూజలు, బంధు-మిత్రుల కలయిక కలుగుతాయి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులకు అనుకూల కాలం. అవసరమైన సమయంలో ధనం చేతికందుతుంది. బంధు-మిత్రుల సహకారం మళ్లీ లభిస్తుంది. కుటుంబంలో కొంత శాంతి నెలకొంటుంది. నవగ్రహ ఆరాధనతో పాటు దుర్గాదేవి, సరస్వతీదేవి పూజలు చేయుట వలన గత కష్టాలను మర్చిపోగలరు.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులకు అనుకూలంగా ఉంటుంది. బంధు-మిత్రుల ఆప్యాయత పెరుగుతుంది. అయితే ఉద్రేకంతో వ్యవహరిస్తే పనులు మధ్యలో నిలిచిపోవచ్చు. శ్రమకు తగిన ఫలితం ఆలస్యం. మాటను అదుపులో ఉంచుకోవలసిన కాలం. దుర్గాదేవి పూజలు చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ మాసమున ఆర్థికంగా అనేక విధాల చిక్కులు రావచ్చు. డబ్బు విషయంలో అత్యవసరమైతేనే ఖర్చు చేయాలి. వ్యాపారంలో తెలియని సమస్యలు. బంధుమిత్రులు దూరంగా ఉండవచ్చు, స్నేహితుల సహాయం లభించదు. సూర్యనారాయణ వ్రతం ఆచరించుట శ్రేయస్కరం.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి వారికి అనుకూల ఫలితములు. నూతన వ్యాపారాలపై ఆసక్తి కలుగుతుంది. గృహ సంబంధ విషయాలు, విందు వినోదములు పెరుగుతాయి. అందరిలో పలుకుబడి పెరిగి ఆత్మీయులతో ముచ్చట్లు సంతృప్తినిస్తాయి. దుర్గాదేవి పూజలు చేయుట వలన ఆభరణ ప్రాప్తి కలుగుతుంది.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి వారికి సామాన్య ఫలితములు. అనుకున్నవి అనుకున్నట్లు జరగకపోయినా బాధపడరాదు. మాటలను పొదుపుగా వాడాలి. తక్కువగా మాట్లాడి ఎక్కువగా పనిచేయాలి. వాత సంబంధ దోషాల వలన ఆరోగ్యంలో తేడాలు రావచ్చు.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ మాసమున అనుకూల ఫలితములు. ఆర్థిక విషయాలలో హుందాగా వ్యవహరిస్తారు. చాలా కాలంగా రావలసిన ధనం చేతికందుతుంది. విందు వినోదములు కలుగుతాయి. దుర్గాదేవి పూజలు ఆచరించండి. నిరంతరం అమ్మను భక్తితో ఆరాధిస్తే కోరికలు తీరును.



# మీ విజ్ఞానం

నిర్వహణ: డా. లలితవాణి

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదిలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

**ఈ కింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి**

1. గణపతి గజముఖంతోనే పుట్టాడని ఏ పురాణంలో ఉంది?
2. గోవిందదాసు ఇంటికి రావడానికి స్వామివారు ఏ స్థితిలో ఉన్నారు?
3. శ్రీకృష్ణుడు లక్షణా దేవిని ఎలా వివాహం చేసుకున్నాడు?
4. కృతయుగంలో గణపతి పేరేమిటి?
5. సప్త ఋషులు ఉదయించేది ఎప్పుడు?
6. అష్టావక్రుని భార్య ఎవరు?
7. అష్టావక్రుడు పూర్వజన్మలో ఎవరు?
8. శ్రీ రాధాకృష్ణ సిద్ధాంతాన్ని ఏ గ్రంథం చెప్పింది?
9. వానర రాజ్యానికి యువరాజు ఎవరు?
10. గణపతికి ఎలుకను వాహనంగా ఇచ్చిందెవరు?
11. ఆకాశరాజు పూర్వజన్మలో ఎవరు?
12. శుక మహర్షికి వరాలు ప్రసాదించిన పుణ్యనది ఏది?
13. శ్రీహరి అవతారాలలో హయగ్రీవునిది ఏ అవతారం?
14. కలి అంటే అర్థం ఏమిటి?
15. గణపతి స్త్రీ రూపం ధరించి ఎవరిని వధించాడు?

1 ______
2 ______
3 ______
4 ______
5 ______
6 ______
7 ______
8 ______
9 ______
10 ______
11 ______
12 ______
13 ______
14 ______
15 ______

పేరు: ______

చిరునామా: ______

______

______

పిన్‌కోడ్: ______ ఫోన్: ______


# శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. పాంచజన్యం
2. సంజ్ఞాదేవి
3. పాము రూపంలో
4. శ్రావణ శుక్లపంచమి
5. దక్షుని కూతురు
6. కర్కోటకుడు
7. పరమేశ్వరుడు పార్వతికి
8. ఏకపాదుడు
9. భోగవతి
10. వంది
11. నలుడు
12. కుశధ్వజుడు
13. సువర్ణ రంగడోలోత్సవంలో
14. అష్టావక్రుడు
15. ఆనందాద్రి

## సరైన సమాధానాలు రాసినవారు

1. చింతలపాటి శివశంకర శాస్త్రి
2. పి.యశోద
3. జె.రాధాకుమారి
4. వి.వసుంధర
5. చిల్లర సీతారామారావు

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**పి.యశోద**


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy,** Cell: **93482 12354.** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com



# 24వ పర్యాయం - 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు













RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



## 24వ పర్యాయం - 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు








**If Un Delivered Please Return to:**
**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq